20-7Pg1exHMNWJQE_20-7Pg1exHMNWJQE.qxd 20/Jul/26 12:18 AM Page 1

మాణిక్యం
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

గుంటూరు

: fb.com/vaartha Digital

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

20-7-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 170 పేజీలు: 12 వెల: 6.50

జమ్ము-కాశ్మీర్‌లో వరద విలయం

పార్లమెంటు ర్యాలీని విజయవంతం చేయండి: వాంగ్‌చుక్

9లో


# ఆగస్టు 15లోగా 2.50 లక్షల ఇళ్లు

## డిసెంబరునాటికి మరో 2.38 లక్షల ఇళ్లు పూర్తి

## నిర్దేశిత గడువులోగా సామూహిక గృహప్రవేశాలు

## 2027 చివరికి రీ సర్వే పూర్తి

## బస్‌స్టేషన్ల ఆధునీకరణకు చర్యలు: సిఎం చంద్రబాబు



**విజయవాడ,జులై 19,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో అర్హులైన లబ్దిదారులకు గృహాలను నిర్మించి ఇచ్చే విషయంలో ఎంత మాత్రం అలసత్వం ఉండకూడదని సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు.ఆగస్టు 15లోగా 2.50 లక్షల ఇళ్లకు సామూహిక గృహ ప్రవేశాలు జరగాలని సిఎం ఆదేశించారు. ఈ యేడాది డిసెంబర్ నాటికల్లా మరో 2.38 లక్షల ఇళ్లకు గృహ ప్రవేశాలు జరిగేలా చర్యలు తీసుకోవాలి. సంతృప్త స్థాయిలో అందరికీ ఇళ్లు ఇవ్వాలని... అవసరమైన వారికి ఇళ్ల స్థలాలు, ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి క్రమబద్ధీకరించడం వంటి అంశాలపై ప్రభుత్వ యంత్రాంగం ఫోకస్ పెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. 2027 చివరి నాటికి రీసర్వే పూర్తి చేయడంతో పాటు... 22ఏ భూముల సమస్యలను పరిష్కరించాలని స్పష్టం చేశారు. పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సిఎం చంద్రబాబు నాయుడు అధికారులతో వర్చువల్‌గాను, మౌఖికంగా చర్చించారు.
2027 డిసెంబర్ నాటికి మరో 10 లక్షల ఇళ్ల నిర్మాణం లక్ష్యం. 2లక్షల మందికి ఇంటి జాగాలు అవసరం అవుతాయని అంచనా. 3 సెంట్లు గ్రామాల్లో, 2 సెంట్లు అర్బన్ ప్రాంతాల్లో ఇళ్లస్థలాలు ఇవ్వాల్సి ఉంది. లబ్దిదారులుఅంగీకరిస్తే... ప్రస్తుతం ఉన్న వారికి అదే లే అవుట్లల్లో ఇళ్ల స్థలాలు ఇవ్వండి. ఇబ్బందులు లేనిచోట భూసేకరణ, సమీకరణతో ఇళ్ల స్థలాలు ఇవ్వండి. ప్రభుత్వ భూములు, కొండ ప్రాంతాల్లో నిర్మించుకున్న ఇళ్లను క్రమబద్ధీకరించాలి. ఇళ్ల క్రమబద్ధీకరణలో ఏమైనా ఇబ్బందులు వస్తే కెబినెట్‌కు పంపాలన్నారు మేం ఆమోదిస్తాం. ఇళ్ల క్రమబద్ధీకరణ పూర్తి చేయగలిగితే..విజయవాడలో 60 వేల మందికి, విశాఖలో 30 వేల మందికి లబ్ది చేకూరుతుంది. గుంటూరులో 22ఏ భూముల సమస్యలను పరిష్కరించాలి. భూవివాదాల్లో అతిపెద్ద లిటిగెంట్ రెవెన్యూ విభాగమే. 4 లక్షలకు పైగా భూవివాదాల కేసులు పెండింగులో ఉన్నాయి. ఖాళీగాఉన్న డిఆర్వోలు, ఆర్డీవోల స్థానాలకు త్వరలో పోస్టింగ్స్ ఇస్తాం. జిల్లా కార్యాలయాల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలుచేపడదాం. రీసర్వే ప్రక్రియను 2027 మార్చి లోగా పూర్తి చేయాలి... పట్టాదారు పాస్ పుస్తకాలు కూడా జారీ కావాలని సిఎం ఆదేశించారు. యేడాదికి రూ. 1940 కోట్లను స్త్రీ శక్తికి ఖర్చు పెడుతున్నాం. తల్లికి వందనం ద్వారా 67 లక్షల మందికి రూ.10 వేల కోట్ల ఇస్తున్నాం. మే 19వ తేదీన మత్స్యకారుల సేవలో కార్యక్రమం రూ.286 కోట్ల మేర లబ్దిదారులకు పంపిణీ చేస్తున్నాం. హాస్టళ్లల్లో ఏదీ వృధా కాకుండా చూడాలి. నెట్ జీరో విధానాన్ని హాస్టళ్లకు వర్తింప చేయాలి. హాస్టళ్ల కిచెన్ల నుంచి వ్యర్థాలను సర్క్యులర్ ఎకానమీకి అనుసంధానం చేయాలి.. నెట్ జీరో హెల్తీ క్యాంపస్‌లు ఏర్పాటు చేయాలి. కిచెన్, ఫ్రూట్ గార్డెన్లు వచ్చేలా చూడాలి. గిరిజన, ఎస్సీ సంక్షేమశాఖలో చదువుతున్న విద్యార్థులు ఐఐటీ ర్యాంకులు సాధించేలా శిక్షణ ఇవ్వాలి. పావలా వడ్డీకే జాతీయ, అంతర్జాతీయ సంస్థల్లో చదువుకునేలా విద్యారుణం ఇప్పించేలా కార్యాచరణ చేపట్టాలి. విదేశాల్లో ఉద్యో >>2

# అఖిలపక్షం రసాభాస



అఖిల పక్ష సమావేశానికి హాజరైన కేంద్రమంత్రులు రాజ్‌నాథ్, రిజిజు, నడ్డా తదితరులు

## టిఎంసి రెబల్ ఎంపిలకు ఆహ్వానంపై ప్రతిపక్షాలు మండిపాటు.. వాకౌట్

## అనంతరం సమావేశానికి విపక్షాలు హాజరు.. సభలో చర్చకు అవకాశమివ్వాలని వినతి

## పార్లమెంట్ సమావేశాలు సజావుగా జరిగేలా అన్ని పార్టీలు సహకరించాలి: కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్, జెపి నడ్డా, కిరణ్ రిజిజు

**న్యూఢిల్లీ, జులై 19:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముందు ఆదివారం నిర్వహించిన అఖిలపక్ష సమావేశం రసాభాసగా సాగింది. అఖిలపక్ష భేటీకి టిఎంసి రెబల్ ఎంపిలను ఆహ్వానించడానికి కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి పక్షాలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ, సమావేశం నుంచి వాకౌట్ చేశాయి. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా తీసుకున్న నిర్ణయాలకు నిరసనగా ఈ చర్య చేపట్టినట్లు ప్రతిపక్ష నేతలు తెలిపారు. కొద్దిసేపు అనంతరం ప్రతిపక్ష పార్టీల నేతలు అఖిలపక్ష సమావేశానికి హాజరయ్యారు. తమ వాదనను వినిపించారు. కేంద్రమంత్రులు రాజ్‌నాథ్ సింగ్, జెపి నడ్డా, కిరణ్ రిజిజు నేతృత్వంలో ఆదివారం అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లతో సమావేశాన్ని నిర్వహించారు. సమావేశాలు సజావుగాజరిగేందుకు అన్ని రాజకీయ పార్టీలు >>2

# నేటి నుంచి పార్లమెంట్



## ఆగస్టు 13 దాకా సమావేశాలు

## కీలక బిల్లులు ప్రవేశపెట్టనున్న ప్రభుత్వం

## నేడు రాజ్యసభకు 'వందే మాతరం' బిల్లు

**న్యూఢిల్లీ, జులై 19:** పార్లమెంటు వర్షాకాల సమావేశాలు నేటి (సోమవారం) నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాలు ఆగస్టు 13 వరకు కొనసాగనున్నాయి. ఈ సమావేశాల్లో కీలక బిల్లులు, ప్రజా ప్రాధాన్య అంశాలపై చర్చలు జరగనున్నాయి. నీట్ యుజి పేపర్ లీక్, అయోధ్య వివాళాల చోరీ తదితర అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీయడానికి కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి సిద్ధమైంది. కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, జెపి నడ్డా, కిరణ్ రిజిజు ఆధ్వర్యంలో ఆదివారం అఖిల పక్ష >>2

# రాష్ట్రంలో 16కు పెరిగిన కొవిడ్ కేసులు

## నలుగురు మృతి

## కడప జిల్లాలో అధికంగా నమోదు

**విజయవాడ, జులై 19,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో కొవిడ్ కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతుంది.తాజా నివేదికను అనుసరించి 16కి చేరినట్లు వైద్యఆరోగ్య శాఖ వెల్లడించింది. ఈ క్రమంలోనే బోధనాసుపత్రుల్లో ప్రత్యేక వార్డులు సిద్ధం చేశామని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ప్రస్తుత పరిస్థితులకు తగ్గట్లు ఆసుపత్రులను సన్నద్ధం చేసినట్లు పేర్కొన్నారు. కొవిడ్ కేసులు గుర్తించడానికి అవసరమైన కిట్లు, ఇతర సదుపాయాలు సమకూరుస్తున్నామని ఆయన వెల్లడించారు. ఎపిలో గుర్తించిన కొవిడ్ పాజిటివ్ కేసులకు ఒమిక్రాన్ ఆర్‌ఎఫ్.5 వేరియంట్ కారణమని పరీక్షలో తేలింది. కొవిడ్2 వైరస్ కాలక్రమంలో తన జన్యువుల్లో మార్పులు చేసుకుని ఒమిక్రాన్ వేరియంట్‌గా ఏర్పడిందని వైద్యారోగ్య శాఖ పేర్కొంది. ఆ వంశానికి చెందిన ఉప వేరియంట్ ఆర్‌ఎఫ్.5 అని తెలిపింది. వైఎస్సార్ కడప జిల్లాలో నమోదైన కొవిడ్ పాజిటివ్ కేసుల్లో నాలుగు నమూనాలను పుణెలోని జాతీయ వైరాలజీ ల్యాబ్‌కు పంపారు. ఈ క్రమంలోనే జీనోమ్ సీక్వెన్సింగ్ పరీక్షల్లో ఒమిక్రాన్ ఆర్‌ఎఫ్.5గా తేలిందని వైద్యారోగ్యశాఖ అధికారులకు పరీక్షల ఫలితాల నివేదిక అందింది. పుణె నుంచి అందిన ఫలితాలు, వేరియంట్ ప్రభావం, ఎపిలో తాజా పరిస్థితులపై వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ ఉన్నతాధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నారు.. ఆర్‌ఎఫ్.5ను డబ్ల్యూహెచ్‌వో సాధారణ వేరియంట్‌గానే పరిగణన లోకి తీసుకుందని డిఎంఇ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్, సత్యకుమార్‌యాదవ్‌కు వివరించారు. ఈ వైరస్ తీవ్ర ఇబ్బంది కలిగిస్తుందనడానికి ఎలాంటి ఆధారాలూ లేవని చెప్పారు. సింగపూర్‌తోపాటు ఆగ్నేయాసియాలోని కొన్ని దేశాల్లో ఆర్‌ఎఫ్.5 కేసులు ఎక్కువగా నమోదయ్యాయని డిఎంఇ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్, సత్యకుమార్ యాదవ్‌కు వివరించారు ఇతర ఒమిక్రాన్ వేరియంట్లతో పోలిస్తే ఇది ప్రమాదకరం అనడానికి ఆధారాలు లేవన్నారు. ఈ వైరస్ సోకితే దగ్గు, జ్వరం, గొంతు నొప్పి, తల >>2



# చరిత్ర సృష్టించిన భారత్ స్టార్ షట్లర్ సింధు

## జపాన్ ఓపెన్ మహిళల సింగిల్స్‌లో విజయం

## ఫైనల్లో యమగుచిని ఓడించి టైటిల్ కైవసం

**టోక్యో, జులై 19:** భారత్ స్టార్ షట్లర్ పివి సింధు... జపాన్‌లో చరిత్ర సృష్టించింది. రెండేళ్ల టైటిల్స్ కొరతకు ముగింపు పలికింది. అద్భుత ఆటతీరుతో ఫైనల్‌కు దూసుకొచ్చిన సింధు... జపాన్ ఓపెన్ మహిళల సింగిల్స్ తుదిపోరులోనూ అటాకింగ్ గేమ్‌తో విరుచుకు పడింది. ప్రపంచ నెంబర్3 ర్యాంకర్‌ను వరుస గేమ్‌ల్లో 21-17,21-17తో చిత్తుచేస్తూ టైటిల్ ఎగరేసుకుపోయింది. >>2

# గ్లోబల్ 'వెడ్డింగ్ డెస్టినేషన్'గా ఎపి

## పర్యాటక మంత్రి కందుల దుర్గేష్

### రాజస్థాన్ పర్యటనలో భాగంగా జైపూర్‌లో జరిగిన ఇంటర్నేషనల్ వెడ్డింగ్ అండ్ టూరిజం కాన్ క్లేవ్‌లో పాల్గొన్న మంత్రి దుర్గేష్

**విజయవాడ, జులై19,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అంతర్జాతీయ స్థాయి 'వెడ్డింగ్ డెస్టినేషన్'గా ప్రమోట్ చేయడంపై రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ప్రత్యేక దృష్టి సారించారు. దేశంలోనే రాయల్ వెడ్డింగ్స్‌కు కేరాఫ్ అడ్రస్‌గా, రోల్ మోడల్‌గా నిలిచిన రాజస్థాన్‌లోని జైపూర్‌లో మంత్రి దుర్గేష్ పర్యటించారు. ఈ సందర్భంగా జైపూర్ కుకాస్ లోని విరాసత్ హెరిటేజ్ రెస్టారెంట్ లో జరిగిన ఇంటర్నేషనల్ వెడ్డింగ్ అండ్ టూరిజం కాన్ క్లేవ్‌లో ప్రముఖ వెడ్డింగ్ డెస్టినేషన్ ప్లానర్లు, ఈవెంట్ నిర్వాహకులతో మంత్రి దుర్గేష్ కీలక సమావేశాన్ని నిర్వహించారు. ఈ భేటీలో ఆంధ్రప్రదేశ్‌లో వెడ్డింగ్ టూరిజం విస్తరణకు ఉన్న అనుకూలతలు, సహజసిద్ధమైన వనరులు మరియు ప్రభుత్వ రాయితీలపై మంత్రి దుర్గేష్ సుదీర్ఘంగా చర్చించారు. కేంద్రం సహకారంతో సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌లు పర్యాటక రంగానికి కల్పిస్తున్న ప్రాముఖ్యతను తెలిపారు. అంతకు ముందు గుజరాత్ ఉప ముఖ్యమంత్రి, పర్యాటక మంత్రి దియా కుమారితో కలిసి ఆంధ్రప్రదేశ్ టూరిజం స్టాల్‌ను మంత్రి దుర్గేష్ ప్రారంభించి పలువురికి ఎపి ప్రత్యేకతలను స్వయంగా తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అద్భుతమైన ప్రకృతి అందాలు, చారిత్రాత్మక కోటలు, సుదీర్ఘమైన సముద్ర తీరాలతో వెడ్డింగ్ డెస్టినేషన్లకు అత్యంత అనువైన ప్రాంతంగా నిలుస్తోందని పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి బీచ్ వెడ్డింగ్స్ నిర్వహించుకోవడానికి హిల్ రిసార్ట్స్ కలయికతో ఉన్న వైజాగ్ తీరం ఎంతో రమణీయంగా ఉంటుందని వివరించారు. సూర్య లంక బీచ్‌లో స్టార్ హోటళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. >>2

# ఆరోగ్యానికి 'డిజిటల్' కవచం

DiNC DIGITAL NERVE CENTRE

## కుప్పం నియోజకవర్గంలో 'సంజీవని' పైలట్ ప్రాజెక్టు అమలు

## 1.15 లక్షల మందికి వైద్య సేవలు

## పేద ప్రజలకు ఆరోగ్యవరం 'సంజీవని'

**కుప్పం, జులై 19 ప్రభాతవార్త:** ప్రజల ఆరోగ్య వివరాలు డిజిటలైజ్ చేయడంతో పాటు వారికి అత్యవసర వేళల్లో నిష్ణాతులైన వైద్యుల ద్వారా వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో సిఎం చంద్రబాబునాయుడు రాష్ట్రంలోనే తొలిసారిగా చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన టాటా సంజీవని ప్రాజెక్ట్ (డిజిటల్ నెర్వ్) సెంటర్ సక్సెస్ సాధించింది. దీంతోఈ ప్రాజెక్టును రాష్ట్ర వ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆస్పత్రుల్లో అమలు చేయాలని సిఎం చంద్రబాబునాయుడు నిర్ణయించారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ఆస్పత్రులతో ఈ ప్రాజెక్టును అనుసంధానం చేస్తారు. సంజీవని ప్రాజెక్టు పేద ప్రజల ఆరోగ్యంకు వరంలా మారింది. కుప్పం పట్టణంలో ఉన్న ఏరియా ఆస్పత్రితో పాటు నియోజకవర్గంలోని 13 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఈ సంజీవని ప్రాజెక్టు అమలవుతోంది. ఈ ప్రాజెక్టు కోసం ప్రత్యేక బృందాలు ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తాయి. ప్రతి వైద్య కేంద్రం అనుసంధానించబడుతుంది. సంజీవని ప్రాజెక్టుకు గేట్స్ ఫౌండేషన్ సైతం సహకరిస్తోంది. గతేడాది జులై 3న సిఎం చంద్రబాబు కుప్పంలో ఈ ప్రాజెక్టును లాంఛనంగా ప్రారంభించారు.

**1.15లక్షలమందికిపైగా వైద్య సేవలు :**
సంజీవని ప్రాజెక్టు కింద కుప్పం నియోజకవర్గంలో ఇప్పటివరకు 1,15,510మందికి వైద్య సేవలను అందించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా ప్రజలు ఓ దఫా ఆస్పత్రికి వెళ్తే వారి వివరాలు నమోదు చేసుకుని >>2



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

# విశాఖలో ఘోర ప్రమాదం: లారీని ఢీకొట్టిన కారు

## నలుగురు దుర్మరణం

**విశాఖపట్నం, జులై 19, ప్రభాతవార్త:** జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున ఘోర రోడ్డుప్రమాదం సంభవించింది. ఆనందపురం- అనకాపల్లి నేషనల్ హైవేపై గండిగుండం సమీపంలో వేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి, ముందున్న లారీని బలంగా ఢీకొట్టింది ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో కారు డ్రైవర్ కూడా ఉన్నారు.

**శుభకార్యానికి వెళ్తుండగా విషాదం**

పల్నాడు జిల్లా వినుకొండనుంచి శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో జరగబోయే ఒక శుభకార్యానికి హాజర య్యేందుకు వీరంతా కారులో బయలుదేరారు. ప్రమాద సమయంలో కారులో మొత్తం ఐదుగురు ప్రయాణిస్తున్నారు. ప్రమాదంధాటికి కారు పూర్తిగా నుజ్జునుజ్జయింది

**ఎమ్మెల్యే పిఎ పరిస్థితి విషమం, కుమారుడు మృతి**

పల్నాడు జిల్లా నరసరావుపేట ఎమ్మెల్యే పిఎ (పర్సనల్ అసిస్టెంట్) చంద్రశేఖర్ ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉండటంతో చికిత్స నిమిత్తం విశాఖపట్నంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో మరణించిన వారిలో చంద్రశేఖర్ కుమారుడుకూడా ఉన్నట్లు ప్రాథమిక సమాచారం అందుతోంది. ప్రమాదంపై సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. కారులో ఇరుక్కు పోయిన మృతదేహాలను ఎంతో శ్రమించి బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# భారీ వర్ష సూచన

## 11 జిల్లాల్లో పిడుగుల వానలు!

**విజయవాడ.జూలై 19,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో మరో అయిదు రోజులు కురుస్తాయని వాతావరణ శాఖ స్పష్టం చేసింది. ఎల్‌నినో ప్రభావంతో ఎపిలో జూన్, జులై మాసంలో ఆశించిన స్థాయిలో వర్షాలు నమోదు కాలేదు. దీంతో రైతులు సాగు పనుల్లో ముందుకెళ్లలేక భారీ వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు. వాతావరణ శాఖ వర్షాలపై కీలక సమాచారం ఇచ్చింది. ఎపిలో ఆదివారం నుంచి ఐదు రోజుల పాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని, పలు జిల్లాల్లో అతిభారీ వర్షాలు కూడా నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. ఎపి విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపిన వివరాల ప్రకారం.. రాష్ట్రంలో ఐదు రోజులుపాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు నమోదవుతాయని తెలిపింది. దాదాపు అన్ని జిల్లాల్లో మేఘావృతమైన వాతావరణం ఉంటుందని అంచనా వేసింది. ముఖ్యంగా 11 జిల్లాల్లో పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని, కోస్తాంధ్ర తీరం వెంబడి గంటకు 40 నుంచి 50 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది. ఆదివారం శ్రీకాకుళం, విజయనగరం, పోలవరం, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, నంద్యాల, వైఎస్ఆర్ కడప జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని, రాష్ట్రంలోని మిగిలిన జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ అంచనా వేసింది. ఇక సోమవారం విజయనగరం, పార్వతీపురం మన్యం, పోలవరం, విశాఖ, తూర్పుగోదావరి, ఏలూరు జిల్లాల్లో కొన్నిచోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది.

# 1న పిఎంచే 'భోగాపురం' ప్రారంభం



ఆదివారం పనుల పురోగతిని పరిశీలించిన మంత్రి కొండపల్లి తదితరులు

## అల్లూరి పేరుతో ఎయిర్‌పోర్టు జాతికి అంకితం

**విజయనగరం, జులై 19, ప్రభాతవార్త:** ఉత్తరాంధ్ర ప్రజల ఎమోషన్ అయిన అధునాతన హంగులతో నిర్మించబడిన భోగాపురం విమానాశ్రయం ఎయిర్‌పోర్ట్ ఆగస్టు 1వ తేదీన దేశ ప్రధాని మోడీచే ప్రారంభించడం జరుగుతుందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం ఉదయం భోగాపురం ఎయిర్‌పోర్ట్ పరిసర ప్రాంతాలను నెల్లిమర్ల ఎమ్మెల్యే, మార్కెఫెడ్ చైర్మన్ బంగారు రాజు, కలెక్టర్ ఎస్ రామ్ సుందర్‌రెడ్డి, ఎస్పీ ఏఆర్ దామోదర్, ఎయిర్‌పోర్ట్ అథారిటీ అధికారులతో కలిసి పనుల పురోగతిని పరిశీలించి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రధానమంత్రి మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో ప్రపంచంలోనే అత్యంత అద్భుత విమానాశ్రయాలలో ఒకటిగా ఖ్యాతి గడించ బోయే భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ఆగస్టు 1 న ప్రారంభించి జాతికి అంకితం చేస్తారని తెలిపారు. నాటి కేంద్ర పౌర విమాన శాఖా మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు ఈ ప్రాంతంలో విమానాశ్రయం ఏర్పాటు చేయాలనే సంకల్పంతో శంకుస్థాపన చేశారని, ఆ కల నేడు సాకారం కావడం ఈ ప్రాంత అభివృద్ధికి చిహ్నంగా మారనుందని మంత్రి పేర్కొన్నారు. కేంద్ర పౌరవిమాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు నేతృత్వంలో మంత్రులు, ఈ ప్రాంత ప్రజా ప్రతినిధుల సమక్షంలో ఉత్తరాంధ్ర ప్రజల హర్షధ్వానాల మధ్య పతాక స్థాయిలో చిరస్థాయిగా గుర్తుండే విధంగా బోగాపురం ఎయిర్పోర్ట్ ప్రారంభం చేయటం జరుగుతుందన్నారు.
తెలంగాణకు హైదరాబాద్ భాగ్యనగరంగా పేరుపొందినట్లే రానున్న రోజులలో భోగాపురం ఎయిర్‌పోర్ట్‌తో ఆంధ్రప్రదేశ్ భాగ్యనగరంగా ఉత్తరాంధ్ర విరాజిల్లుతుందన్నారు. ఇప్పటికే విశాఖ, శ్రీకాకుళం, విజయనగరంజిల్లాలకు జాతీయ రహదారులు అందుబాటు లోకి రావడంతో పాటు బోగాపురం ఎయిర్పోర్ట్ రావడంతో ఉత్తరాంధ్ర రూపురేఖలు మారనున్నాయన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ , యువ నాయకులు లోకేష్ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. భోగాపురం ఎయిర్పోర్ట్ ప్రారంభా నికి ప్రతిఒక్కరు సిద్ధం కావాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. కాకినాడ నుండి మూలపేట >>2

20-7pg2exHMNWJQE_20-7pg2exHMNWJQE.qxd 20/Jul/26 12:20 AM Page 1





ఆదివారం సిలిగురిలో ఉన్న జుమాగాచ్ బిఒపి వద్ద సరిహద్దు భద్రతను పరిశీలిస్తున్న హోంమత్రి అమిత్‌షా

# 16కు పెరిగిన కొవిడ్ కేసులు

>> నొప్పి, ముక్కు కారడం, మూసుకుపోవడం, ఒళ్లు నొప్పులు లాంటి లక్షణాలు ఉంటాయని వివరించారు. ఆందోళన చెందొద్దని అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. ఈ క్రమంలో కొత్త కేసులు వెలుగులోకి రావడం కొంత ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికే ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ఇద్దరు చిన్నారులకు కొవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం నిడిగుంటపాలెంకు చెందిన మూడేళ్ల బాలుడు క్యాన్సర్ చికిత్స నిమిత్తం పుదుచ్చేరిలో ఉండగా, అతనికి కరోనా సోకినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కాగా, బాలుడి కుటుంబ సభ్యులకు, సమీప బంధువులకు నిర్వహించిన పరీక్షల్లో నెగటివ్ అని తేలింది.

ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలం రోలపాడుకు చెందిన 13 ఏళ్ల బాలిక కిడ్నీ సంబంధిత సమస్యలతో విజయవాడ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో డయాలసిస్ చేయించుకుంటోంది. జ్వరం, ఇతర లక్షణాలు కనిపించడంతో వైద్యులు పరీక్షలు నిర్వహించగా, ఆమెకు కొవిడ్ పాజిటివ్‌గా తేలింది. దీంతో బాలికను వెంటనే ఐసోలేషన్ వార్డుకు తరలించారు. ఆమె కుటుంబ సభ్యులకు నిర్వహించిన పరీక్షల్లో కూడా నెగటివ్ అని నిర్ధారణ అయ్యింది. రాష్ట్రవ్యాప్తంగా జూన్ 26 నుంచి జులై 16 మధ్య కాలంలో మొత్తం 12 కోవిడ్ కేసులు, నాలుగు మరణాలు నమోదయ్యాయి.

కడప జిల్లాలో అత్యధికంగా 8 కేసులు నమోదు కాగా, గుంటూరులో రెండు, విశాఖపట్నం, కాకినాడ జిల్లాల్లో ఒక్కొక్కటి చొప్పున కేసులు వెలుగు చూశాయి. మరణించిన వారంతా రక్తపోటు, మధుమేహం, కిడ్నీ వ్యాధుల వంటి ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నవారేనని అధికారులు వెల్లడించారు. ప్రస్తుతానికి కేసుల వ్యాప్తి తీవ్రంగా లేనందున ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అయితే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య శాఖ సూచించింది.

**రాజమండ్రిలో మొదటి కేసు**

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జులై19,ప్రభాతవార్త:** రాజమండ్రిలో మొదటి కరోనా కేసు నమోదు అయ్యింది. కొన్ని ఇబ్బందులు పడుతున్న ఆ యువకుడు స్వచ్ఛందంగా ఆసుపత్రికి రాగానే పరీక్షలు నిర్వహించారు. 21 యేళ్ల యువకుడికి కరోనా పాజిటివ్‌గా బావిస్తూ రాజమండ్రి జిల్లా ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. అయితే ఇంతవరకు అదికార యంత్రాంగం దృవీకరించలేదు. కాగా ఎపిలో ఇప్పటివరకు 16 కరోనా కేసులు నమోదు కాగా కాకినాడ జిల్లా గొల్లప్రోలులో మరణించిన ఓ యువతికి కూడ కరోనా గా చెన్నై లో జరిగిన వైద్య పరీక్షలలో తేలిన విషయం తెలిసిందే. ఇప్పుడు దీంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఇది రెండో కరోనా కేసుగా నిలచింది.

**విశాఖలో మరో కేసు నమోదు**

**విశాఖపట్నం, జూలై 19, ప్రభాతవార్త :** విశాఖ జిల్లాలో మరో కరోనా కేసు నమోదైంది. పెందుర్తి ప్రాంతంలో నివసిస్తున్న 28 యేళ్ల యువకుడికి జ్వరం, కరోనా లక్షణాలు కనిపించడంతో కెజిహెచ్ వైరాలజీ ల్యాబ్‌లో పరీక్షలు నిర్వహించగా కొవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. బాధితుడు ప్రస్తుతం కెజిహెచ్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఐసోలేషన్ వార్డులో చికిత్స పొందుతున్నట్లు డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. చంద్రశేఖర్ నాయుడు తెలిపారు. బాధితుడి స్వస్థలం పార్వతీపురం మన్యం జిల్లా కాగా, ప్రస్తుతం పెందుర్తి సమీపంలో నివసిస్తున్నట్లు వెల్లడించారు. అతడికి మలేరియా, ఇతర జ్వర లక్షణాలు కూడా ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. రోగి ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని, అవసరమైన వైద్య చికిత్స అందిస్తున్నామని వైద్యులు తెలిపారు.

# 'భోగాపురం' ప్రారంభం

>> వరకు ప్రత్యేక ప్రణాళికతో అభివృద్ధి పరచడానికి ముఖ్యమంత్రి గారు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎర్ర బస్సు కూడా రాదన్న జగన్ రెడ్డితో పాటు భోగాపురం ఎయిర్పోర్ట్ ప్రారంభించిన వెంటనే క్రెడిట్ చోరీతో ఎయిర్పోర్ట్ మేమే కట్టామని అబద్ధాలు చెప్పటానికి వైకాపా నాయకులు సిద్ధంగా ఉంటారన్నారు. విశాఖ శ్రీకాకుళం నుంచి వచ్చే వాహనాలను పార్కింగ్ చేసే స్థలాలను, నిర్మాణ స్థాయిలో ఉన్న అప్రోచ్ రోడ్లను, వాహనాల పార్కింగ్ స్థలాన్ని, సభా స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న రోడ్లను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు, కాంట్రాక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే సభా ప్రాంగణంలో ప్రాంతానికి పేరు తెచ్చి పెట్టిన తప్పెటగుళ్ళు, కోలాటం, గిరిజన సాంప్రదాయ నృత్యాల కళాకారులతో అబ్బురపరిచే విధంగా ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని సూచించారు. మార్క్ ఫెడ్ చైర్మన్ బంగారు రాజు మాట్లాడుతూ బోగాపురం ఎయిర్‌పోర్ట్ కోసం స్థలాలు ఇచ్చిన రైతులందరికీ కూడా ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేస్తూ, ప్రధాని మోడీ సమావేశానికి వచ్చే ప్రజలకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు.

సుమారు 60 ఎకరాల విస్తీర్ణంలో ప్రధానమంత్రి బహిరంగ సభ కోసం ఏర్పాట్లు చేస్తున్నామని, ప్రధానమంత్రి పర్యటనలో వాహనాల పార్కింగ్ స్థలాలను పరిశీలించడం జరిగిందనీ, సుమారు 3000 వాహనాలు వస్తాయని అంచనా తో పార్కింగ్ ఏర్పాట్లు పరిశీలించినట్లు జిల్లా కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి తెలిపారు. ప్రధాని విమానాశ్రయ ప్రారంభ పర్యటనకు బందోబస్తు నాలుగు సెక్టార్లుగా విభజించడం జరిగిందనీ, బహిరంగ సభకు సభ వేదిక గుర్తించి అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని, సభకు హాజరయ్యే ప్రజలకు ఎటువంటి సమస్యలు లేకుండా తగు చర్యలు తీసుకుంటామని ఎస్పీ ఎ ఆర్ దామోదర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆగస్టు 15లోగా 2.50 లక్షల ఇళ్లు

>> గాలు దక్కించుకునేలా ఎస్సీ,ఎస్టీ యువతకు జర్మన్ భాష నేర్పిస్తున్నాం. గిరిజన ప్రాంతాల్లో కాఫీ, పసుపు, కుంకుమపువ్వు సాగును చేపడుతున్నాం. వ్యాల్యూ అడిషన్ వచ్చేలా ప్రాసెసింగ్ ప్రక్రియ చేపట్టాలి. నేచురల్ ఫార్మింగ్, ట్రేసబిలిటీ, సర్టిఫికేషన్ లాంటి ప్రక్రియలు కూడా చేపట్టాలి. అరకు కాఫీ గ్లోబల్ బ్రాండ్‌గా మారేందుకు ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలి. వీటికి పర్యాటక ప్రాజెక్టులను లింక్ చేయాలి."అని ముఖ్యమంత్రి చెప్పారు. పిఎం ఇబస్ కింద ఇవిలను ప్రవేశపెట్టేలా కార్యాచరణ చేపట్టాలి... ఫాస్ట్ ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలి... బస్ స్టేషన్ల ఆధునీకరణ కార్యక్రమం కూడా చేపట్టాలి.అమరావతి, విశాఖపట్నం, తిరుపతిలలో ఎలక్ట్రికల్ వెహికల్స్ బస్సులు నడపాలి. విజయవాడ-గుంటూరు-అమరావతి, విశాఖ-అనకాపల్లి-విజయనగరం, తిరుపతి పరిధిలోని ప్రాంతాలను కలుపుతూ ఇవి బస్సులు తిప్పేలా చర్యలు చేపట్టాలన్నారు.

భోగాపురం ఇంటర్ నేషనల్ ఎయిర్ పోర్ట్ ఉత్తరాంధ్రకు మణిహారంగా మారుతుందని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. కొత్త ఎయిర్ పోర్టు ఆ ప్రాంత స్థితిగతులను మార్చేస్తుందని సీఎం వ్యాఖ్యానించారు. భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టును ప్రధాని నరేంద్ర మోదీ చేతుల ఉత్తరాంధ్ర అభివృద్ధిలో భోగాపురం ఎయిర్ పోర్టు కీలకం కానుంది. సామాన్యుల జీవితాలను మార్చే విధంగా ఎయిర్ పోర్టు ఉత్తరాంధ్రలో కొత్త అవకాశాలను తీసుకువస్తుంది. ఎకనమిక్ యాక్టివిటీ ఉరుకులు పెడుతుంది. రాకపోకలు మొదలయ్యాక ఆ ప్రాంత ప్రజల జీవన ప్రమాణాలు మారుతాయి. సామాన్యులు కూడా అనేక రకాలుగా లబ్ధి పొందుతారు. రవాణా మాత్రమే కాకుండా...టూరిజం, పారిశ్రామికపరంగా కూడా ఈ ప్రాంత అభివృద్ధికి ఈ ఎయిర్ పోర్టు ఉపయోగపడుతుంది. విశాఖ ఎకనమిక్ రీజియన్‌లో ఈ ఎయిర్ పోర్టు కీలక పాత్ర పోషిస్తుంది. హైదరాబాద్‌లో వచ్చిన శంషాబాద్ ఇంటర్ నేషనల్ ఎయిర్‌పోర్టు ఆ ప్రాంతంలో ఎటువంటి మార్పులు తెచ్చిందో నేడు భోగాపురంతో ఆ ప్రాంతంలోనూ అటువంటి మార్పులే తెస్తుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

# భారత్ స్టార్ షట్లర్ సింధు

>> జపాన్ ఓపెన్ సూపర్ 750 టోర్నీ నెగ్గిన తొలి భారత షట్లర్‌గా సింధు నిలిచింది. 2019 ప్రపంచ ఛాంపియన్ షిప్ తర్వాత ఇదే అతిపెద్ద టైటిల్. చివరిసారి సింధూ సొంతగడ్డపై 2024లో సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ టైటిల్ గెలుపొందింది. ఈ టైటిల్‌తో తన ఆటతీరుపై నెలకొన్ని అన్ని సందేహాలను పటాపంచలు చేసింది. మ్యాచ్ అనంతరం సింధు భావోద్వేగానికి గురైంది. తనలో ఆడే సత్తా తగ్గలేదని నిరూపించింది. కష్టకాలంలోనూ తనపై నమ్మకం కోల్పోలేదని, ఆ నమ్మకమే ఈ గెలుపని పేర్కొంది. కష్టకాలంలో తన వెంట నిలిచిన కోచ్‌లకు, తల్లిదండ్రులకు, భర్తకు కృతజ్ఞతలు తెలిపింది. వచ్చే నెలలో జరగనున్న ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో ఇదే జోరును కొనసాగించి రికార్డు స్థాయిలో ఆరో పతకాన్ని సాధించడమే తన లక్ష్యమని భారత స్టార్ షట్లర్ స్పష్టం చేసింది.

# కాశీబుగ్గ సిఐ, ఎస్ఐ సస్పెన్షన్

## మాజీమంత్రి సిదిరి కుమారుని వాహనం కేసు

## సాక్ష్యాధారాల సేకరణలో పోలీసుల వైఫల్యంపై ప్రభుత్వం ఆగ్రహం

**శ్రీకాకుళం, జులై 19 ప్రభాతవార్త :** పలాస కాశీబుగ్గలో మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు కుమారుడు నడిపిన వాహనం ఢీకొనడంతో ఒక వ్యక్తి మృతి చెందిన ఘటనకు సంబంధించి కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసు దర్యాప్తు, చట్టపరమైన చర్యల విషయంలో విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణల నేపథ్యంలో కాశీబుగ్గ సిఐ రామకృష్ణ, ఎస్సై సునీల్‌లను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఈ మేరకు విశాఖ రేంజ్ ఐజీ గోపీనాథ్ జెట్టి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ప్రమాద ఘటన జరిగిన నాటి నుంచి కేసు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. బాధిత కుటుంబ సభ్యులు న్యాయం చేయాలని డిమాండ్ చేయగా, ప్రజా సంఘాలు, వివిధ రాజకీయ పార్టీలు కూడా ప్రమాద ఘటనపై పారదర్శకంగా, నిష్పక్షికంగా దర్యాప్తు జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరాయి. ఘటన అనంతరం కేసు నమోదు, సాక్ష్యాధారాల సేకరణ, దర్యాప్తు ప్రక్రియలో పోలీసులు తగిన జాగ్రత్తలు తీసుకోలేదని, కొన్ని విధి విధానాలు సక్రమంగా పాటించలేదని ఆరోపణలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు కేసును సమగ్రంగా పరిశీలించి శాఖాపరమైన విచారణ చేపట్టారు. విచారణలో ప్రాథమి కంగా విధి నిర్వహణలో లోపాలు ఉన్నట్లు గుర్తించిన అనంతరం ఇద్దరు అధికారులపై సస్పెన్షన్ చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. పోలీసు అధికారుల సస్పెన్షన్‌తో ఈ కేసు మరోసారి ప్రాధాన్యం సంతరించుకుంది. బాధిత కుటుంబ సభ్యులు ఈ చర్యను స్వాగతిస్తూ, ప్రమాద ఘటనకు సంబంధించిన పూర్తి నిజాలు వెలుగులోకి వచ్చి బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. మరోవైపు, ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతోందని, అన్ని కోణాల్లో విచారణ జరుగుతోందని పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి. దర్యాప్తు నివేదిక ఆధారంగా అవసరమైతే మరిన్ని శాఖాపరమైన లేదా చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని సమాచారం. రాజకీయంగా కూడా ఈ ఘటన ప్రాధాన్యం సంతరించుకుంది. మాజీ మంత్రి కుటుంబానికి సంబంధించిన అంశం కావడంతో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య విమర్శలు, ప్రతివిమర్శలు కొనసాగుతున్నాయి. అయితే, దర్యాప్తు పూర్తయ్యే వరకు ఎలాంటి ఊహాగానాలకు తావివ్వ కుండా నిజానిజాలను వెలికితీయాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ ఘటనలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారనే అభియోగాలపై ప్రభుత్వం తీసుకున్న చర్య రాష్ట్ర పోలీసు శాఖలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించబోమనే సందేశాన్ని ఈచర్య ద్వారా ప్రభుత్వం ఇచ్చిందని పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## వారం - వర్జ్యం

20-07-2026, సోమవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆషాఢమాసం, దక్షిణాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, పుష్యమి కార్తె
సప్తమి తె.4.04, హస్త రా.7.14
వర్జ్యం : రా.3.47 - తె.5.29
దు.మ.12.40-మ.1.32
(2) మ.3.15-సా.4.07
శుభసమయం : ఉ.7.00-8.00
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** ఆశలు వదులుకున్న కార్యక్రమాలను సానుకూలము చేసుకోవటానికి కృషిచేసి కొంత పురోభివృద్ధి సాధిస్తారు.

**వృషభం:** ఉద్యోగాలలో ఎదురైన ఆటంకాలు అధిగమిస్తారు. అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు. వాహనసౌఖ్యం పొందుతారు.

**మిథునం:** ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి. స్త్రీలతో వివాదాలు ఏర్పడకుండా జాగ్రత్తలు పాటించండి.

**కర్కాటకం:** ఏకాగ్రత లోపించడంవల్ల కొన్ని కార్యక్రమాలు వాయిదా వేస్తారు. క్రయ విక్రయాలలో తొందరపాటు వద్దు.

**సింహం:** ఇతరులు ఇచ్చే సలహాలు మీకు ఉపకరించవు. ఆరోగ్య సూత్రాలను పాటించవలసిన కాలం, ఓర్పు మేలు చేస్తుంది.

**కన్య :** సాంకేతిక, పరిశోధన విషయాలపై ఆసక్తి చూపుతారు. వ్యాపారాలలో క్రమ విక్రయాలలో అనుకున్నంతగా లాభాలు పొందలేకపోవచ్చు.

**తుల :** కొన్ని వ్యవహారాలలో ఊహించని విజయం సాధిస్తారు. సోదరులతో ఏర్పడిన వివాదాలు తీరుతాయి. వాహన సౌఖ్యం.

**వృశ్చికం:** కుటుంబంలో శుభకార్యాలు జరుగుతాయి. చాకచక్యంగా వ్యవహరించి పనులు పూర్తి చేస్తారు. కాంట్రాక్టులు లభిస్తాయి.

**ధనుస్సు:** వ్యాపార విస్తరణకు నిపుణులతో చర్చించి కార్యాచరణలో కొంత అభివృద్ధిని సాధిస్తారు. స్వల్ప ధనలాభం పొందుతారు.

**మకరం:** అన్ని పనులు మీరే స్వయంగా చూసుకోవలసి వస్తుంది. సహచర వర్గం కరువవుతారు. నూతనవస్త్రాలు కొనుగోలు చేస్తారు.

**కుంభం:** బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. బాధ్యతలు సమర్థవంతంగా పూర్తి చేస్తారు. పెట్టుబడులకు అనుకూలం.

**మీనం :** మీ మేధస్సు నలుగురిలో ప్రశంసించబడుతుంది. ఆరోగ్య విషయంలో మెలుకువ అవసరం. చర్చాగోష్టులలో పాల్గొంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# నేటి నుంచి పార్లమెంట్

>> సమావేశం వాడివేడిగా సాగింది. ప్రజా సమస్యలపై తొలుత చర్చకు అవకాశం కల్పించాలని కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. అందరూ సహకరిస్తే, ఖచ్చితంగా అన్ని అంశాలపై చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర మంత్రులు ప్రతిపక్షాలకు స్పష్టంగా తెలియజేశారు.

ఇదిలా ఉండగా, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, పార్లమెంట్ వర్షాకాల సమావేశాల సందర్భంగా సోమవారం రాజ్యసభలో 'జాతీయ గౌరవానికి అవమానాల నివారణ (సవరణ) బిల్లు, 2026'ను ప్రవేశపెట్టనున్నారు. ప్రస్తుతం జాతీయ గీతం 'జన గణ మన'కు కల్పిస్తున్న చట్టపరమైన, శాసనపరమైన రక్షణనే జాతీయ గీతం 'వందేమాతరానికి' కూడా కల్పించాలని ఈ ప్రతిపాదిత చట్టం కోరుతోంది. ఈ బిల్లు చట్టంగా మారితే, 'జాతీయ గౌరవానికి అవమానాల నివారణ చట్టం' సవరించబడుతుంది. దీని ప్రకారం వందేమాతరాన్ని అవమానించడం శిక్షార్హమైన నేరంగా పరిగణించబడుతుంది. తద్వారా చట్టపరమైన రక్షణల విషయంలో ఇది జాతీయ గీతంతో సమాన స్థాయికి వస్తుంది. ఈ ప్రతిపాదిత చట్టం ప్రకారం, జాతీయ గీతాన్ని ఉద్దేశపూర్వకంగా అవమానించినా లేదా దాని గానానికి ఆటంకం కలిగించినా, ఆ వ్యక్తికి మూడేళ్ల వరకు జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించవచ్చు. అధికారిక ప్రభుత్వ కార్యక్రమాలలో 'జన గణ మన'తో పాటు 'వందేమాతరం'ను కూడా ఆలపించేటప్పుడు, ముందుగా 'వందేమాతరం'ను ఆలపించాలన్న ఆదేశాలను కచ్చితంగా పాటించాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జులై 9న అన్ని రాష్ట్రాలకు జారీ చేసిన ఆదేశాల నేపథ్యంలోనే ఈ శాసనపరమైన చర్య చేపట్టబడింది. ప్రతిపాదిత సవరణను పార్లమెంటు జరుగుతున్న వర్షాకాల సమావేశాల్లో చర్చకు తీసుకువచ్చే అవకాశం ఉంది.

# అఖిలపక్షం రసాభాస

>> సహకరించాలని ఆయన కోరారు. పార్లమెంట్ ఎంత బాగా పనిచేస్తే దేశానికి అంత ఎక్కువ ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఉభయ సభల్లో ప్రతిపక్షాల అభిప్రాయాలను వింటామని రిజిజు స్పష్టం చేశారు. అదే సమయంలో వారు కూడా తమ వైపు వాదనలను వింటారని ఆశిస్తున్నామని కిరణ్ రిజిజు ఆశాభావం వ్యక్తం చేశారు. ముందుగా ప్రజా సమస్యలపై చర్చకు అవకాశమివ్వాలని ప్రతిపక్ష పార్టీల నేతలు కోరుతూ, కొన్ని సూచనలు, సలహాలు చేశారు. అదే సమయంలో తిరుగుబాటు చేసిన 20 మంది టిఎంసి ఎంపిలకు లోక్‌సభలో ప్రత్యేక సీట్లు కేటాయించడం, అలాగే శివసేన (యుబిటి)కు చెందిన ఆరుగురు ఎంపిలను ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనలో విలీనం చేయడంపై ప్రతిపక్షాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. అఖిలపక్ష సమావేశం అనంతరం కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు మీడియాతో మాట్లాడుతూ, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన 40 మంది ఫ్లోర్ లీడర్లు అఖిలపక్ష సమావేశానికి హాజరయ్యారని, వర్షాకాల సమావేశాల్లో చర్చించబోయే అంశాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారని వివరించారు.

పశ్చిమాసియాలో నెలకొన్న సంఘర్షణ కారణంగా ప్రపంచ వ్యాప్తంగా అనిశ్చితి నెలకొన్న నేపథ్యంలో, జాతీయ ప్రయోజనాల దృష్ట్యా అన్ని రాజకీయ పార్టీలు కలిసి పనిచేయాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ విజ్ఞప్తి చేశారని రిజిజు పేర్కొన్నారు. "అనేక రాజకీయ పార్టీలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశాయి. తాము వాటిని విని నమోదు చేసుకున్నాము. అనేక సూచనలు వచ్చాయి, వాటిని కూడా నమోదు చేసుకున్నాము... ఏదైనా రాజకీయ పార్టీ చర్చలో పాల్గొనకుండా కేవలం నినాదాలకే పరిమితమైతే, దానివల్ల రాజకీయంగా నష్టం వాటిల్లుతుందని మీరు గమనించే ఉంటారు. ఇది అందరికీ తెలిసిన విషయమే... చర్చకు దూరంగా ఉండి గందరగోళం సృష్టిస్తే ఏ రాజకీయ పార్టీకీ రాజకీయ ప్రయోజనం చేకూరదు. ఇది రుజువైన విషయం. కాబట్టి, అందరూ చర్చలో పాల్గొనాలి. చిన్న పార్టీల సభ్యులు తమకు మాట్లాడేందుకు ఎక్కువ సమయం కేటాయించాలని కోరారు" అని ఆయన అన్నారు. సమావేశాలు సజావుగా సాగితే అందరూ తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే అవకాశం ఉంటుందని, అయితే "గందరగోళం సృష్టిస్తే మాత్రం మాట్లాడే అవకాశం లభించదు" అని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి స్పష్టం చేశారు. "తర్వాత, తగినంత చర్చ లేకుండానే బిల్లు ఆమోదించబడిందని లేదా గందరగోళం మధ్య ఆమోదించబడిందని ప్రభుత్వంపై నిందలు వేయకూడదు... పార్లమెంటు పని చేయాలని దేశ ప్రజలు కోరుకుంటున్నారు, పార్లమెంటు పని చేయకపోతే అది ప్రజాస్వామ్యానికి మంచిది కాదు" అని ఆయన పేర్కొన్నారు. ఇక అఖిపక్ష సమావేశానికి 'నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా' (ఎన్‌సిపిఐ) సభ్యులను ఆహ్వానించడాన్ని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు సమర్థించారు.

విపక్షాలకు వాకౌట్ చేసే హక్కు ఉన్నప్పటికీ, ఎన్నికైన 20 మంది ఎంపిలను చర్చల నుంచి మినహాయించడం సముచితం కాదని ఆయనపేర్కొన్నారు. 'ప్రస్తుతం ఈవిషయం స్పీకర్ పరిశీలనలో ఉన్న పుడు, వారిని మనం ఎలా పక్కనపెట్టగలం' అని ప్రశ్నించారు. లోక్‌సభ, రాజ్యసభ సచివాలయాలు జారీ చేసిన అధికారిక బులెటిన్ ద్వారా వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టనున్న ఎనిమిది బిల్లుల వివరాలను ప్రభుత్వం ఇప్పటికే పంచుకుందని రిజిజు తెలిపారు. సమావేశాల సమయంలో ప్రభుత్వం ఏదైనా అదనపు చట్టాన్ని ప్రవేశపెట్టాలని నిర్ణయిస్తే, ఆ విషయంపై ముందుగా బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బిఎసి)లో చర్చిస్తామని, ప్రతిపక్ష పార్టీలన్నింటికీ ముందస్తు సమాచారం అందిస్తామని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.



జమ్ము కాశ్మీర్‌లోని రజౌరిలో ఆదివారం కురిన భారీ వర్షాలతో సంభవించిన వరదల కారణంగా కొట్టుకు వచ్చిన బురద, శిధిలాలు మరియు గృహోపకరణాలు చెల్లాచెదరుగా పడి ఉన్న దృశ్యం

# పివి సింధు దేశానికి గర్వకారణం

## - గవర్నర్ అబ్దుల్ నజీర్

**విజయవాడ.జులై19,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రఖ్యాత బాడ్మింటిన్ క్రీడాకారిణి పివి సింధుకు గవర్నర్ అబ్దుల్ నజీర్ అభినందనలు తెలిపారు. సింధు దేశానికి గర్వకారణంగా నిలిచిందని గవర్నర్ ప్రశంసించారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు తేవాలని గవర్నర్ ఆకాంక్షించారు.టైటిల్ గెలిచిన తొలి భారతీయురాలిగా సింధు చరిత్ర సృష్టించారు. సింధు రాష్ట్రానికి, దేశానికి మరోసారి గర్వకారణంగా నిలిచారు. భవిష్యత్‌లో ఆమె మరిన్ని టైటిళ్లు సాధించాలని అన్నారు.ఈ మేరకు లోక్‌భవన్ నుంచి ప్రకటన విడుదలయింది.

# దేశం గర్వించేలా జపాన్ ఓపెన్‌లో సింధు విజయం

## - సిఎం చంద్రబాబు నాయుడు

**విజయవాడ, జులై 19,ప్రభాతవార్తప్రతినిధి:** దేశం గర్వించేలా జపాన్ ఓపెన్‌లో సింధు సంచలన విజయం సాధించడంపై సిఎం చంద్రబాబు హర్షం ప్రకటించారు.ఉత్కంఠ పోరులో విజయంతో సింధు సరికొత్త మైలురాయి లిఖించారు. భారత బ్యాడ్మింటన్ చరిత్రలో చరిత్రాత్మక ఘట్టం. అద్భుత విజయం అందుకున్న సింధుకు అభినందనలు. దేశం గర్వించేలా జపాన్ ఓపెన్‌లో సింధు సంచలన విజయం సాధించిందని సిఎం చంద్రబాబు ప్రశంసించారు. ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోరులో ప్రత్యర్థి యామగూచిపై 21-17, 21-17 తేడాతో ఘన విజయం సాధించి సరికొత్త మైలురాయిని లిఖించారని సిఎం చంద్రబాబు కొనియడారు. భారత బ్యాడ్మింటన్ చరిత్రలోనే ఇది ఒక చారిత్రాత్మక ఘట్టమన్నారు. రాబోయే ఒలింపిక్స్ బరిలో కూడా ఇదే జోరును కొనసాగించి పసిడి పతకాన్ని తీసుకురావాలని సిఎం చంద్రబాబు ఆల్ ది బెస్ట్ చెప్పారు.

# ఆరోగ్యానికి 'డిజిటల్' కవచం

>> ప్రజలకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. వీరి ఆరోగ్య వివరాలను ఎప్పటికప్పుడు డిజిటలైజేషన్ చేయడంతో పాటు కోడ్ ఇస్తారు. ప్రజల ఆరోగ్య వివరాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభా కార్యక్రమంలో సైతం నమోదు చేస్తారు. మరోమారు ఆస్పత్రికి ప్రజలు వెళ్తే వైద్యులు సులువుగా వారి ఆరోగ్య వివరాలు, వారి సమస్యను గుర్తించి చికిత్సను అందిస్తారు. అత్యవసర వేళల్లో ప్రజలకు నిపుణులైన వైద్యుల సలహాలతో స్థానికంగానే అత్యవసర చికిత్సలు సైతం అందించే వెసులుబాటు కలుగుతుంది. ఏది ఏమైనా సిఎం చంద్రబాబునాయుడు కుప్పం ప్రాంతంలో తలపెట్టిన ఈ ప్రాజెక్టు కుప్పం ప్రాంత ప్రజలకు నిజంగా 'సంజీవని'గానే మారిందనడంలో ఎలాంటి సందేహం లేదు.

# చెస్ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ రిత్విక్‌కు రజతం

**హైదరాబాద్, జులై 19, ప్రభాతవార్త:** ఫ్రాన్స్ మెనూయిర్స్ ఇంటర్నేషనల్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణకు చెందిన గ్రాండ్‌మాస్టర్ రాజా రిత్విక్ రజతం సాధించాడు. 7.0/9 పాయింట్లతో ఓటమి లేకుండా రన్నరప్ ట్రోఫీ కైవసం చేసుకున్నాడు. ఉత్కంఠభరితమైన చివరి రౌండ్‌లో టాప్ సీడ్ ఫ్రాన్స్ జీఎం లగార్డే మాక్సిమ్‌పై ఘన విజయం సాధించాడు. టోర్నమెంట్‌లో ఒక్క మ్యాచ్‌లో కూడా ఓడిపోకుండా రన్నరప్ ట్రోఫీని (రజత పతకం) కైవసం చేసుకున్నాడు. ఈ టోర్నమెంట్‌లో 4వ సీడ్‌గా బరిలోకి దిగిన హైదరాబాద్‌కు చెందిన రిత్విక్ మొత్తం 9 రౌండ్లలో 7.0 పాయింట్లు సాధించాడు. ఫ్రాన్స్, ఇండియా, చైనా, జర్మనీ, పోలాండ్, నెదర్లాండ్స్, ఇటలీ వంటి దేశాల నుండి 86 మంది అత్యుత్తమ ఆటగాళ్లు పాల్గొన్న ఈ పోటీలో, రిత్విక్ అసాధారణమైన వ్యూహాత్మక చతురతను ప్రదర్శించాడు. 5 విజయాలు, 4 డ్రాలతో టోర్నమెంట్ అంతటా అజేయంగా నిలిచాడు.ఈ ఛాంపియన్‌షిప్‌లో అగ్రస్థానం కోసం ఇద్దరు భారతీయ క్రీడాకారుల మధ్య హోరాహోరీ పోరు సాగింది. గ్రాండ్ మాస్టర్ రోహిత్ కృష్ణ, జీఎం రాజా రిత్విక్ ఇద్దరూ తలా 7.0 పాయింట్లతో సంయుక్తంగా మొదటి స్థానంలో నిలిచారు. అయితే, టైబ్రేక్ లెక్కింపు ఆధారంగా జీఎం రోహిత్ కృష్ణ (టైబ్రేక్ స్కోరు 43) స్వర్ణ పతకాన్ని గెలుచుకోగా, రిత్విక్ (టైబ్రేక్ స్కోరు 41.5) రజత పతకాన్ని సొంతం చేసుకున్నాడు. ఫ్రాన్స్‌కు చెందిన ఒమేల్జా ఆర్టెమ్ 6.5 పాయింట్లతో కాంస్య పతకాన్ని సాధించాడు.

# గ్లోబల్ 'వెడ్డింగ్ డెస్టినేషన్'గా ఎపి

>> పచ్చని ప్రకృతి, గిరిజన సంస్కృతి, ఎకోటూరిజం వైభవం మరియు అంతర్జాతీయ గుర్తింపు పొందిన 'అరకుకాఫీ' విశిష్టతలతో అరకు పర్యాటకులను కట్టిపడేస్తుందని తెలిపారు. పచ్చని కొండలు, చల్లని వాతావరణం, పొగమంచు మధ్య ప్రశాంతంగా వేడుక జరుపుకోవాలనుకునే వారికి అరకు ఉత్తమమైన ప్రాంతం అని పేర్కొన్నారు. అదే గాక కోనసీమ ప్రాంతం పచ్చని కొబ్బరిచెట్లతో, మారేడుమిల్లి దట్టమైన అటవీ ప్రాంతంతో సుందరంగా ఉంటుందన్నారు.

సాంప్రదాయ పద్ధతిలో, వైభవంగా వివాహం చేసుకోవాలనుకునే వారికి తిరుపతి మొదటి ప్రాధాన్యతగా మారుతోందని, ప్రస్తుతం అక్కడ అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన 'వరల్డ్ క్లాస్ హోటల్స్' అందుబాటులోకి వస్తున్నాయని మంత్రి తెలిపారు. రామ్ దేవ్ బాబా ఎపిలో వెల్ నెస్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారని పేర్కొన్నారు.మంత్రి దుర్గేష్ ప్రసంగంతో ఎపికి వచ్చి వెడ్డింగ్ డెస్టినేషన్ ప్రాజెక్టులపై పెట్టుబడులు పెట్టేం దుకు పలువురు వెడ్డింగ్ ప్లానర్లు సుముఖత వ్యక్తం చేశారు. ఎపిలో ఈవెంట్స్, టూరిజం ప్రాజెక్టులు చేపట్టే వారికి కూటమి ప్రభుత్వం తరపున సింగిల్ విండో విధానంలో అనుమతులు, అవసరమైన మౌలిక సదుపాయాలు,పూర్తిస్థాయి సహాయ సహకా రాలు అందిస్తామని మంత్రి దుర్గేష్ హామీ ఇచ్చారు.

# ప్రభుత్వాసుపత్రిలో అనుమానాస్పద మృతి

**కర్నూలు హాస్పిటల్ జులై 19 ప్రభాతవార్త :** కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో రిటైర్డ్ ఎస్సై రంగస్వామి (68) అనుమానాస్పదంగా మృతి చెందాడు. రంగస్వామి ఈనెల 13వ తేదీన హెర్నియా ఆపరేషన్ కొరకు ఆసుపత్రిలో చేరారు. ఈనెల 14న వైద్యులు రంగస్వామికి హెర్నియా ఆపరేషన్ చేసి హాస్పిటల్లో అడ్మిట్ చేసుకున్నారు. ఈ క్రమంలో శనివారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో ఆసుపత్రిలోని సర్జికల్ వార్డు భవనం నుంచి రిటైర్డ్ ఎస్సై కిందికి దూకి ఆత్మహత్య చేసుకున్నారు. అయితే ఈ మృతిపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. నడవలేని వ్యక్తి ఎలా భవనం పైకెక్కి ఆత్మహత్య చేసుకుంటారని.. ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యమే మృతికి కారణమని వారు తెలిపారు. తన తండ్రి మృతికి కారణం చెప్పాలని మృతుడి కొడుకు వెంకటరమణ కోరుతున్నారు. ఈ ఘటనపై మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# టెన్త్ విద్యార్థినిపై ఇంటర్ విద్యార్థి అత్యాచారం

## పొక్సో కేసు నమోదు

**విజయనగరం,గరివిడి, జూలై 19, ప్రభాతవార్త :** విజయనగరం జిల్లా గరివిడి మండలంలోని కోడూరు గ్రామానికి చెందిన ఒక టెన్త్ విద్యార్థిని పై అదే గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థి అత్యాచారానికి పాల్పడటం సంచలనం రేకెత్తించింది.ఆ బాలిక గర్భం దాల్చడం తో విషయం బయట పడింది. అత్యాచారానికి పాల్పడ్డ ఇంటర్ విద్యార్థి పై పొక్సో కేసు ని పోలీసులు నమోదు చేశారు.పోలీసులు కథనం ప్రకారం గరివిడి లో ఒక ప్రభుత్వ పాఠశాలలో టెన్త్ చదువుతున్న కోడూరు కి చెందిన విద్యార్థినిని, అదే కోడూరుకి చెందిన విద్యార్థి గరివిడిలో ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు.రెండు సార్లు శారీరకంగా బాలికను యువకుడు కలిసాడు. దీంతో బాలిక గర్భం దాల్చింది. అయితే బాలిక కు కడుపు నొప్పి వచ్చిందని కుటుంబీకులు ఆసుపత్రికి తీసుకు వెళ్లడంతో బాలిక గర్భం దాల్చినట్లు తేటతెల్లమైంది. దీంతో బాలిక తల్లిదండ్రులు పోలీసులని ఆశ్రయించారు. పోలీసులు దర్యాప్తు చేయగా యువకుడు బాలిక పై అత్యాచారానికి పాల్పడినట్లు వెల్లడైంది.బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు అత్యాచారం చేసి బాలిక గర్భం దాల్చేందుకు కారకుడైన ఇంటర్ విద్యార్థిపై పొక్సో కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ బి.లోకేశ్వర రావు తెలిపారు.

20-7Pg3exHMNWJQEAKTCL_20-7Pg3exHMNWJQEAKTCL.qxd 19/Jul/26 11:42 PM Page 1



# పొగాకు వేలం కేంద్రాల్లో కొనుగోళ్లలో కనిపించని స్థిరత్వం




**ఒంగోలు(కలెక్టరేట్), జులై 19 ప్రభాతవార్త:** దక్షిణాది ఎఫ్‌సీవీ పొగాకు వేలం మార్కెట్‌లో అనిశ్చిత పరిస్థితులు కొనసాగుతుండటంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. వేలానికి వస్తున్న పొగాకు బేళ్ల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నప్పటికీ కొనుగోళ్లలో స్థిరత్వం కనిపించకపోవడం, నోబిడ్ బేళ్ల శాతం ఒక్కో రోజు ఒక్కోలా మారుతుండడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. శుక్రవారం మార్కెట్‌లో ఆశాజనకంగా కనిపించిన పరిస్థితి శనివారం ఒక్కసారిగా మారిపోవడంతో మార్కెట్ ధోరణిపై రైతులు, వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు సంస్థలు అధికారులు సూచించిన ధరలకు ముందుకు రాకపోవడంతో వేలాది బేళ్లు అమ్ముడుపోకుండా తిరిగి రైతుల వద్దకే వెళ్తున్నాయి. శనివారం దక్షిణాదిలోని 11 వేలం కేంద్రాలకు మొత్తం 7,612 పొగాకు బేళ్లు అమ్మకానికి రాగా, అందులో 5,214 బేళ్లను మాత్రమే కొనుగోలు చేశారు. మిగిలిన 2,398 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరణకు గురయ్యాయి. వాటిలో 1,932 బేళ్లు అధికారులు నిర్ణయించిన ధరలకు కొనుగోలు సంస్థలు ఆసక్తి చూపకపోవడంతో నోబిడ్‌గా నమోదయ్యాయి. దీంతో మొత్తం వేలానికి వచ్చిన బేళ్లలో 25.38 శాతం నోబిడ్‌గా మిగిలాయి. శుక్రవారం 18.40శాతం ఉండగా, ఒక్క రోజులోనే దాదాపు ఏడు శాతం పెరగడం మార్కెట్‌లో ఉన్న అస్థిరతను స్పష్టంగా చూపిస్తోంది. ఇదే సమయంలో శుక్రవారం కిలోకు సగటున రూ.195.20 ధర లభించగా, శనివారం ధరల్లో కూడా హెచ్చుతగ్గులు కనిపించడం రైతులను మరింత నిరాశకు గురిచేసింది. జిల్లాలోని పలు వేలం కేంద్రాల్లో నోబిడ్ బేళ్ల శాతం ఆందోళనకర స్థాయికి చేరుకుంది. కనిగిరి వేలం కేంద్రంలో అత్యధికంగా 55.37 శాతం బేళ్లు నోబిడ్ కావడం రైతులను తీవ్రంగా కలవరపెడుతోంది. అంటే వేలానికి తీసుకొచ్చిన ప్రతి రెండు బేళ్లలో ఒకటి కూడా అమ్ముడుకాక పోవడం అక్కడి పరిస్థితిని ప్రతిబింబిస్తోంది. వెల్లంపల్లి కేంద్రంలో 36.50 శాతం, ఒంగోలు 2 కేంద్రంలో 32.26 శాతం, కందుకూరు2లో 31.68 శాతం, కలిగిరిలో 31.11 శాతం బేళ్లు నోబిడ్‌గా నమోదయ్యాయి. ఈ గణాంకాలు మార్కెట్‌లో కొనుగోళ్లపై ఉన్న అనిశ్చితిని స్పష్టంగా తెలియజేస్తున్నాయి. అయితే అన్ని కేంద్రాల్లో ఒకే పరిస్థితి లేకపోవడం మార్కెట్‌లో అసమాన ధోరణిని బయటపెడుతోంది. కందుకూరు1 వేలం కేంద్రంలో 671 బేళ్లు అమ్మకానికి రాగా కేవలం ఏడు శాతం మాత్రమే నోబిడ్ కావడం విశేషం. అలాగే డీసీపల్లిలో 528 బేళ్లలో 9.43 శాతం, కొండపి కేంద్రంలో 943 బేళ్లలో 10.60 శాతం మాత్రమే నోబిడ్ కావడం అక్కడ కొనుగోళ్లు కొంత మెరుగ్గా సాగినట్లు సూచిస్తోంది. ఒకే రోజు, ఒకే ప్రాంతంలో ఉన్న వేలం కేంద్రాల మధ్య ఇంతటి వ్యత్యాసం ఉండడం రైతులను అయోమయానికి గురిచేస్తోంది. కొనుగోలు సంస్థల మధ్య పోటీ తగ్గడం, నాణ్యత ఆధారంగా ఎంపిక మరింత కఠినతరం కావడం, ఎగుమతి పరిస్థితులు, అంతర్జాతీయ మార్కెట్ ప్రభావం వంటి అంశాలు కూడా నోబిడ్‌ల పెరుగుదలకు కారణమవుతున్నాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. రైతులు ఏడాది పొడవునా శ్రమించి పండించిన పొగాకు సరైన ధరకు అమ్ముడుపోకపోతే తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి నెలకొంది. ఇప్పటికే సాగు ఖర్చులు, కూలీల వ్యయం, ఎరువులు, పురుగుమందుల ధరలు పెరగడంతో రైతులపై భారం అధికమైందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేలం కేంద్రాల్లో నోబిడ్ బేళ్లు పెరగడం వల్ల రైతులు వాటిని తిరిగి నిల్వ చేసుకోవాల్సి వస్తోంది. దీంతో రవాణా, గిడ్డంగి, కార్మిక వ్యయాలు అదనంగా భరించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. మరోసారి వేలానికి తీసుకురావాలంటే అదనపు ఖర్చుతో పాటు నాణ్యత దెబ్బతినే ప్రమాదం కూడా ఉందని రైతులు పేర్కొంటున్నారు. అధికారులు, పొగాకు బోర్డు కొనుగోలు సంస్థలతో చర్చించి మార్కెట్‌లో స్థిరత్వం తీసుకురావాలని, రైతులకు గిట్టుబాటు ధరలు లభించేలా చర్యలు చేపట్టాలని రైతు సంఘాలు కోరుతున్నాయి. కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత పెంచి, నోబిడ్ బేళ్ల సమస్యను తగ్గించేలా తక్షణ చర్యలు తీసుకుంటేనే పొగాకు రైతులకు ఊరట లభిస్తుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# సంస్కృతం భారతీయ సంస్కృతికి ప్రతిరూపం

- ప్రాచీన జ్ఞానాన్ని ఆధునికతతో అనుసంధానించాలి
- అసోం గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య



**తిరుపతి (విద్య), జులై 19 ప్రభాతవార్త:** తిరుపతి జాతీయ సంస్కృత వర్సిటీని అసోం గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన శ్రీ పట్టాభిరామ శాస్త్రీ వ్యాఖ్యానమాలను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొ. జి.ఎస్.ఆర్. కృష్ణమూర్తి, రిజిస్ట్రార్ కడియం వెంకట నారాయణరావు, అకడమిక్ డీన్ ప్రొ. రజనీకాంత్ శుక్ల పూర్ణకుంభంతో గవర్నర్‌కు ఘన స్వాగతం పలికారు. చెలికాని అన్నారావు సభాభవనంలో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ మాట్లాడుతూ సంస్కృతం కేవలం భాష మాత్రమే కాదని, భారతీయ సంస్కృతి, సనాతన జ్ఞాన సంపదకు ప్రతిరూపమని పేర్కొన్నారు. సంస్కృత అధ్యయనం ద్వారా భారతీయ వైజ్ఞానిక, సాంకేతిక, నైతిక విలువలను యువత అందిపుచ్చుకోవాలని సూచించారు.

ప్రాచీన జ్ఞానాన్ని ఆధునిక అవసరాలకు అనుగుణంగా అనుసంధానించే దిశగా జాతీయ విద్యా విధానం-2020 కీలక పాత్ర పోషిస్తోందన్నారు. పట్టాభిరామ శాస్త్రీ పేరుతో ప్రారంభమైన వ్యాఖ్యానమాల దేశవ్యాప్తంగా శాస్త్ర చర్చలకు వేదికగా నిలవాలని ఆకాంక్షి ంచారు. పరిశోధనలు, ఆవిష్కరణలు, భారతీయ జ్ఞాన పరిరక్షణలో విద్యార్థులు చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. భాష ప్రజలను ఏకం చేసే శక్తి అని, సంస్కృత భాష ఆ పాత్రను శతాబ్దాలుగా నిర్వర్తిస్తోందని పేర్కొన్నారు. అంతకుముందు వైస్‌ఛాన్సలర్ ప్రొ. జి.ఎస్.ఆర్. కృష్ణమూర్తి విశ్వవిద్యాలయం సాధిస్తున్న ప్రగతి, సంస్కృతాభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు.

రిజిస్ట్రార్ కడియం వెంకట నారాయణరావు విద్యా కార్యక్రమాలు, విభాగాలు, పరిశోధన కార్యకలాపా లను పరిచయం చేశారు. అకడమిక్ డీన్ ప్రొ. రజనీకాంత్ శుక్ల అకడమిక్ విశేషాలను వెల్లడించారు. వ్యాఖ్యానమాల కోఆర్డినేటర్ ప్రొ. సతీష్ కె.ఎస్. ఈ కార్యక్రమ లక్ష్యాలను వివరించగా, అదనపు కోఆర్డినేటర్ డా. ఓ.పీ.జీ. కళ్యాణ శాస్త్రీ సభా నిర్వహణ చేపట్టారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఆర్థిక అధికారి ప్రొ. రాధాగోవింద త్రిపాఠి, స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ డీన్ ప్రొ. పి. వెంకట్రావు, సాహిత్యసంస్కృతి విభాగం డీన్ ప్రొ. సి. రంగనాథన్, ప్రజాసంబంధాల అధికారి డా. కనపాల కుమార్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గిరి పుత్రులకు పవన్ మాటిచ్చారు... వసతులు కల్పించారు

## - ఉపాధి నిధులతో అంగన్వాడీ కేంద్రాలతోపాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు




**విజయవాడ, జులై 19 ప్రభాతవార్త ప్రతినిధి:** గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేసారు. గిరిజన గ్రామాల అభివృద్ధి పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు పవన్ కళ్యాణ్ తెలిపారు. ఆయన అల్లూరి సీతారామరాజు జిల్లా, అనంతగిరి మండలం, బల్లగరువు గ్రామ పర్యటన సందర్భంగా గిరిపుత్రులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు, రూ.కోటి విలువైన పలు అభివృద్ధి పనులు పూర్తి చేశారు. అంగన్వాడీ కేంద్రాలు, తాగునీటి సదుపాయం, సీసీ రోడ్లు తదితర వసతులు కల్పించారు. ఇవన్నీ ఉపముఖ్యమంత్రి చొరవతో అందుబాటులోకి వచ్చాయని డీసీఎం కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో స్పష్టం చేసారు. గిరిజన గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టేందుకు అనంతగిరి మండలం, బల్లగరువుకు వెళ్లారు. పర్యటనలో భాగంగా వెలగపాడు, కొరపర్తి తదితర గ్రామాల్లో గిరిజనులతో మమేకం అయ్యారు. సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్న ఆయన, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పనకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటకు కార్యరూపం ఇస్తూ, నేడు పనులు పూర్తి చేశారు. గిరిజన ప్రాంతాల్లో నివసించే మహిళలు, చిన్నారుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని బల్లగరువు, వెలగపాడు, కొరపర్తి గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాలను నిర్మించారు. పవన్ కళ్యాణ్ ఆయా గ్రామాలను సందర్శించిన సమయంలో అంగన్వాడీ కేంద్రాల నిర్వహణకు సరైన భవనం లేక చిన్నారులు పడుతున్న ఇబ్బందులు గుర్తించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో సమస్యలు తీర్చేందుకు ప్రణాళికలు రూపొందించారు. చిన్నారులు, మహిళల కోరిక మేరకు మూడు అంగన్వాడీ భవనాలను రూ. 55 లక్షలు వెచ్చించి నిర్మించారు. అందులో బల్లగరువు, వెలగపాడుల్లో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగంతో నూతన భవనాల నిర్మాణం చేపట్టారు. గిరిజనాభివృద్ధి శాఖ ఇంజినీరింగ్ విభాగం సహకారంతో కొరపర్తిలో అంగన్వాడీ భవనానికి ప్రహరీ గోడ, ఎంపీపీ స్కూలు భవనం పునరుద్ధరణ, తాగునీటి కోసం బోరు, నీటి సరఫరా నిమిత్తం పైపు లైన్లు, గ్రామంలో సీసీ రోడ్లు నిర్మించారు. గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు.

# రాష్ట్రాభివృద్ధి అంశాలను బలంగా ప్రస్తావించాలి

- జాతీయ ప్రయోజనాలకు ప్రాధాన్యతనివ్వాలి
- జనసేన ఎంపిలతో డి.సిం పవన్ కల్యాణ్

**విజయవాడ, జులై 19 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన అంశాలపై పార్లమెంట్‌లో సమర్థంగా జనసేన ఆలోచనా విధానాన్ని స్పష్టం చేయాలని జనసేన ఎంపిలకు సూచించారు. జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుంటూ 'నేషన్ ఫస్ట్' అనే భావన ప్రతి చర్చలో ప్రతిఫలించాలన్నారు. దాంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన అంశాలను బలంగా ప్రస్తావించాలని ఎంపిలకు ఆయన స్పష్టం చేశారు. పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పార్టీ ఎంపీలతో శనివారం రాత్రి సమావేశమై పలు అంశాలపై ఎంపిలు వ్యవహరించాల్సిన వైఖరిని తెలిపారు. ఈ సమావేశంలో జనసేన లోక్‌సభ ఎంపిలు వల్లభనేని బాలశౌరి, తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, రాజ్యసభ సభ్యుడు లింగమనేని రమేశ్ పాల్గొన్నారు. 'రాష్ట్రానికి ప్రయోజనం కలిగించే ప్రతి అంశంపైనా పార్టీ తరఫున గళం వినిపించాలి' అని పవన్ అన్నారు. రాష్ట్రానికి మేలు చేసే ప్రతి అంశంపై నిర్మాణాత్మక చర్చలు జరపడంతో పాటు కేంద్ర కేంద్రం నుంచి ఎపికి రావాల్సిన నిధులు, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల పురోగతి, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పవన్ సూచించారు. ఇప్పటికే అమల్లో ఉన్న ప్రాజెక్టులకు అదనపు నిధులు సాధించేందుకు కేంద్రాన్ని సమర్థవంతంగా ఒప్పించే ప్రయత్నాలు చేయాలని ఎంపిలకు సూచించారు. ప్రతి అంశంపై నిర్మాణాత్మకంగా చర్చించాలని ఆయన సూచించారు. సమావేశంలో రాష్ట్ర రైల్వే అభివృద్ధికి సంబంధించిన అంశాలపై కూడా విస్తృతంగా చర్చ జరిగింది. పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టులకు త్వరితగతిన ఆమోదాలు పొందడం, అవసరమైన నిధుల కేటాయింపును సాధించడం, కొత్త రైల్వే లైన్ల నిర్మాణం, రైల్వే ఓవర్ బ్రిడ్జిలు (ఆర్ఓబిలు) ఏర్పాటు, దక్షిణ కోస్తా రైల్వే జోన్ అభివృద్ధి వంటి అంశాలను పార్లమెంట్‌లో ప్రాధాన్యంగా ప్రస్తావించాలని పార్టీ ఎంపిలకు పవన్ కల్యాణ్ సూచించారు. అలాగే కేంద్ర ప్రభుత్వం ఈ సమావేశాల్లో లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ అమలుకు సంబంధించిన కీలక బిల్లులు ప్రవేశపెట్టే అవకాశం ఉన్న నేపథ్యంలో, వాటిపై పార్టీ అనుసరించాల్సిన వ్యూహాన్ని ఎంపిలకు వివరించారు.



ప్రతి అంశాన్ని రాజకీయ కోణంలో కాకుండా ప్రజా ప్రయోజనాలు, రాష్ట్రాభివృద్ధి, జాతీయ ప్రయోజనాల దృష్టితో పరిశీలించి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పవన్ కల్యాణ్ ఎంపిలకు సూచించారు. రాజ్యసభలో మనం అడుగుపెడుతున్నామని, మన ఆస్థిత్వాన్ని బలీయంగా చాటాలన్నారు.

# ముళ్లపొదల్లో పసికందులు.. మానవత్వాన్ని కలిచివేస్తున్న ఘటనలు

**ఒంగోలు(క్రైమ్), జులై 19 ప్రభాతవార్త:** ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పసికందులను నిర్జన ప్రాంతాలు, ముళ్లపొదలు, కాలువలు, రోడ్ల పక్కన వదిలివెళ్లే ఘటనలు వరుసగా చోటుచేసుకుంటూ సమాజాన్ని కలవరపెడుతున్నాయి. నవమాసాలు మోసి కన్న బిడ్డలను కొందరు తల్లిదండ్రులు వివిధ కారణాలతో నిర్దాక్షిణ్యంగా వదిలేయడం వల్ల అమ్మ ఒడిలో పెరగాల్సిన చిన్నారులు అనాథలుగా ప్రభుత్వ శిశుగృహాల్లో ఆశ్రయం పొందుతున్నారు. పాల కోసం విలవిలలాడే వయస్సులోనే కొందరు శిశువులు ప్రాణాలు కోల్పోతుండగా, మరికొందరు స్థానికుల అప్రమత్తత, పోలీసులు, బాలల సంరక్షణ శాఖ అధికారులు, చైల్డ్‌లైన్ సిబ్బంది సకాలంలో స్పందించడంతో ప్రాణాలతో బయటపడుతున్నారు. ఇటీవలి కాలంలో ఇలాంటి ఘటనలు పెరుగుతుండటంతో బాలల భద్రత, తల్లిదండ్రుల బాధ్యతపై మరోసారి చర్చ మొదలైంది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో గత ఏడాది మే నుంచి ఇప్పటి వరకు 11కు పైగా చిన్నారులను తల్లిదండ్రులు లేదా సంరక్షకులు వదిలివెళ్లిన ఘటనలు నమోదయ్యాయి. కొత్తపట్నంలో నాలుగేళ్ల బాలుడిని ఆసుపత్రిలో వదిలేయడం, మైనర్ బాలిక ప్రసవించిన శిశువును రోడ్డు పక్కన పడేయడం, ఒంగోలు జీజీహెచ్‌లో ఐదు రోజుల పాపను విక్రయించేందుకు ప్రయత్నించడం, మద్దిపాడులో మూడేళ్ల బాలికను రోడ్డు పక్కన వదిలివేయడం, మర్రిపూడిలో తల్లిదండ్రులు మృతి చెందడంతో ముగ్గురు చిన్నారులు అనాథలుగా మారడం, ఒంగోలు రైల్వే స్టేషన్‌లో నాలుగేళ్ల బాలుడిని వదిలివేయడం, సంతమాగులూరులో రెండేళ్ల బాలికను నిర్లక్ష్యంగా వదిలేయడం, ముండ్లమూరు శివారులో నెల రోజుల పాపను ముళ్లపొదల్లో పడేయడం వంటి ఘటనలు వరుసగా వెలుగులోకి వచ్చాయి. వీటిలో ముండ్లమూరు ఘటనలో శిశువు చికిత్స పొందుతూ మృతి చెందడం జిల్లావాసులను తీవ్రంగా కలచివేసింది. ప్రస్తుతం బాలసదన్, శిశుగృహాల్లో ఆశ్రయం పొందుతున్న చిన్నారులు తల్లిదండ్రుల ప్రేమకు దూరంగా అధికారుల సంరక్షణలో జీవనం సాగిస్తున్నారు. వారికి ఆహారం, వైద్యం, విద్య, రక్షణ కల్పిస్తున్నప్పటికీ, తల్లిదండ్రుల ప్రేమను భర్తీ చేయడం సాధ్యం కాదని అధికారులు చెబుతున్నారు.



చిన్నారులను పలకరిస్తే అమాయక చూపులు, కన్నీటి కళ్లే కనిపిస్తున్నాయని శిశుగృహ సిబ్బంది పేర్కొంటున్నారు. మరోవైపు సంతానం లేని దంపతులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం దత్తత కోసం సంవత్సరాల తరబడి ఎదురు చూస్తున్నారు. అలాంటి పరిస్థితుల్లో పిల్లలను రోడ్లపై వదిలేయకుండా అధికారులకు అప్పగిస్తే వారికి సురక్షిత మైన, ప్రేమతో కూడిన భవిష్యత్తు లభించే అవకాశం ఉందని బాలల సంక్షేమ నిపుణులు సూచిస్తున్నారు. చైల్డ్‌లైన్ ప్రతినిధి బీవీ సాగర్ తెలిపిన వివరాల ప్రకారం, అనారోగ్యంతో పుట్టిన పిల్లలకు చికిత్స చేయించే ఆర్థిక స్తోమత లేకపోవడం, వివాహేతర గర్భధారణ, కుటుంబ కలహాలు, తీవ్రమైన పేదరికం, సామాజిక ఒత్తిళ్లు వంటి కారణాలతో కొందరు తల్లిదండ్రులు పిల్లలను వదిలేస్తున్నారు. అయితే పరిస్థితులు ఎంత క్లిష్టంగా ఉన్నా పసికందులను ముళ్లపొదల్లో, కాలువల్లో, రోడ్ల పక్కన వదిలేయడం మానవత్వానికి విరుద్ధమని ఆయన స్పష్టం చేశారు. ఇలాంటి కుటుంబాలను గుర్తించి కౌన్సెలింగ్, అవగాహన కార్యక్రమా లు నిర్వహిస్తున్నప్పటికీ సమాజం కూడా బాధ్యత తీసుకుని ఇలాంటి ఘటనలను అరికట్టేందుకు సహకరించాలని కోరారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి పి. దినేష్‌కుమార్ మాట్లాడుతూ, ఏ కారణంతోనైనా పిల్లలను పెంచే పరిస్థితి లేకపోతే నిర్జన ప్రాంతాల్లో వదిలేయకుండా నేరుగా ఒంగోలులోని ప్రభుత్వ శిశుగృహానికి సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అధికారులు స్వయంగా వెళ్లి చిన్నారులను సురక్షితంగా తీసుకువచ్చి వైద్యం, సంరక్షణ, పునరావాసం కల్పిస్తారని తెలిపారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని చెప్పారు. రైల్వే స్టేషన్లు, బస్టాండ్లలో బాలల రక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దత్తత తీసుకోవాల నుకునే దంపతులకు నిబంధనల ప్రకారం అన్ని అర్హతలు పరిశీలించి చట్టబద్ధంగా పిల్లలను అప్పగించే విధానం అమల్లో ఉందన్నారు. ఇలాంటి ఘటనలను అరికట్టాలంటే అవగాహన కార్యక్రమాలతో పాటు గర్భిణులకు మానసిక, వైద్య, ఆర్థిక సహాయం అందించాల్సిన అవసరం ఉంది. ప్రతి పసికందికి జీవించే హక్కు ఉందని, వారిని కాపాడడం కుటుంబాలకే కాకుండా సమాజం మొత్తం బాధ్యత అని అధికారులు, బాలల హక్కుల కార్యకర్తలు స్పష్టం చేస్తున్నారు.

# కోట్ల విలువైన భూమి కాజేయాలన్న కుట్ర భగ్నం

- భూకబ్జా ముఠా గుట్టురట్టు.. 8 మంది అరెస్టు
- మిగిలిన నిందితులను త్వరలో అరెస్టు చేస్తాం
- శ్రీకాకుళం జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి



**శ్రీకాకుళం, జులై 19 ప్రభాతవార్త:** శ్రీకాకుళం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో సుమారు రూ.3 నుంచి రూ.4 కోట్ల విలువైన ఖాళీ స్థలాన్ని నకిలీ పత్రాలు, తప్పుడు మరణ ధ్రువీకరణ పత్రాలు, నకిలీ వారసత్వ ధ్రువీకరణ పత్రాల ఆధారంగా అక్రమంగా స్వాధీనం చేసుకునేందుకు కుట్ర పన్నిన భూకబ్జా ముఠా గుట్టును శ్రీకాకుళం రూరల్ పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ఇప్పటివరకు 8 మంది నిందితులను అరెస్టు చేసి న్యాయస్థానం ముందు హాజరు పరిచినట్లు జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఎ1 అడబాల రజని, ఎ2 తెలుగు సతీష్ కుమార్, ఎ3 సలిపిల్లి లక్ష్మణరావు, ఎ4 త్రినాథ్, ఎ5 తమ్మినేని వెంకటశ్రీరామ చిరంజీవి నాగనాని, ఎ6 తమ్మినేని సీతారాం (మాజీ స్పీకర్), ఎ7 తమ్మినేని వాణి, ఎ8 ముదాడ్ల ఉపేంద్ర కుమార్, ఎ9 జెగురిపాటి ఉపేంద్ర రావు, ఎ10 మామిడి గోపాలకృష్ణ, ఎ11 సాంబాన సాంబశివరావు, ఎ12 కూన పెద్దిరాజు, ఎ13 బొడ్డేపల్లి అరుణ (ప్రస్తుత సబ్ రిజిస్ట్రార్, హిరమండలం) ఈ కేసులో మొత్తం ఈ 13 మంది నిందితుల ప్రమేయం ఉన్నట్లు దర్యాప్తులో గుర్తించినట్లు తెలిపారు.

**అరెస్టు చేసిన నిందితులు:** అడబాల అండవరపు రజని, తెలుగు సతీష్ కుమార్, సాలిపిల్లి లక్ష్మణరావు, ముదాడ్ల ఉపేంద్ర కుమార్, జెగురిపాటి ఉపేంద్రరావు, మామిడి గోపాలకృష్ణ, సాంబాన సాంబశివరావు, కూన పెద్దిరాజు (డాక్యుమెంట్ రైటర్). ఇతర నిందితులపై దర్యాప్తు కొనసాగుతోందని, మిగిలిన నిందితులను త్వరలోనే అరెస్టు చేస్తామని ఎస్పీ తెలిపారు.

**కేసు వివరాలు:** 1988, 1992 సంవత్సరాల్లో చాపురం గ్రామ పంచాయతీ, బలగ పరిధిలోని సర్వే నంబర్ 35/13లో ఉన్న (84,85,86) ప్లాట్లను ఫిర్యాదుదారుడి తండ్రి తంగ్రీకట్ట కనక లింగేశ్వరరావు చట్టబద్ధంగా కొనుగోలు చేశారు. ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో నివసిస్తున్న కారణంగా స్థలం చాలా కాలంగా ఖాళీగా ఉండటాన్ని ఆసరాగా చేసుకుని కొందరు వ్యక్తులు ముందస్తు పథకం ప్రకారం దానిని కబ్జా చేసేందుకు కుట్ర పన్నారు. ఆ కుట్రలో భాగంగా అసలు యజమాని జీవించి ఉన్నప్పటికీ మరణించినట్లు నకిలీ మరణ ధ్రువీకరణ పత్రాన్ని సృష్టించి, దాని ఆధారంగా నకిలీ కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం తయారు చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. అనంతరం తప్పుడు రిజిస్ట్రేషన్ పత్రాలను రూపొందించి కోట్ల రూపాయల విలువైన భూమిపై యాజమాన్య హక్కు చెలాయించేందుకు ప్రయత్నించినట్లు పోలీసులు తెలిపారు. స్థలానికి ప్రహరీ నిర్మించే ప్రయత్నాన్ని అసలు యజమాని కుటుంబ సభ్యులు అడ్డుకోవడంతో వారు పోలీసులను ఆశ్రయించారు.

దర్యాప్తులో నకిలీ పత్రాల తయారీ, తప్పుడు వారసత్వం సృష్టించ డం, తప్పుడు రిజిస్ట్రేషన్ తదితర అంశాలు వెలుగులోకి వచ్చినట్లు ఎస్పీ తెలిపారు. ఫిర్యాదు లో పేర్కొన్న ఆరోపణల ప్రకారం, ఎ1 నుండి ఎ4 వరకు ఉన్న నిందితులు ఎ5, ఎ6, ఎ7 సహకారంతో ఎ12 ద్వారా తప్పుడు పత్రాలను తయారు చేయించారని ఆరోపించబడింది. అనంతరం ఎ1కు ఎ8 నుండి ఎ11 వరకు ఉన్న వ్యక్తులతో పరిచయం ఉన్నట్లు చూపించి, వారి పేర్లతో పత్రాలను సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. అలాగే ఎ13 పై నిందితులందరికీ సహకరిస్తూ, సంబంధిత ఆస్తికి తప్పుడు రిజిస్ట్రేషన్ జరిగేలా సహకరించినట్లు ఫిర్యాదులో ఆరోపించారు. నేర కుట్ర దర్యాప్తులో ఎ5 తమ్మినేని వెంకట శ్రీరాములు చిరంజీవి నాగనాని, ఎ6 తమ్మినేని సీతారాం (మాజీ స్పీకర్), ఎ7 తమ్మినేని వాణిలు ఇతర నిందితులతో కుమ్మక్కై, దురుద్దేశపూర్వకం గా తప్పుడు, నకిలీ పత్రాలను సృష్టించి సుమారు రూ.3 కోట్ల విలువైన ఖాళీ స్థలాలను అక్రమంగా కబ్జా చేసేందుకు ప్రయత్నించినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందని వెల్లడించారు. నకిలీ రబ్బరు స్టాంపులు, ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

**ప్రజలకు సూచన:** భూములు కొనుగోలు చేసే ముందు భూ రికార్డులు, యాజమాన్య పత్రాలు, వారసత్వ ధ్రువీకరణ పత్రాలు, రిజిస్ట్రేషన్ వివరాలను సంబంధిత ప్రభుత్వ శాఖల ద్వారా తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచించారు. రూ.5 లక్షలకు మించిన భూ లావాదేవీలను పాన్ కార్డు వివరాలతోనే నిర్వహించాలని తెలిపారు. నకిలీ పత్రాల సృష్టి, ప్రభుత్వ రికార్డుల తారుమారు, భూ కబ్జా వంటి నేరాలకు పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**ప్రతిభకు ప్రశంస:** ఈ కేసును ఛేదించడంలో కీలకంగా పనిచేసిన శ్రీకాకుళం టౌన్ డిఎస్పీ సి హెచ్ వివేకానంద పర్యవేక్షణలో శ్రీకాకుళం రూరల్ సిఐ పైడపు నాయుడు, ఎస్ఐ సురేష్, ఆమదాలవలస ఎస్ఐ బాలరాజు, శ్రీకాకుళం వన్‌టౌన్ ఎస్ఐ హరికృష్ణతో పాటు దర్యాప్తులో పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

# అదే జరిగితే.. మరి కోలుకోలేం

- యుటిలిటి స్థలాన్ని సేకరించాలని కలెక్టర్ ఆదేశాలు
- రణస్థలం జాతీయ రహదారిపై 'సేకరణ' ముప్పు
- రోడ్డున పడతామని బాధితులు తీవ్ర ఆందోళన
- భూమి సేకరించేందుకు హైవే అధికారులు సన్నాహాలు





**రణస్థలం (శ్రీకాకుళం జిల్లా), జులై 19 ప్రభాతవార్త:** శ్రీకాకుళం జిల్లాలో రణస్థలం మండల కేంద్రం జెఆర్‌పురం 16వ జాతీయ రహదారిపై జరుగుతున్న ఫ్లైఓవర్ పనులు స్థానిక వ్యాపారులు, నివాసితులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఏడాదిన్నర క్రితం వంతెన నిర్మాణం కోసం హైవే అధికారులు రహదారికి అడ్డంగా ఉన్న పలు నిర్మాణాలను తొలగించిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో సర్వం కోల్పోయిన బాధితులు ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న తరుణంలో తాజాగా శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కెవి మహేశ్వరరెడ్డి ఫ్లై ఓవర్ పనులను పరిశీలించారు. కలెక్టర్ స్వప్నల్ దినకర్ పుండ్కర్ హైవే అధికారులకు ఇచ్చిన ఆదేశాలతో మండల కేంద్రంలోని స్థానిక వ్యాపారులు, నివాసితులను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తున్నాయి. తొలుత జాతీయ రహదారికి ఇరువైపులా విద్యుత్ స్తంభాలు, పైప్‌లైన్లు వంటి వసతుల కోసం హైవే అధికారులు కొంత స్థలాన్ని 'యుటిలిటీ కారిడార్' నిమిత్తం కేటాయించారు. దీనివల్ల తమకు కొంతైనా ఊరట లభిస్తుందని, చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే వీలుంటుందని స్థానికులు భావించారు. అయితే ఇటీవల ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ యుటిలిటీ కారిడార్ స్థలాన్ని కూడా సేకరించాలని హైవే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. యుటిలిటీ కారిడార్ స్థలాన్ని కూడా సేకరించేందుకు హైవే అధికారులు సిద్ధమైపోతున్నారు. దీంతో మరి కోలుకోలేమని ఇటు నివాసితులు అటు వ్యాపారులు నైరాశ్యం చెందుతున్నారు.

**రోడ్డున పడే స్థితిలో చిరు వ్యాపారులు:** కలెక్టర్ ఆదేశాలతో చిరు దుకాణదారుల పరిస్థితి ఆందోళనకరంగా మారింది. గత ఏడాదిన్నర నుంచి జరుగుతున్న ఫ్లై ఓవర్ నిర్మాణ పనుల కారణంగా చాలా నష్టపోయామని, మళ్లీ స్థల సేకరణ చేస్తే ఉపాధి కూడా ఉండదని రోడ్డుపై బతుకుతున్న వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఉపాధి కోల్పోతున్న ఫుట్‌పాత్ వ్యాపారులు:** రహదారి పక్కన చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న సుమారు ఆరు రకాల ఫుట్‌పాత్ వ్యాపార వర్గాలు ఈ నిర్ణయంతో పూర్తిగా ఉపాధి కోల్పోయే పరిస్థితి వచ్చింది. తమ పొట్ట కొట్టవద్దంటూ వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**బాధితుల డిమాండ్:** అభివృద్ధి పేరుతో మమ్మల్ని పూర్తిగా రోడ్డున పడేయడం న్యాయం కాదు. అధికారులు పునరాలోచించి, మాకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు చూపించాలి లేదా జీవనోపాధి దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలి. అభివృద్ధి పనులు జరగాల్సిందే అయినా, దానికి పేద, మధ్యతరగతి ప్రజల జీవితాలు బలి కాకూడదని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై జిల్లా యంత్రాంగం, హైవే అధికారులు మానవీయ కోణంలో స్పందించి, తమకు న్యాయం చేయాలని రణస్థలం నివాసితులు, వ్యాపారులు వేడుకుంటున్నారు.


వార్త

సజ్జనుడి జీవితం ఎలా ఉత్తమమవుతుంది అంటే ప్రేమతో, దయాగుణంతో అతను చేసే చిన్న చిన్న పనుల వల్లనే.

న- గ్లిబ్బర్

# బ్రెయిన్‌డ్రెయిన్ తప్పదా!

ఎన్నో అంతరిక్ష ప్రయోగాలను ఎంతో అవలీలగా ప్రయోగించి విజయవంతమైన చరిత్ర సృష్టించిన 'ఇస్రో' అంతరిక్షా ప్రయోగ కేంద్రం ఈ మధ్యకాలంలో ఎందుకో చతికిలపడిపోయింది. చేసిన అన్ని ప్రయత్నాలూ ఫలించాలని లేదు. కానీ సమిష్టి కృషిగా శాస్త్రవేత్తలు ప్రయోగాలన్నీ సఫలత చెందితే దేశప్రతిష్ట పెరుగుతంది. కానీ ఇప్పుడు 'ఇస్రో'లో జరుగుతున్న కలవరపాటు సంఘటనలపై ప్రభుత్వాలు సైతం ఆందోళన చెందుతున్నట్లుగానే ఉంది. కానీ 'ఇస్రో' నుంచి శాస్త్రజ్ఞుల వలస గురించి ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ నిజమేనని చెబుతూనే 'చాలా మంది శాస్త్రజ్ఞులు వెళ్తుంటారు, కొత్తవారు వస్తుంటారు' దాని గూర్చి ఎలాంటి ఆందోళన లేదని సమర్థించుకున్నారు. ఇస్రోలో దాదాపు 14,600 మంది ఉద్యోగులుండగా అందులో 100-120 మంది నిష్క్రమించడాన్ని అతి తక్కువే కదా! అని అనుకోలేం. ఇస్రో చేపట్టిన ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల్లో భాగమైన వారు తాజాగా ఆప్రయోగాల నుంచి తప్పించుకుంటున్నారు. రాజీనామాలు చేసి బయటకు వెళ్లిపోతున్నాడు. మంచి అవకాశం ఎక్కడుంటే అక్కడికి వెళ్లి పోవడాన్ని ఎవరూ కాదనలేరు. కానీ తమ ఉపాధిని పెంచుకునే అవకాశమున్నప్పుడు వాటిని త్రోసిరాజని ఎందుకు వెళ్లిపోతున్నారో తెలుసుకుని వాటికి అడ్డుకట్ట వేయలేకపోతే ఇలాంటి సంస్థల మనుగడకే కష్టం. శాస్త్రజ్ఞుల వరుస రాజీనామాలు, స్వచ్ఛంద పదవీ విరమణలనగానే సంస్థ పట్ల వారిలో ఏదో అసంతృప్తి ఉందనే అనుకోవాలి. మరో ప్రైవేట్ సంస్థల్లో హెచ్చు జీతానికే మంచి హోదాలో వెళ్లడమంటే ఒక విధంగా వారికి మంచిదే కావచ్చు. కానీ అంతర్జాతీయంగా అంతరిక్ష పరిశోధనలకు పేరుగాంచిన 'ఇస్రో' నుంచి 'బ్రెయిన్ డ్రెయిన్' మంచిది కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇదొక ఆందోళనకర విషయం. గగన్‌యాన్, చంద్రయాన్-4, లాంటి చారిత్రక ప్రాజెక్టులు అత్యున్నత కీలక దశలో ఉండగా నూరు మందికి పైగా శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, రాజీనామా చేశారని లేదా స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకున్నారన్న వార్తలు రావడంతో కేంద్రం తక్షణ చర్యలు తీసుకొంది. శాస్త్రజ్ఞుల రాజీనామాలను ఆమోదించే ప్రక్రియను కఠినతరం చేసింది. ఈ విషయమై జూలై 14న అంతరిక్ష పరిశోధనా విభాగం రాజీనామాలపై ప్రత్యేక మెమొరాండం జారీ చేసింది. జాతీయ ప్రాధాన్యత ప్రాజెక్టుల్లో పనిచేసే గ్రూప్‌ఎ సైంటిఫిక్, టెక్నికల్ సిబ్బంది రాజీనామా, స్వచ్ఛంద పదవీ విరమణ దరఖాస్తులను నేరుగా కేంద్రానికి పంపేపద్ధతి ఇకపై నివారించబడినట్లు దాని సారాంశం.ప్రతి దరఖాస్తును నేరుగా అతరిక్ష పరిశోధనా శాఖకే చేరాలి. 'ఇస్రో'కు సంబంధించిన అత్యధిక రాజీనామాలు బెంగళూరులోని యు.ఆర్.ఆరావు శాటిలైట్ కేంద్రం నుంచి 80 మంది తిరువనంతపురం స్పేస్ సెంటర్ నుంచి 20మంది ఉన్నారు. అలా వెళ్లిన వారిలో భారత అంతరిక్ష పరిశోధనల్లో కీలకమైన ఎల్‌విఎం 3 ప్రాజెక్టు డైరెక్టర్, స్పాడెక్స్ ప్రాజెక్టు డైరక్టర్, చంద్రయాన్-3 సిమ్యూలేషన్ మేనేజరు ఒకేసారి రాజీనామా చేసి వెళ్లిపోతే అంతరిక్ష పరిశోధనా సాంకేతిక బదిలీ విషయాలలో 'ఇస్రో' మిషన్‌ల కొనసాగింపుపై ప్రభావంపడుతుంది. కారణాలు విశ్లేషించుకుంటే ప్రైవేట్ రంగం లో అంతరిక్ష కేంద్రాలకు అనుమతులివ్వడంతో స్కైరూట్ అగ్నికుల్, పిక్సెల్, ధ్రువస్పేస్ లాంటి 400 స్టార్టప్‌లు వచ్చి చేరాయి. అక్కడ ఉద్యోగులకు ఇస్రో శాస్త్రజ్ఞుల కన్నా 2,3 రెట్లు వేతనం లభిస్తుంది. అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ (నాసా)లో శాస్త్రవేత్తల సగటు వేతనం 80వేల డాలర్ల నుంచి1.5లక్షల డాలర్ల దాకా ఉంటుంది. అంటే ఇండియన్ కరెన్సీలో రూ.77 లక్షల నుంచి 1.4 కోట్ల దాకా ఉంటుంది. ఇస్రోల సీనియర్ సైంటిస్టుల జీతాలు సైతం సగటు సీనియర్ సాఫ్ట్‌వేర్ ఇంజినర్ల వేతనాల కన్నా తక్కువే. ఈ కారణం చేతనే ఐఐటియన్లు 'ఇస్రో'లో చేరడానికి ఇష్టపడడం లేదు. 2023లో ఇండియన్ స్పేస్ పాలసీ తెచ్చాక వేతనాల విషయంలో వ్యత్యాసాల వలన శాస్త్రజ్ఞులకు కొత్తఆధారం దొరకడంతో వారు'ఇస్రో'ను వదిలి వెళ్తున్నట్లు భావించవచ్చు. స్టాక్ ఆప్షన్, పెక్సిబిలిటీకి అవకాశం ఉంది. 2025లోనే ప్రైవేట్ స్పేస్ స్టార్టప్‌లలో 15కోట్ల డాలర్ల పెట్టుబడి వచ్చింది. ప్రభుత్వ వ్యవస్థలో ప్రమోషన్లు నెమ్మదిగా వస్తాయి. ప్రైవేట్ వేగంగా నిర్ణయాలే కాకుండా ఆధునిక టెక్నాలజీపై పనిచేసే అవకాశాలుంటాయి. ఇస్రో 'బ్రెయిన్ డ్రెయిన్' ఇవాళ్టిది కాదు.2004-2005లో 392 మంది శాస్త్రవేత్తలు బయటికి వెళ్లిపోయారు. అప్పట్లో ఈ అంశం పరిశీలనలోకి వచ్చినా కేవలం ఐటిరంగం విస్తృతి, ప్రైవేట్ రంగ జీతాలేనని ప్రభుత్వం పార్లమెంటులోనే విశ్లేషించి చెప్పింది. నిజానికి శాస్త్రజ్ఞులు వెళ్లకుండా తాత్కాలికంగా ఆపవచ్చేమో కానీవిజ్ఞాన విస్తృతిని ఆపేపరిస్థితి ఉండదు.అందుచే వారికి మెరుగైన అవకాశాలను కేంద్రప్రభుత్వమే కల్పించాలి. అలాంటప్పు డు మాత్రమే శాస్త్రజ్ఞులు, ఇంజినీర్లు ప్రభుత్వ సంస్థలను వదిలివెళ్లే అవకాశం తక్కువగా ఉంటుంది. భారీ జీతాల మాటెలా ఉన్నా,రిసెర్చ్ గ్రాంట్లు, ఫాస్ట్‌ట్రాక్ ప్రమోషన్లు, ప్రాజెక్టు లీడర్‌షిప్ అవకాశాలు కల్పించడం అవసరం. ఇస్రోలో శిక్షణ పొందిన వారు ప్రయివేట్ రంగానికి వెళ్లడం ద్వారా మొత్తం భారత అంతరిక్ష ఎకో సిస్టమ్ బలపడుతుంది.'ఇస్రో'లో అంతరిక్ష నౌకల ప్రయోగాల అనంతరం ప్రపంచం భారత్‌వైపు చూస్తోంది. ఇలాంటి సమయంలో ప్రతిష్టాత్మక సంస్థల నుంచి బ్రెయిన్ డ్రెయిన్ సమర్థనీయం కాదు.వాళ్లుప్రైవేట్ అంతరిక్ష సంస్థలకు వెళ్లిపోకుండా తగు నిర్ణయాలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంమీద ఉంది. శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు ఆకాంక్షలను ప్రభుత్వం గౌరవించాలి.



మాటకు మాట ప్రతీకారం కాదు, మౌనమే దానికి సమాధానం.

ప్లేటో



జ్ఞానం వంశపారంపర్య హక్కు కాదు. ఎవరికి వారు కష్టపడి ఆర్జించుకోవాల్సిందే.

వివేకానంద

## ప్రజావాక్కు

### దేవుళ్ళకు కూడా జబ్బులు వస్తాయా?

ప్రపంచవ్యాప్తంగా శాస్త్రీయవిజ్ఞానంవికస్తుంది.మన దేశంలో మాత్రం ఆవుపేడలో మహిమలు, ఆవు మూత్రంలో రోగ నిరోధకశక్తి ఎంతశాతం ఉందో చూడమని యూనివర్శిటీలకు ప్రభుత్వాలు ఆదేశాలు ఇస్తున్నాయి. పూరి జగన్నాథ స్వామికి ప్రతిసంవత్సరం రథోత్సవం జరుగుతుంది. పదిలక్షల భక్తులువస్తారని ప్రచారం. రథం తాడు పట్టుకొని లాగితే పుణ్యమం అని ఎగబడతారు భక్తులు. తొక్కిసలాటలో ప్రతి సంవత్సరం కొంతమంది చనిపోవటం జరుగుతుంది. నిన్న ఇద్దరు భక్తులు చనిపోయారని అధికారిక వార్త.వాస్తవంగా ఎంత మంది చనిపోయింది తెలియదు. రథోత్సవం సమయంలో డాక్టర్లు పూరిజగన్నాధుని విగ్రహాలకు జ్వరం అన్నట్లుగా, విగ్రహాలకు డాక్టర్లు సెటాస్కోప్ పెట్టీ పరీక్షలు జరపడం ప్రపంచంలో ఒక వింతగా చెప్పుకోవచ్చు. దేవుళ్ళకు కూడా మనుషులుగా గుండె కొట్టు కోవటం, నాడీచూడటం ,జరం రావటం దగ్గు జలుబు చేస్తాయా? ఒకవేళ వస్తే మనుషులు తయారు చేసిన మందులు పనిచేస్తాయా?

- నార్నె వెంకట సుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### పరుగులు తీస్తున్న ఎఐ

కృత్రిమ మేధస్సువేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ యుగంలో అసలు ప్రశ్నయంత్రాలు మనుషుల్లా ఆలోచించగలవా అనేదికాదు. భూమి, నీరు,పర్యావరణ వ్యవస్థల పరిరక్షణలో మెరుగైన నిర్ణయాలు తీసుకునేందుకు అవి ఎంతవరకు తోడ్పడగలవన్నదే ప్రధాన అంశం. సాంకేతికత లక్ష్యం కేవలం పనులను సులభతరం చేయడం మాత్రమే కాకుండా,ప్రజల జీవనప్రమాణాలను మెరుగుపరచడం, ప్రకృతి సంపదను కాపాడడం కూడా కావాలి. పెరుగుతున్న నగరీకరణ నేపథ్యంలో హైదరాబాద్ వంటి మహానగరాలకు కృత్రిమమేధస్సు ఎంతో ఉపయోగపడుతుంది. ఏఐను నిర్ణయాధికారిగా కాకుండా, మానవ మేధస్సుకు సహాయక సాధనంగా ఉపయోగించాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### రైళ్ల రంగు మార్చాలి

మనుషులకు హెచ్చరికలు తెలిపే బోర్డులు పెట్టగలం కానీ మరి పశువులకు ఎట్లా తెలిసేది? వందే భారత్ రైళ్ల వెలుపలి భాగాలు ముఖ్యంగా తెలుపు లేతనీలం, తెలుపు కాషాయ రంగుల్లో ఉంటున్నాయి. రైలు దూరం నుంచే ప్రస్ఫుటంగా కనపడేటట్లు ఉండాలి. ఎరుపు, ఆకుపచ్చ, నీలం,గోధుమరంగుఛాయతో,ఎరుపు రంగులు వాడాలి.

### మత్స్యకారుల బలవన్మరణాలను నిరోధించాలి

ఈ మధ్య విశాఖ తీరంలో పడవబోల్తాపడి ఏడుగురు మత్స్యకారులు గల్లంతవ్వటం ఎంతో బాధాకరం. నేడు ఎల్‌నినో వంటి కారణాలతో వాతావరణ శాఖ కూడా పసికట్టలేనంతగా పర్యావరణం ఆకస్మిక మార్పులకు లోనవుతుంది. అల్ప పీడనం వల్ల భారీ వర్షాలు అని ప్రకటించిన చోట కూడా కొన్నిసార్లు చిన్నజల్లు పడకపోవటం తెలిసిందే. కనుక నేటి వింత వాతావరణ స్థితిని దృష్టిలో పెట్టుకొని, యుద్ధ క్షేత్రంలో సైనికులు సదా సాయుధులై అనుక్షణం సర్వసన్నద్ధంగా వుంటున్న విధంగా, వేటకి వెళ్ళే ప్రతి మత్స్యకారుడు లైఫ్ జాకెట్ ధరించి జాగరూకులై వుండాలి. ఈ ప్రమాదం నుండి బయట పడినమరోమత్స్యకారుడు,తనకు వేరేనౌకలోని చైనా సిబ్బంది విసిరిన లైఫ్‌జాకెట్ వల్ల ప్రాణాపాయం తప్పిందని చెప్పాడు. కనుక లైఫ్ జాకెట్ వుంటే ఆపదలో, ప్రాణాలు దక్కుతాయి. ఈ లైఫ్ జాకెట్ ధర కేవలం మూడు వేలరూపాయల లోపేనట. ప్రాణం కన్నా విలువైనది ఏమీ లేదు. కేవలం నష్ట పరిహారంతో పోయిన ప్రాణాలు తిరిగిరావు. కనుక చేతులు కాలాక ఆకులు పట్టుకునే కంటే ముందు జాగ్రత్త వుండాలి.

- తిరుమలశెట్టి సాంబశివరావు, గుంటూరు

### చర్యలు చేబట్టాలి

దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సంఖ్య తగ్గుతుంది. ప్రైవేటు విద్యా సంస్థల్లో విద్యార్థుల సంఖ్య ఏటా పెరుగుతుంది. దేశవ్యాప్తంగా ఎక్కువ ప్రాంతాల్లో తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రైవేటు విద్యా సంస్థల్లో చేర్పించేందుకే మొగ్గు చూపుతున్నట్లు కేంద్ర విద్యా శాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రభుత్వ విద్యా సంస్థల్లో పిల్లల సంఖ్య తగ్గుతుండటంపై కారణాలను లోతుగా విశ్లేషించి, అధికారులు తగిన చర్యలు చేబట్టాలి.

- మా. శ్రీ. రాజు, పాల్వంచ

### మంచి నిర్ణయమే..

తమిళనాడు ప్రభుత్వం ప్రార్థనాలయాలు, విద్యాసంస్థలు, బస్టాండ్ల సమీపంలో ఉన్న మద్యందుకాణాలను తొలగించేందుకు తీసుకున్న నిర్ణయం ప్రశంసనీయమైనది. ఇటువంటి చర్యలు విద్యార్థులకు,ప్రజలకు ప్రశాంతమైన వాతావరణాన్ని కల్పించడంలో దోహదపడతాయి. ఆధ్యాత్మిక కేంద్రాల పవిత్రతను, విద్యాలయాల గౌరవాన్ని కాపాడే ఈ విధానాన్ని ఇతర రాష్ట్రాలు కూడా పరిశీలించి అమలు చేస్తే సమాజ శ్రేయస్సుకు మరింత తోడ్పాటు అందుతుంది. సమాజంలో సానుకూల ఆలోచనలు, మంచివిలువలను ప్రోత్సహించేంచాలి.

-ఎన్. కృష్ణ, హైదరాబాద్

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# రైల్వేలో తెలుగు రాష్ట్రాలకు అన్యాయమే!

**ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో పేర్కొన్నట్టుగా ఎట్టకేలకు విశాఖపట్నంలో సౌత్ కోస్ట్ రైల్వేజోన్ పేరు కొత్త రైల్వేజోనల్ కార్యాలయం ఏర్పాటు చేసిన నేపథ్యంలో ఆంధ్రరాష్ట్రానికి చెందిన అనేక రైల్వే స్టేషన్లు, అనేక రైలు మార్గాలు ఇతర రైల్వే జోన్లలో కలపడం వల్ల తీవ్ర అన్యాయం జరిగింది. కొత్తగా ఏర్పాటు చేసిన జోనల్ కార్యాలయం సంగతి ఎలావున్నప్పటికీ తెలుగురాష్ట్రాలలో చేపట్టిన కొత్త రైలు మార్గాల నిర్మాణం దశాబ్దాలు గడుస్తున్నప్పటికీ పూర్తి కావడం లేదు. ఇదే సమయంలో నిన్నటి వరకు రెండు తెలుగు రాష్ట్రాలకు కలిపి సికింద్రాబాద్ కేంద్ర స్థానంగా వున్న సౌత్ సెంట్రల్ రైల్వే జోన్ ఆదాయంలో దేశం మొత్తంగా మూడవ స్థానంలో, దక్షిణాది రాష్ట్రాలలో ప్రథమ స్థానంలో వుంది. అయినా నిధుల కేటాయింపులో తీవ్ర నిర్లక్ష్యానికి గురైంది. తెలుగు రాష్ట్రాలలో చేపట్టిన కొత్త రైల్వేలైన్లు నిర్మాణ పనులు వేగం గమనిస్తే నత్తలు నయమనిస్తున్నాయి.**



అన్నవరపు బ్రహ్మయ్య

రైల్వేశాఖలో తెలుగురాష్ట్రాలకు అడుగడుగునా అన్యాయమే జరుగుతోంది. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో పేర్కొన్నట్టుగా ఎట్టకేలకు విశాఖపట్నంలో సౌత్ కోస్ట్ రైల్వే జోన్ పేరు కొత్త రైల్వే జోనల్ కార్యాలయం ఏర్పాటు చేసిన నేపథ్యంలో ఆంధ్రరాష్ట్రానికి చెందిన అనేక రైల్వే స్టేషన్లు, అనేక రైలు మార్గాలు ఇతర రైల్వే జోన్లలో కలపడం వల్ల తీవ్ర అన్యాయం జరిగింది. కొత్తగా ఏర్పాటు చేసిన జోనల్ కార్యాలయం సంగతి ఎలావున్నప్పటికీ తెలుగురాష్ట్రాలలో చేపట్టిన కొత్త రైలు మార్గాల నిర్మాణం దశాబ్దాలు గడుస్తున్నప్పటికీ పూర్తి కావడం లేదు. ఇదే సమయంలో నిన్నటి వరకు రెండు తెలుగు రాష్ట్రాలకు కలిపి సికింద్రాబాద్ కేంద్ర స్థానంగా వున్న సౌత్ సెంట్రల్ రైల్వే జోన్ ఆదాయంలో దేశం మొత్తంగా మూడవ స్థానంలో, దక్షిణాది రాష్ట్రాలలో ప్రథమ స్థానంలో వుంది. అయినా నిధుల కేటాయింపులో తీవ్ర నిర్లక్ష్యానికి గురైంది. తెలుగు రాష్ట్రాలలో చేపట్టిన కొత్త రైల్వేలైన్లు నిర్మాణ పనులు వేగం గమనిస్తే నత్తలు నయ మనిస్తున్నాయి. మాచర్ల నల్లగొండల మధ్య 92 కి.మీ.రైల్వే లైను నిర్మాణ పనులు 1997-98వ సంవత్సరంలో ప్రారం భం కాగా, కోటిపల్లినర్సాపూర్ మధ్య 57 కి.మీ.పిఠాపురం కాకినాడ మధ్య 22 కి.మీ. నూతన రైల్వే లైన్ నిర్మాణ పనులు 2001-02లో, కడప బెంగుళూరు మధ్య 255 కి.మీ. పనులు 2008-09 సంవత్సరంలో, నడికుడిశ్రీకాళాహస్తి మధ్య 308 కి.మీ., గూడురుదుర్గరాజపట్నం మధ్య 46 కి.మీ.ల పనులు 2011-12లో ప్రారంభమ య్యాయి. ఇక 2012-13లో భద్రాచలం రోడ్ కొవ్వూరు మధ్య 152 కి.మీ., కంభం ప్రొద్దుటూరు మధ్య 110 కి.మీ., కొండపల్లి కొత్తగూడెం మధ్య 120 కి.మీ. మేరకు కొత్త లైన్లు పనులు ప్రారంభించారు. అంటే ఈ పనులు చేపట్టి ఇప్పటికి 15 నుంచి 26 సంవత్సరాలు దాటుతున్నా నేటికి పూర్తి కాలేదు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వున్న సుందర ప్రాంతాలలో ఒకటైన కొనసీమ ప్రాంత ప్రజలకు ఎటువంటి రైలు ప్రయాణ సదుపాయం లేదు. కోటిపల్లి, నర్సాపూర్ల మధ్య 57కి.మీ. రైలు మార్గం నిర్మాణం పూర్తయితే కోనసీమ ప్రాంత ప్రజలకు రైలు ప్రయాణ సదుపాయం ఏర్పడుతుంది. నిర్మాణానికి సర్వేపూర్తి చేసిన సమయానికి అంటే 498కోట్ల రూపాయల ఖర్చు అవుతుందని అంచనావేశారు. నేడు అదే మార్గం నిర్మాణానికి కనీసం 1200 కోట్ల రూపాయలు అవుతుందని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో అసలు 7 నూతన రైలు మార్గాలు పూర్తవుతాయా? లేదా అనే అనుమానం కలుగుతుంది. రైల్వేబోర్డు నిబంధనల ప్రకారం ప్రతిపాదిత కొత్తరైల్వే మార్గాల ఏర్పాటుకు అయ్యే వ్యయంలో కనీసం ఆరు శాతం ఆదాయం వచ్చే అవకాశం వుంటే చాలు, కానీ తెలుగురాష్ట్రాలలో ప్రతిపాదించిన ప్రతి కొత్త రైల్వే మార్గంలో 6 నుంచి 10శాతం ఆదాయం వస్తుందని అంచనా వేశారు. అయినప్పటికీ నిర్మాణ పనులకు అవసరమైన నిధులు కేటాయించడంలో నిర్లక్ష్యం ఎందుకువహి స్తున్నారో అర్థంకావడం లేదు. ఆంధ్రప్రదేశ్ పైన తెలిపిన నిర్మాణ పనులు కాకుండా కొత్తగా మరో 22మార్గాలలో నూతన రైల్వేలైన్ల ఏర్పాటుకు సంబంధించి



రెండు దశాబ్దాల కిందటే సర్వేలు పూర్తయ్యాయి. ఇక మార్కాపురం, శ్రీశైలం హైదరాబాద్‌ల మధ్య 290కి.మీ., మాచర్ల,గద్వాల్ మధ్య 184 కి.మీ. నెల్లూరు, రాజంపేట మధ్య 120కి. మీ., సామర్లకోట చింతూరుల మధ్య 150 కి.మీ., కళ్యాణదుర్గం అనంతపూర్ల మధ్య 58కి.మీ., భద్రాచలం,సత్తుపల్లి మధ్య 54.1 కి.మీ. మేరకు నూతనంగా రైల్వే లైన్లు వేయాలనే ప్రతిపాదనలు వచ్చాయి. కొత్త రైల్వేలైన్ల సర్వేలు, ప్రతిపాద నలు సిద్ధం చేసి పుష్కరకాలం దాటిపోయింది. ఈ ప్రతి పాదనలు కార్యరూపం దాల్చుతాయో లేదో ఎవరూచెప్పలేని స్థితి. కానీ కేవలం ఆరేళ్ల క్రితం తమిళనాడు రాష్ట్రంలో కొత్తగా ప్రారంభించిన 14 రైల్వే లైన్ల పనులు, కర్ణాటక రాష్ట్రంలో ప్రారంభించిన 18 పనులు పూర్తయ్యే దశకు చేరుకున్నాయి. మనకు స్వాతంత్ర్యం లభించిన 75 ఏళ్ల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కొత్తగా నంద్యాల ఎర్రగుంట మధ్య 126 కి.మీ., కాకినాడ కోటిపల్లి మధ్య 45 కి.మీ., కృష్ణపట్నం ఓబులవారిపల్లి మధ్య 113 కి.మీ. మేరకు మాత్రమే వేశారు. (నిజానికి కాకినాడ కోటిపల్లి మధ్య వేసినది కొత్తలైను కాదు, రెండవ ప్రపంచ యుద్ధం సమయంలో దెబ్బతిన్న ఈ మార్గాన్ని పునరుద్ధరించారు.) కానీ ఇదే సమయంలో తమిళనాడులో కొత్తగా ఏడు లైన్లు, కర్ణాటకలో ఏడు లైన్లు పూర్తయ్యాయి. దీనిని బట్టి తెలుగు రాష్ట్రాలకు చెందిన పార్లమెంటు సభ్యుల పనితీరు ఏపాటిదో అర్థం అవుతోంది. ఇక ఆదాయం విషయానికి వస్తే రైల్వేలో అత్యధిక ఆదాయం సంపాదిస్తున్న రైల్వేజోన్లలో ఉభయ తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన దక్షిణ మధ్య రైల్వేమూడో స్థానం లో వుంది. దేశవ్యాప్తం వున్న (కొత్తగా ఏర్పడిన విశాఖ రైల్వే జోన్ కాకుండా)17 రైల్వే జోన్ల నుంచి 2024-25వ సంవత్సరంలో 2,65,0024 కోట్ల రూపాయలు ఆదాయం లభించగా ఇందులో 3,93288 కోట్ల రూపాయలఆదాయం తో ప్రయాగ కేంద్రస్థానంగా వున్న నార్త్ సెంట్రల్ రైల్వేజోన్ మొదటి స్థానంలో, 23,775,70 కోట్ల రూపాయల ఆదా యంతో భువనేశ్వర్లోని ఈస్టకోస్ట్ జోన్ రెండో స్థానంలో, 23,344.20 కోట్ల రూపాయల ఆదాయంతో సికింద్రాబాద్ కేంద్రస్థానంగా వున్న సౌత్ సెంట్రల్ రైల్వే మూడో స్థానంలో వుంది. దక్షిణాది రాష్ట్రాలలో అయితే ప్రథమ స్థానంలో వుంది. సౌత్ సెంట్రల్ జోన్ నుంచి ఇంత పెద్దమొత్తంలో ఆదాయం లభిస్తున్నప్పటికీ అభివృద్ధి పరంగా ఈ జోను నామమాత్రంగా కూడా నిధులు కేటాయించడం లేదు. కొత్త రైల్వే జోన్ ఏర్పాటు సందర్భంగా వివిధ కీలకమైన రైల్వే స్టేషన్లను విశాఖజోన్ పరిధిలోకి రాకుండా చేశారు. కొత్త జోన్ ఏర్పాటుకు ముందు విశాఖపట్నం డివిజన్ పరిధిలో వున్న కొత్తవలస అరకు వరకు వున్న రైలుమార్గం ప్రస్తుతం విశాఖ డివిజన్ నుంచి తప్పించి రాయఘడ్ డివిజన్ పరిధి లోకి చేర్చారు. ఈ కారణంగా పర్యటక కేంద్రాలైన అరకు, బొర్ర గుహల ద్వారా లభించే ఆదాయం కోల్పోవాల్సి వచ్చింది. తాజా విశాఖపట్నం జోన్ ఏర్పాటు సందర్భంగా ఆంధ్రప్రాంతంలో వున్న రాయచూర్ దాడి మధ్యంలో వున్న 108 కి.మీ. రైలు మార్గం, పగిడిపల్లి విష్ణుపురం జాన్ప హాడ్ మధ్య వున్న 142 కి.మీ.ల రైల్వేలైనులను గుంటకల్ నుంచి విడదీసి సికింద్రాబాద్ డివిజన్లో కలిపారు. అదేవిధం గా జగ్గయ్యపేట ప్రాంతంలోని సిమెంట్ ఫ్యాక్టరీల ద్వారా అధిక ఆదాయం లభించే మోటమర్రి జగ్గయ్యపేట మార్గాన్ని దగ్గరలో వున్న విజయవాడ డివిజన్కు బదులుగా సికింద్రాబాద్ డివిజన్లో వుంచారు. అంతేకాకుండా మన రాష్ట్ర పరిధిలోని దాదాపు 500 కి.మీ.ల రైల్వే లైన్లు ఇతర రాష్ట్రాలలో రైల్వే జోన్ల పరిధిలో కొనసాగుతున్నాయి. ఉదాహరణకి తడగూడూరు మధ్య వున్న 68 కి.మీ. రైల్వేలైను చెన్నయి కేంద్రంగా వున్న దక్షిణ రైల్వేజోన్లో, ధర్మవరం హింతూపూర్ మధ్యవున్న 107 కి.మీ. రైల్వే లైను సౌత్ వెస్టన్ రైల్వే జోన్లోని బెంగుళూరు డివిజన్లో వున్నాయి. అలాగే ఆంధ్ర ప్రాంతానికి చెందిన సూళ్లూరుపేట, నగరి ప్రాంతాలుసదరన్ రైల్వేలో, హిందూపూర్, పెనుగొండ, పుట్టపర్తి, హిందూ పూరు సౌత్ వెస్టన్ రైల్వే జోన్లలో వున్నాయి.తాజా విశాఖ పట్నంకు అత్యంత చేరువలో వుండే శృంగవరపుకోట,అరకు అసెంబ్లీ నియోజకవర్గాలు రాయఘడ్ డివిజన్ పరిధిలో వున్నాయి. తెలుగు రాష్ట్రాలలో ప్రతిపాదించిన కొత్త రైలు మార్గాల పరిస్థితి దయనీయంగా వుంది. తెలుగురాష్ట్రాలలో నూతన రైలు

# దేశాభివృద్ధికి యువత నైపుణ్యమే పునాది

ప్రపంచంలోని 8.2 బిలియన్ల జనాభాలో 15 నుంచి 24 ఏండ్ల వయస్సు కలిగిన యువత జనాభా1.22 బిలియన్లు (దాదాపు 15.4 శాతం) ఉన్నారు. అదే విధంగా ప్రపంచవ్యాప్తంగా 15 నుంచి 64 ఏండ్ల వయస్సు కలిగిన పని చేసే లేదా వర్కింగ్ క్లాస్ జనాభా 78 శాతం అనగా 6.4 బిలియన్లు ఉన్నారు. నేడు భారత జనాభా 1.46 బిలియన్లు ఉన్నది. ఇందులో 15 నుంచి 29 ఏండ్ల యువత జనాభా 40శాతం వరకు ఉన్నది. మన దేశంలో 15 నుంచి 64 ఏండ్ల వయస్సు కలిగిన పని చేసే లేదా వర్కింగ్ క్లాస్ జనాభా 96.1కోట్లు (లేదా 0.961 బిలియన్లు), అనగా 68 శాతం వరకు ఉన్నది. ఇండియాలో 15 ఏండ్లలోపు జనాభా 24 శాతం, 64 ఏండ్లు దాటిన వారి జనాభా 7శాతం వరకు ఉన్నది. ఇతర దేశాలతో పోల్చితే భారత జనాభా సగటు వయస్సు చాలా తక్కువగా 28.8 ఏండ్లు మాత్రమే ఉన్నది. జపాన్ ప్రజల సగటు వయస్సు 49.9 ఏండ్లు ఉన్నది. అందువల్లనే 'ఇండియాను యువ భారత్' అని, జపాన్‌ను 'ఓల్డ్ జపాన్' అని పిలుస్తున్నాం. యువ జనాభా అధికంగా ఉండడం వల్ల రాబోయే రోజుల్లో విశ్వదేశాల్లో భారత్ ముందుండి తన సత్తాను గట్టిగా చాటుకోనున్నది. యువత అధికంగా ఉండడంతో పాటు ఆ యువత నైపుణ్య విద్యను పొందితే భారత భవిత ఉజ్వలంగా ఉండనుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

బి.మధుపాళి

అధిక యువ జనాభా కలిగిన యువ భారతాన్ని పలు సవాళ్లు కూడా వెంటాడుతున్నాయి. నేడు పరిశ్రమ ఆశిస్తున్న నైపుణ్యాలకు, నేటి మన యువత కలిగి ఉన్న నైపుణ్యాలకు మధ్య వ్యత్యాసం లేదా గ్యాప్ అధికంగా ఉండడంతో మన యువశక్తి దేశాభివృద్ధికి అంతగా వినియోగపడడం లేదు. యువతలో అవసర నైపుణ్యాలు కొరవడితే



నిరుద్యోగం పెరగడం, తక్కువస్థాయి ఉద్యోగాలు చేయడం లాంటి ప్రతికూల ఫలితాలు వెక్కిరిస్తున్నాయి. తగిన నైపుణ్యాలు లేని యువతతో నిరుద్యోగసమస్యలు పెరిగి సమ్మిళిత ఆర్థిక అభివృద్ధి, సమానత్వ భావనలు పలుచబడతాయి. పౌర సమాజ సుస్థిరాభివృద్ధికి, ఆరోగ్యకర సమాజ స్థాపనకు నైపుణ్య యువత మాత్రమే పునాది అవుతారు. బహుళ జాతి కంపెనీలు (ఎంఎన్‌సిలు) లేదా పరిశ్రమలు కోరుతున్న నైపుణ్యాలను నేటి విద్యాలయాలు బోధిస్తూ, తగు శిక్షణలు ఇవ్వాలి. నేడు ప్రపంచం 4వ పారిశ్రామిక విప్లవం సాకారం కావడానికి 'ఏఐ, సాంకేతిక, వృత్తి విద్య శిక్షణ' రంగాలు నడుం బిగిస్తే నేటి యువత రేపటి పరిశ్రమలో పనిచేయడానికి సిద్ధం అవుతారు. నేడు ఏఐరంగం ప్రపంచాన్ని శాసిస్తున్నది. మన జీవితాలు, లెర్నింగ్, చేసే పనులను ఏఐ నిర్ణయించనున్నది. పరిశ్రమ కోరుకున్న నైపుణ్యాల్లోమాత్రమే మన యువతను సదాసిద్ధంచేయాలి. నైపుణ్య యువతతో సమాజ శాంతి,సమ్మిళిత సుస్థిరాభివృద్ధి సుసాధ్యం అవుతాయని నేటి విద్యాలయాలు, ప్రభుత్వాలు, యువత, పౌర సమాజం, పాలసీ తయారు చేసే వారు గట్టిగా నమ్మాల్సిన అగత్యంఏర్పడింది. ఉత్తమవృత్తి శిక్షణ, ఏఐ నైపుణ్యాల్లో వృద్ధి, డిజిటల్ సాధికారత వంటి అంశాల్లో యువత దృష్టి పెట్టాలి. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా మన చదువులు కొనసాగాలి. ఉత్తమ శ్రేణి బోధనలు, అవసర మౌలిక వసతులు, నైపుణ్యాల వృద్ధికి తగిన నిధులను వెచ్చించడం, నాణ్యమైన విద్యా బోధనలు నేటి తక్షణ కర్తవ్యం అని మరువరాదు.నేటి యువతనాణ్యమైన నైపుణ్య విద్యను పొందితే మన యువశక్తి దేశానికి వరంగా మారుతుంది. యువతలో నైపుణ్యాలు కొరవడితే యువశక్తి శాపంగా మారి, అశాంతికి ఆజ్యం పోస్తుంది. మన యువతను నైపుణ్య శక్తిగా మార్చుదాం. ●

# వ్యవస్థల తీరుతో కొండలు, గుట్టలు పదిలమేనా?

అడవులను, కొండను, గుట్టలను సృష్టించడానికి ప్రకృతికి లక్షల సంవత్సరాలు పడుతుంది. దానిని నాశనం చేయడానికి మనిషికి కొన్ని నెలలే చాలు. ఇది కేవలం ఒక భావోద్వేగ వాక్యం కాదు. నేటి భారతదేశంలో అనేక ప్రాంతాల్లో కనిపిస్తున్న వాస్తవం రూపం. ఒకప్పుడు పచ్చదనంతో, అడవులతో, జీవవైవిధ్యంతో కళకళలాడిన కొండలు నేడు క్వారీలుగా,గ్రావెల్ గుంతలుగా,రాతి గనులుగా మారుతున్నాయి. ఇది కేవలం పర్యావరణ సమస్య మాత్రమే కాదు. ఇది రాజ్యాంగ పరిరక్షణ, చట్టాల అమలు, పరిపాలనా పారదర్శకత, అవినీతి నియంత్రణ, ప్రజాస్వామ్య జవాబుదారీతనానికి సంబంధించిన ముఖ్యమైన సమస్య. అసలు ప్రకృతి సంపద ఎవరిది? అని ప్రశ్నించుకుంటే! కొండలు, గుట్టలు, అడవులు, నదులు, చెరువులు ఏ ప్రభుత్వానివి కావు, అవి ప్రజల ఉమ్మడి ఆస్తి. ప్రభుత్వంఏదైనా వాటికి కేవలం సంరక్షులు మాత్రమే. ఈ సూత్రాన్ని భారత న్యాయవ్యవస్థ అనేక సందర్భాల్లో వక్కాణించింది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 48ఎ ప్రకారం పర్యావరణం, అడవులు, వన్యప్రాణులను రక్షించడం రాష్ట్రాల బాధ్యత.ఆర్టికల్ 51ఎ (జి) ప్రకారం ప్రతి పౌరుడు ప్రకృతిని పరిరక్షించడం తన ప్రాథమిక విధిగా భావించాలి. ఆర్టికల్ 21కిందజీవించే హక్కులో పరిశుభ్రమైన పర్యావరణం కూడా భాగమని భారత న్యాయస్థానాలు వివిధ తీర్పులలో వివరణ ఇచ్చా యి. పర్యావరణ రక్షణలో ప్రధానంగా చూస్తే పర్యావరణ పరిరక్షణ చట్టం1986, అటవీ సంరక్షణ చట్టం,గనులు ఖనిజాల అభివృద్ధి చట్టం, జీవవైవిధ్య చట్టం,నీటి,గాలికాలుష్య నియంత్రణ చట్టాలున్నాయి. ఈ చట్టాలన్నీ అక్రమ తవ్వకాలను నియంత్రించడానికి బలమైన నిబంధనలు కలిగి ఉన్నాయి.అయినా ఎందుకు ఆగడం లేదు?అని ఆలోచిస్తే, లోపం చట్టాలలో కాదు, అమలులో లోపం అని తెలుస్తోంది. దానిలో ప్రధానమైనది ప్రభుత్వాధికారుల నిర్లక్ష్యం.అక్రమతవ్వ కాలు ఒక్కరోజులో జరగవు. భారీ యంత్రాలు, వందలాది లారీలు, పేలుడు పదార్థాలు ఉపయోగిస్తారు. ఇన్ని జరుగు తున్నా సంబంధిత శాఖలకు తెలియకపోవడం నమ్మశక్యం గా లేదు, అదీ కాకుండా ఇప్పుడు ప్రతిగ్రామంలో సచివాల యాలున్నాయి. ఇక

డాక్టర్ ఎ. భాగ్యరాజ్

అవినీతి అనేది ప్రజల్లో వినిపించే ప్రధాన ఆరోపణ, కొంతమంది అక్రమ వ్యాపారులు,అవినీతి పరులైన అధికారులు కలిసి సహజ వనరులను దోచుకుంటున్నారనేది జగమెరిగిన సత్యం. ఇలాంటి ఆరోప ణలు వచ్చినప్పుడు వాటిపై పారదర్శక విచారణ జరగడం ప్రజావిశ్వాసానికి చాలా అవసరం. అదీ కాకుండా ప్రజలలో అవగాహన లేకపోవడం దౌర్భాగ్యం. తెలియనిది ఏమిటంటే అక్రమ మైనింగ్ కనిపిస్తే ఎక్కడ ఫిర్యాదు చేయాలి?ఏ అనుమతులు తప్పనిసరి? పర్యావరణ అనుమతి అంటే ఏమిటి? గ్రామసభకు ఉన్న అధికారాలు ఏమిటి?ఈ అవగాహన లేకపోవడమే అక్రమార్కులకు అనుకూల వాతావరణాన్ని కల్పి



స్తుంది. ఉదాహరణకు ఒక గ్రామం పక్కన ఉన్న కొండను గ్రావెల్ కోసం తవ్వడం ప్రారంభించారు, మొదట ప్రజలు పట్టించుకోలేదు. కొన్ని నెలల తరువాత కొండ సగం కనుమరుగైంది. వర్షాకాలంలోవర్షపు నీరు వేగంగా గ్రామంలోకి వచ్చింది. చెరువు పూడిపోయింది, భూగర్భజలాలుతగ్గాయి, రైతుల బావులు ఎండిపోయాయి. అప్పుడు అందరికీప్రకృతి విలువ తెలిసింది. కొండపోతే ఏమిపోతుంది? అనుకుంటే వర్షపు నీటి నిల్వ, భూగర్భ జలాల రీఛార్జ్, జీవ వైవిధ్యం, ఔషధ మొక్కలు, పక్షుల నివాసం,స్థానిక వాతావరణ సమతుల్యత, భవిష్యత్ తరాల హక్కు మొదలైనవి పోతుంది. మరోపక్క ప్రపంచ దేశాలు ఏం చేస్తున్నాయి? అని చుస్తే అభివృద్ధి చెందిన అనేక దేశాలు పెద్దఎత్తున తవ్వకాలపై కఠిన పర్యావరణ పరిశీలనలు,ప్రజాభిప్రాయ సేకరణ, పునరుద్ధరణ బాధ్యతలను అమలు చేస్తున్నాయి. అనుమతుల ఉల్లంఘనపై భారీ జరిమానాలు, లైసెన్స్‌రద్దు వంటిచర్యలు తీసుకుంటాయి.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగాతీసుకున్న స్పందన కార్యక్రమం ఈ అక్రమ తవ్వకాలు, రవాణా విషయంలో హాస్యాస్పదంగా మారింది. అంటే ప్రభుత్వంలోని పెద్దలు, అధికారుల తీరు ఏవిధంగా ఉందో తెలుస్తోంది. దోపిడీదారులకు సహజవనరులు ఆర్థిక వనరుగా మారిపోయింది. ఇక ప్రజలమైన మనం ఏమి చేయాలి? అని చూస్తే అక్రమ తవ్వకాలను వీడియోలు, ఫోటోలతోనమోదు చేయాలి. రెవెన్యూ, గనుల, అటవీ శాఖలకు ఫిర్యాదు చేయాలి. సమాచార హక్కు చట్టం ద్వారా అనుమతుల వివరాలు కోరాలి. గ్రామసభల్లో ఈ అంశాన్ని చర్చించాలి. అధికారులు చర్యలు తీసుకోకుంటే ప్రజలే నిరసనలు, పోరాటాల ద్వారా నిరసనలు తెలియజేయాలి. ఇక్కడ ప్రముఖంగా అధికారుల మధ్య, విభాగాల మధ్య సమన్వయం లేదు, మాకు సంబంధంలేదు అని వెకిలిగా, బాధ్యతారాహిత్యంగా బదులుంటుంది. దానికి ప్రధాన కారణం అధికారంలో ఉన్న బాధ్యతారాహిత్య రాజకీయ నాయకుల అండదండలు, సహకారం ప్రధానమైనది. ఇక ప్రభుత్వాలు డ్రోన్లతో పర్యవేక్షణ, భౌగోళిక సమాచారవ్యవస్థ మ్యాపింగ్, ఆన్లైన్ మైనింగ్ అనుమతులు, గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్తో ఖనిజ రవాణా పర్యవేక్షణ, అక్రమతవ్వకాలపై వేగవంతమైన ప్రత్యేకన్యాయస్థానాలు, అవినీతిపరులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. వివిధ విభాగాల్లో ఉన్నప్రభుత్వ అధికారులు సమన్వయంతో, కలసిపనిచేస్తే నిర్ణయాలు త్వరగా తీసుకునే అవకాశముంది. ప్రకృతి నాశనం నెమ్మదిగా జరుగుతుంది, కానీ దాని ప్రభావం కొన్నితరాలపాటు ఉంటుంది.కొండలు కూలిపోతే తిరిగి నిర్మించలేం, అడవులు నరికితే వెంటనే తిరిగి పెంచలేం, భూగర్భజలాలు తగ్గితే ఒకే ఏడాదిలో నింపలేం, ప్రకృతి సంపదను కాపాడటం అంటే దేశ భక్తిని ఆచరణలో చూపించడమే.చట్టాలను అమలుచేయడం ప్రభుత్వబాధ్యత, వాటిని పర్యవేక్షించడం ప్రజల బాధ్యత.ఈ రెండూ కలిసి నప్పుడే కొండలు, గుట్టలు, అడవులు భవిష్యత్ తరాలకు పదిలంగా ఉంటాయి, లేదంటే భవిష్యత్తులో మ్యూజియం లలో,ఫోటోలలో చూసుకోవలసిందే. ప్రధానంగాచూస్తే ఇక అవినీతి కుడితినీళ్ల తాగేఅక్రమార్కు లకు, అధికారులకు తెలియనిది

# అమరావతి వార్త

## మున్సిపల్ సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు పరిశీలన



**రేపల్లె, జూలై 19, ప్రభాతవార్త**
రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశాల మేరకు రేపల్లె పట్టణ ప్రజలకు తాగునీటిని వేగంగా సరఫరా చేసేందుకు నిర్మించిన నూతన పంప్ హౌస్‌ను ఆదివారం అనగాని శివప్రసాద్ పరిశీలించారు. నూతన పంప్ హౌస్‌లో మూడు 30 హెచ్‌పి మోటార్లను మున్సిపల్ శాఖ అధికారులు ఏర్పాటు చేశారు. అరవపల్లి కాల్వ నీటిని సమ్మర్ స్టోరేజ్ టా ంకులో నింపేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా అనగాని శివప్రసాద్ మాట్లాడుతూ పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు ఎస్‌ఎస్ ట్యాంక్‌లో నీటిని పూర్తిస్థాయిలో నింపాలని చెప్పారు. ప్రజలకు తాగునీరందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, రేపల్లె మున్సిపల్ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సైసస్స్ పార్కులో ఖాళీగా ఉన్న ప్రాంతాలలో నిండిపోయిన పిచ్చి కంప

- నిర్మానుష్యంగా తయారు అవుతున్న సుగంధ ద్రవ్యాల పార్క్
- నిర్మాణాలు చేపట్టని కంపెనీలు
- అడవిని తలపిస్తున్న ఖాళీ స్థలాలు
- అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్




**యడ్లపాడు, జూలై 19, ప్రభాతవార్త**
మండల పరిధిలోని వంకాయలపాడు గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న కేంద్ర ప్రభుత్వ రంగసంస్థ సుగంధ ద్రవ్యాల పార్కు పరిధిలోని భూమి ప్రస్తుతం నిరక్ష్యాన్లికి గురవుతున్నాయి. గతంలో పారిశ్రామిక అభివృద్ధి లక్ష్యంగా ఈ పార్కులో పలు ప్రముఖ కంపెనీలకు స్థలాలు కేటాయించారు. అయితే కేటాయించిన సంస్థల్లో కొద్ది కంపెనీలు మాత్రమే పరిశ్రమల నిర్మాణాలు పూర్తి చేసి కార్యకలాపాలు కొనసాగిస్తుండగా, మిగిలిన సంస్థలు ఇప్పటికీ నిర్మాణాలు చేపట్టకపోవడంతో విలువైన భూమి నిరుపయోగంగా మారింది. నిర్మాణాలు జరగని ప్లాట్లలో భారీగా పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు పెరిగి మొత్తం ప్రాంతం అడవిని తలపించేలా మారింది. నిర్వహణ లేకపోవడంతో ఖాళీ స్థలాల్లో చెత్త పేరుకుపోవడంతో పాటు పాములు, విషపురుగులు సంచరిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. రాత్రి వేళల్లో ఈ ప్రాంతానికి వెళ్లాలంటే ప్రజలు భయపడే పరిస్థితి నెలకొంది. స్థానికుల అభిప్రాయం ప్రకారం, పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని గతంలో ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, కేటాయించిన భూములను వినియోగించని సంస్థలపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శిస్తున్నారు. పరిశ్రమలు వస్తాయని ఆశించిన యువతకు ఉద్యోగాలు దక్కకపోవడంతో పాటు ప్రభుత్వ భూములు కూడా నిరుపయోగంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిశ్రమల నిర్మాణం చేపట్టని కంపెనీలకు పలుమార్లు నోటీసులు జారీ చేశారా లేదా అనే విషయంపై కూడా స్పష్టత లేదని స్థానికులు అంటున్నారు. నిబంధనల ప్రకారం నిర్ణీత గడువులోగా పరిశ్రమలు ఏర్పాటు చేయని సంస్థల నుంచి భూములను తిరిగి స్వాధీనం చేసుకుని కొత్త పెట్టుబడిదారులకు కేటాయించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. పార్కులో ప్రస్తుతం కార్యకలాపాలు నిర్వహిస్తున్న కంపెనీలకు కూడా పిచ్చి మొక్కల కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలుస్తోంది. అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశం ఉండటంతో పాటు పరిశ్రమల భద్రతకు కూడా ముప్పు ఏర్పడే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పార్కు పరిధిలో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించడం, ఖాళీ స్థలాలను శుభ్రం చేయించడం, నిర్మాణాలు చేపట్టని కంపెనీలపై చర్యలు తీసుకోవడం, పరిశ్రమల స్థాపన ప్రక్రియను వేగవంతం చేయాలని స్థానికులు కోరుతున్నారు. పారిశ్రామిక అభివృద్ధి లక్ష్యంగా ఏర్పాటైన సుగంధ ద్రవ్యాల పార్కు తన అసలు ఉద్దేశాన్ని నెరవేర్చేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## కొండవీడు కోటలో పర్యాటకుల సందడి




**యడ్లపాడు, జూలై 19, ప్రభాతవార్త**
మండల పరిధిలోని చారిత్రక ప్రాధాన్యం కలిగిన కొండవీడు కోట ప్రాంతం ఆదివారం పర్యాటకులతో కిక్కిరిసిపోయింది. సెలవు దినం కావడంతో గుంటూరుతో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. కొండవీడు కోట అందాలు, ప్రకృతి సోయగాలు, చారిత్రక నిర్మాణాలను తిలకిస్తూ పర్యాటకులు సందడి చేశారు. కొండపైకి చేరుకుని కోట పరిసరాలను వీక్షిస్తూ ఫోటోలు, సెల్ఫీలు దిగుతూ ఆహ్లాదకర క్షణాలను ఆస్వాదించారు. యువత, కుటుంబ సభ్యులు, చిన్నారులు అధిక సంఖ్యలో సందర్శించారు. రెడ్డి రాజుల వైభవానికి ప్రతీకగా నిలిచిన కొండవీడు కోటను సందర్శించేందుకు ప్రతి ఆదివారం పర్యాటకులు భారీగా వస్తుండగా, ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసి పర్యాటకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. కొండవీడు కోట చారిత్రక వారసత్వం, ప్రకృతి అందాల కారణంగా ప్రముఖ పర్యాటక కేంద్రంగా గుర్తింపు పొందుతోంది.

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

**విజయవాడ కార్పొరేషన్, జూలై 19, ప్రభాతవార్త**




ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఈ సోమవారం కూడా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంతో పాటు జోనల్ కార్యాలయంలో కూడా నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర తెలిపారు. నగరపాలక సంస్థకు సంబంధించిన సమస్యలన్నీ ప్రజలు తమ దగ్గర లోని కార్యాలయంలో సంప్రదించవచ్చని ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఫిర్యాదులను స్వీకరిస్తారని అధికారులందరూ జోనల్ కార్యాలయంతో పాటు ప్రధాన కార్యాలయంలో కూడ అందుబాటులో ఉంటారని, కావున ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## భట్టిప్రోలులో 500 మందికి వైద్య పరీక్షలు



**రేపల్లె, జూలై 19, ప్రభాతవార్త**
వేమూరు నియోజకవర్గంలోని భట్టి ప్రోలు తమ్మన మల్లికార్జునరావు ఉన్నత పాఠశాలలో ఆదివారం భట్టి ప్రోలు ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర ్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 500 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇసిజి, ఎకో, బిపి, ఆర్‌బిఎస్, పిఎఫ్‌టి వంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. డాక్టర్లు వివేక్‌రెడ్డి, అతీష్‌భాగ్య, డిపిఎల్. సాయికుమార్, స్నేహశుభా తదితరులు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా, డాక్టర్ ఎ.శ్రీనివాసరావు, డాక్టర్ ద్వారకానాథ్, జె.ధర్మారావు, ఎం.పి.వెంట్రావు, బి.కిరణ్‌కుమార్, భారతుల ధర్మారావు, వంగర బాబూజీ, వి.మహేష్, టి.ఈశ్వరబాబు, సిహెచ్.ఉమామహేశ్వరరావు, కె.శ్రీనాథ్, డి.ఆదినారాయణ, జి.భాస్కర్, చతుర్వేది, వి.ప్రసాద్, బి.శ్రీనివాసరావు, శివం రామప్రసాద్, చందులూరి రామకోటేశ్వరరావు, కె.రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

## అద్దెబస్సు డ్రైవర్ల ఆందోళన విరమణ




**రేపల్లె, జూలై 19, ప్రభాతవార్త**
ఐదు రోజులుగా సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేస్తున్న అద్దెబస్సు డ్రైవర్లు ఆదివారం విధులలో చేరారు. చీరాలలో 45 అద్దెబస్సులు ఉండటంతో చీరాల ఆర్డీవో, పోలీస్ అధికారుల సమక్షంలో అద్దె బస్సుల యజమానులు, సిఐటియు నాయకులు జరిపిన చర్చలలో జీతాలను పెంచేందుకు అంగీకారం కుదిరినందున ఆందోళన కార్యక్రమాలను విరమించారు. ఒటి బస్సుపై ఒక రోజు డ్యూటీ వేతనం రూ.1100 నుండి రూ.1200, నైట్ అవుట్ బస్‌పై డ్యూటీ వేతనం రూ.1200 నుండి రూ.1300కు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ప్రతి బస్ మీద ఇరువురు డ్రైవర్లు ఉండేలా, పిఎఫ్, ఇఎస్ఐ, బోనస్ అమలు చేయడానికి అంగీకారం కుదిరింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి సిహెచ్.మణిలాల్, మదర్ థెరిస్సా అద్దె బస్సుల డ్రైవర్ల యూనియన్ అధ్యక్షుడు జి.వెంకటేశ్వరరావు, కె.గోపి, జి.రవిబాబు, ఇమ్రాన్, భాస్కర్, రవి, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటిన రోటరీ క్లబ్



**రేపల్లె, జూలై 19, ప్రభాతవార్త**
పట్టణంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల ప్రాంగణంలో ఆదివారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మామిడి, నిమ్మ, ఉసిరి, ములగ మొక్కలను నాటారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ఫలాలు లభిస్తాయని రోటరీ క్లబ్ జిల్లా ఛైర్మన్ ఎం.ఎం.సక్సేనా చెప్పారు. ఈ కార్యక్రమంలో రోటరీ సభ్యులు పి.శివశంకరప్రసాద్, జి.బాపారావు, సిహెచ్.కిషోర్, వై.బుచ్చిరావు, నాగలీల, సోమేశ్వరరావు, రాఘవేంద్రరావు, పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## సోషల్ వెల్ఫేర్ హాస్టల్ హెచ్‌డబ్ల్యువోగా గోవర్ధన్ నియామకం

**ఎ కొండూరు, జులై 19, ప్రభాతవార్త :**



ఎన్‌టిఆర్ జిల్లా ఎ కొండూరు మండలం కంభంపాడు సోషల్ వెల్ఫేర్ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ (హెచ్‌డబ్ల్యువో)గా ఎ.గోవర్ధన్ నియమితులయ్యారు. కృష్ణాజిల్లా మోపిదేవి నుండి గోవర్ధన్ బదిలీపై ఎన్‌టిఆర్ జిల్లా కంభంపాడు వసతి గృహానికి విచేసి హెచ్‌డబ్ల్యువో గంపలగూడెం మండలం మల్లయ్య నుండి ఛార్జ్ తీసుకున్నారు. వసతి గృహంలో చదువుకునే పేద విద్యార్థులకు మెనూ ప్రకారం టిఫిన్ భోజనం నాణ్యమైన వాటిని అందించే విధంగా కృషి చేస్తానని హెచ్‌డబ్ల్యువో గోవర్ధన్ తెలిపారు.

## 21న విద్యుత్ అదాలత్

**రేపల్లె, జూలై 19, ప్రభాతవార్త**
పట్టణంలోని బి.వి.శేషగిరిరావు మినీ ఫంక్షన్ హాలులో ఈ నెల 21వ తేదీ ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు రేపల్లె విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.భాస్కరరావు ఆదివారం తెలిపారు. విద్యుత్ అదాలత్‌లో సిజిఆర్‌ఎఫ్ ఛైర్మన్ ఎన్.విక్టర్ ఇమ్మానుయేలు, విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు పాల్గొంటారని ఆయన చెప్పారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని భాస్కరరావు కోరారు.

## పోలేరమ్మ- పోతురాజు స్వామివార్లకు ప్రత్యేక పూజలు



**ఎడ్లపాడు, జూలై 19, ప్రభాతవార్త**
మండల పరిధిలోని వంకాయలపాడు గ్రామంలో వెలసిన శ్రీ పోలేరమ్మ-పోతురాజు స్వామివార్లకు ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గత జూన్ నెలలో అమ్మవార్లకు కొలుపులు నిర్వహించిన సందర్భంగా నెల పూర్తయిన సందర్భంగా ఈ ప్రత్యేక పూజలు చేపట్టారు. ఉదయం నుంచే ఆలయానికి చేరుకున్న భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తిపూర్వక వాతావరణం నెలకొంది. గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పూజా కార్యక్రమాల నిర్వహణను పర్యవేక్షించగా, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. కార్యక్రమం అనంతరం భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ చేశారు.

## సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ ప్రాణాలు కాపాడేందుకు అన్ని వైపుల నుండి ప్రయత్నాలు జరగాలి

**గుంటూరు కల్చరల్, జూలై 19, ప్రభాతవార్త**
సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ జూన్ 28నుంచి ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరవధిక నిరాహార దీక్షలో ఉన్నారని బరువుతగ్గారు, బలహీనంగా ఉన్నారు. ఆరోగ్యం ఆందోళనకరంగా ఉందని డాక్టర్లు ప్రకటిస్తున్నారని అయినా ప్రభుత్వం పట్టనట్లుగా వ్యవహరిస్తుందని అవగాహన సంస్థ విమర్శిస్తుంది. నీట్ పరీక్షలో ప్రశ్నాపత్రం లీక్ అయింది, పరీక్ష నిర్వహణలో అవకతవకలు జరిగాయని ఇది విద్యార్థుల్లో తీవ్ర ఆందోళనకు కారణమయిందని ఇందుకు బాధ్యత వహించి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంధ ప్రధాన్ రాజీనామా చేయాలని జరుగుతున్న ఆందోళనకు సంఘీభావంగా సోనమ్ వాంగ్‌చుక్ ఈ ఆందోళన చేస్తున్నారని ఈ నిరాహారదీక్షకు దేశవ్యాప్తంగా ప్రజలు, విద్యార్థులు మద్దతు తెలియజేస్తున్నారని అవగాహన సంస్థ ప్రకటిస్తుంది. వాంగ్‌చుక్ పర్యావరణ కార్యకర్త, విద్యా సంస్కర్త, హిమాలయ ప్రాంతానికి అనువైన "ఐస్ స్థూప" అనే కృత్రిమ మంచు నిల్వవ్యవస్థను అభివృద్ధి చేసి అంతర్జాతీయ గుర్తింపును పొందారని అవగాహన సంస్థ ప్రకటిస్తుంది. 2018లో తన విశేష కృషికి రామన్ మెగసెసె అవార్డు ను అందుకున్నారని అలాంటి గొప్పవ్యక్తి ప్రాణాలు కాపాడేందుకు అన్ని రంగాల ప్రముఖులు, ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రయత్నం చేయాలని అవగాహన సంస్థ విజ్ఞప్తి చేస్తుంది.

## మూత్ర పిండాల వ్యాధులతో జీవితం దుర్భరం




**గుంటూరు కల్చరల్, జూలై 19, ప్రభాతవార్త**
స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆరోగ్యసభ జరిగింది. సభలో ప్రముఖ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ శ్రీనివాస్ మర్రెడ్డి ప్రధానవక్తగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన శరీరంలో అతి ముఖ్యమైన పాత్రను మూత్రపిండాలు పోషిస్తుంటాయన్నారు. మన శరీరంలో మూత్రపండాలకు సంబంధించిన నిర్మాణం గనుక పరిశీలిస్తే 8 నుంచి 9 సెంటీమీటర్ల పరిమాణంలో రెండె మూత్రపిండాలు ఉంటాయని దానికి కొనసాగింపుగా మూత్ర నాళాలు తర్వాత మూత్రాశయం, యూరెత్రా ఉంటుందన్నారు. తొలిదశలో సమస్యను గుర్తిస్తే మూత్రపిండాల వ్యాధులు నయం చేసుకోవడానికి ఎక్కువగా అవకాశాలు ఉన్నాయన్నారు. మూత్రపిండాలు రోజుకు దాదాపు 180నుంచి 200లీటర్ల రక్తాన్ని శుద్ధిచేస్తాయన్నారు. సాధారణంగా మూత్రపిండాల సమస్యకు గురి అయితే రక్తపోటులో అసమతుల్యత, ఆకలి తగ్గటం, ఆయాసం, యూరిన్లో నురగరావడం లాంటి లక్షణాలు కనబడితే వెంటనే నెఫ్రాలజిస్టును సంప్రదించాలన్నారు. సమావేశంలో మూత్రపిండాల సమస్యలపై అవగాహన సంస్థ సభ్యులు లేవనెత్తిన సందేహాలను డాక్టర్ మర్రెడ్డి శ్రీనివాస్ నివృత్తి చేశారు. అనంతరం సంస్థ సభ్యులు డాక్టర్ మర్రెడ్డిని దుశ్శాలువా, పుష్పగుచ్ఛంతో ఘనంగా సత్కరించారు. ఆరోగ్యసభకు టివి సాయిరామ్ కోఆర్డినేటర్‌గా వ్యవహరించగా, విశ్రాంత బిఎస్ఎన్ఎల్ అధికారి కె.వి.కృష్ణారావు, విశ్రాంత అధ్యాపకులు ఏ.వి.రామారావులు పాల్గొని ప్రసంగించారు.




## పురస్కారాలకు ఎంపికైన గంపలగూడెం విద్యార్థులు



**గంపలగూడెం, జులై 19, ప్రభాతవార్త**
గడిచిన పదవ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించి, ప్రతిభను కనబరిచిన విద్యార్థిని, విద్యార్థులు ఐదుగురు స్టార్ ప్రతిభ పురస్కారాలకు ఎంపికైనట్లు ఎంఈఓ పివిడిఎల్ నరసింహారావు తెలిపారు. కనుమూరు జడ్పీహెచ్ఎస్ నుండి ప్రజాపత్ లక్ష్మణ్, స్థానిక లిటిల్ ఏంజిల్స్ పబ్లిక్ స్కూల్ నుండి కోమండూరి అను శ్రావణి, చింతల జూహిత, తోట మూల గీతాంజలి నుండి కొత్తూరు వెంకట్, శ్రీ గాయత్రి ఇంగ్లీష్ మీడియం స్కూల్ నుండి కోట స్నేహిత'లు పురస్కారాలు సోమవారం విజయవాడలో అందుకోనున్నారు.

## గోదావరి కృష్ణా కోఆపరేటివ్ సొసైటి లిమిటెడ్‌ల సేవలు సద్వినియోగం చేసుకోండి.. బ్యాంక్ చైర్మన్ మేడూరి జీవన్ వెల్లడి



**ఎ కొండూరు, జులై 19, ప్రభాతవార్త**
ఎన్‌టిఆర్ జిల్లా మైలవరం టౌన్‌లో జమిందార్ రాజా ఎస్‌వి సుధాకరరావు జమిందార్ కాంప్లెక్స్‌లో జమిందార్ ఆశీస్సులతో గోదావరి కృష్ణా కో ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆదివారం చైర్మన్ మేడూరి జీవన్ నూతనంగా నిర్మించిన మైలవరం బ్రాంచ్ శాఖను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మేడూరి జీవన్ మాట్లాడుతూ ఈ గోదావరి కృష్ణా కో ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ బ్యాంక్‌ల ద్వారా రైతులకు వ్యాపారులకు బంగారం తాకట్టు గృహ నిర్మాణ రుణాలు మహిళ గ్రూపులకు ఉద్యోగులకు అతి తక్కువ వడ్డీ రేట్లకు రుణాలు అందించనున్నట్లు వీటిని ప్రజలు రైతులు మహిళలు వ్యాపారులు వివిధ వర్గాల ఉద్యోగులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఛైర్మన్ ఎం.జీవన్ కోరారు ఈ బ్యాంక్ ద్వారా తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి బ్యాంక్ ద్వారా ఋణాలు పొంది బ్యాంక్ అభివృద్ధికి కృషి చేయాలని చైర్మన్ ఎం జీవన్ కోరారు. లక్షమంది లబ్ధిదారులు రుణాలు అందించాలనే లక్ష్యంతో ఉన్నామని రూ.50వేల నుండి రూ.2లక్షల వరకు రుణాలు అందిస్తామని నెలవారి ఆదాయ పథకం ద్వారా లక్ష డిపాజిట్‌పై ప్రతినెలా రూ.వెయ్యి వడ్డీ పొందే అవకాశం కల్పించామని ఛైర్మన్ మేడూరి జీవన్ తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో మైలవరం బ్రాంచ్ మేనేజర్ పి.అభిరామ్ సిబ్బంది, డిపాజిటర్లు, మెంబర్లు, శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.

20-7Pg8_20-7Pg8.qxd 20/Jul/26 1:20 AM Page 1





పీర్జాదిగూడ చెరువులో విగ్రహం కోసం గాలిస్తున్న డిఆర్ఎఫ్ బృందాలు

## మిస్టరీగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని మృతి కేసు

**ఉప్పల్, జూలై 19 ప్రభాతవార్త:** నగర శివారులో కలకలం రేపిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ తేజస్విని మృతి కేసు దర్యాప్తులో అత్యంత విభ్రాంతిని, ఊహించని మలుపులు వెలుగులోకి వస్తున్నాయి. చెరువులో దూకి ప్రాణాలు కోల్పోయిందని తేలింది.. చనిపోయే ముందు ఒక గుడిలోని అమ్మవారి విగ్రహాన్ని తనతో పాటు తీసుకెళ్లినట్లు తేలడంతో పోలీసులు ఇప్పుడు ఆ విగ్రహం కోసం గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసుల కథనం ప్రకారం తేజస్విని శుక్రవారం తెల్లవారు జామున తన దుస్తులు విప్పేసి, దిగంబరంగా సమీపంలోని ఒక గుడిలోకి ప్రవేశించింది. అక్కడ ఉన్న అమ్మవారి విగ్రహాన్ని చేతుల్లోకి తీసుకుని నేరుగా సమీపంలోని చెరువు వైపు నడిచి, నీటిలోకి దూకింది. ఆ తర్వాత ఆమె మృతదేహం లభ్యం కాగా, ఆమె తీసుకెళ్లిన విగ్రహం మాత్రం ఇంకా దొరకలేదు. ఈ కేసులో ఆ విగ్రహం కీలక ఆధారంగా మారే అవకాశం ఉండటంతో, డీఆర్ఎఫ్ సిబ్బంది బోట్ల సహాయంతో చెరువులో విగ్రహం కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. ఈ దర్యాప్తులో తేజస్విని ఉంటున్న నివాసానికి సంబంధించిన కొన్ని షాకింగ్ విషయాలు బయటపడ్డాయి. ఆమె ఒక అద్దె ఫ్లాట్‌లో ఉంటున్నప్పటికీ, దానికి రోజుకు రూ.3,500 చొప్పున నెలకు దాదాపు రూ.లక్ష వరకు అద్దె చెల్లిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. అంతేకాకుండా, ఆమె ఉంటున్న భవనంలోని పై అంతస్తులను అక్రమంగా ఒక లాడ్జిలా నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. దీనికి తేజస్విని మృతికి ఏమైనా సంబంధం ఉందా అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. పోలీసులు తేజస్విని తల్లి అరుణను ప్రశ్నించడంతో పాటు, ఆమె రాసినట్లుగా భావిస్తున్న డెత్ డిక్లరేషన్, ఐటీ ఆర్థిక లావాదేవీలు, సీసీటీవీ ఫుటేజీలను నిశితంగా పరిశీలిస్తున్నారు. యువతి మానసిక పరిస్థితి సైతం జల ధరించి పేర్కొంటున్నారు. మేడిపల్లి పోలీసులు విచారణ చేస్తున్నారు.



ఆదివారం హైదరాబాద్‌లో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న విద్యార్థులు

## తరలిపోతున్న విజ్ఞానాన్ని కాపాడుకుందాం: పలువురు వక్తలు

**ధర్నాచౌక్, జూలై 19, ప్రభాతవార్త:** భారతదేశంలో సరైన అవకాశాలు లేక, విదేశాలకు తరలి పోతున్న మన విజ్ఞానాన్ని కాపాడు కుందామని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ఆదివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో విద్యావ్యవస్థలో పెరిగిపోతున్న అవినీతికి వ్యతిరేకంగా జంతర్ మంతర్ వద్ద చేపట్టిన ఛలో పార్లమెంట్ మార్చ్ పిలుపుకు మద్దతుగా దిశ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ కాశిం, దిశ విద్యార్థి సంఘం సభ్యులు హారిక, శ్రీజ, తెన్నెట్టి పల్లి వసంత్, రోహిత్‌తో పాటు వందలాది మంది విద్యార్థులు పాల్గొని పేపర్ లీకేజీ వ్యతిరేకించి నినాదాలు ఇచ్చారు. ఈ సందర్భంగా దిశ విద్యార్థి సంఘం నేతలు మాట్లాడుతూ సంవత్సరాలు తరబడి కష్టపడి చదివి, పరీక్ష రాసే విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకం మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యను ఒక సరుకుగా మార్చి, లాభాల కోసం ఎంతకైనా తెగించే ఈ వ్యవస్థ కారణంగా 40 మందికి పైగా ఆత్మహత్యలు చేసుకున్నారని ఆరోపించారు. ప్రొఫెసర్ కాశిం మాట్లాడుతూ ఈ దేశ యువతే నిజమైన దేశ భక్తులని, సంక్షోభంలో ఉన్న మన రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని అన్నారు. గాంధేయ మార్గంలో పోరాటం మొదలు పెట్టిన సోనంతో ప్రభుత్వం చర్చలు జరపకుండా బ్రిటీష్ వారికంటే నిరంకుశంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. దిశ సభ్యురాలు శ్రీజ మాట్లాడుతూ బీజేపీ పాలనలో పేపర్ లీకులు పరిపాటి అయ్యాయని, వీటిని ప్రశ్నిస్తే దేశద్రోహులు అంటున్నారని మండిపడ్డారు.

### కోనసీమలో విషాదం..

## కాలువలోకి దూకి తల్లి, కూతురు ఆత్మహత్యాయత్నం

### సముద్రంలో దిగి ముగ్గురు యువకులు గల్లంతు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,జూలై 19,ప్రభాతవార్త:** డా.బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఆదివారం గంగమ్మ వడిలో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా ఇరువురు గల్లంతు అయ్యారు. ఆదివారం ఈ విషాదం లో రెండు వేర్వేరు సంఘటన లలో చోటుచేసుకున్నాయి. రావులపాలెం వద్ద పెద్ద కాలువలోకి దూకి తల్లి, కూతురు ఆత్మహత్య చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు ప్రకారం ఆలమూరు మండలం చొప్పెల్ల గ్రామానికి చెందిన వాడపల్లి బూరమ్మ (80), ఆమె కుమార్తె మీసాల సూర్యవతి (60) పంట కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఊబలంక సాయిబాబా ఆలయం సమీపంలోని పంట కాలువలో వీరు దూకినట్లు పోలీసులు తెలిపారు. సూర్యవతి మృతదేహం లభించగా, బూరమ్మ మృతదేహం కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. కొంతకాలం క్రితం కుమారుడు మృతి చెందడంతో బూరమ్మ కుమార్తె సూర్యవతి వద్ద ఉంటున్నట్లు తెలిసింది. సూర్యవతికి భర్తతో పాటు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.బూరమ్మ చెవిటి, మూగ కావడంతో పాటు కుమార్తె సూర్యవతి కూడా కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతు న్నట్లు సమాచారం. తమను చూసుకునే వారు లేరనే ఆందోళన, భవిష్యత్తుపై భయంతోనే ఈ ఘాతుకానికి పాల్పడినట్లు స్థానికులు భావిస్తున్నారు. సమాచారం అందుకున్న రావులపాలెం పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై చంటి తెలిపారు.

**విహారంలో విషాదం:** ఆషాడమాసం విహారయాత్ర ఆ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. అంబాజీపేట మండలం మాచవరం,కొర్లపాటివారిపాలెం ల కు చెందిన ఒకే కుటుంబానికి చెందిన 9 మంది ఆదివారం మధ్యాహ్నం ఓడలరేవు బీచ్ కు వెళ్లారు.సముద్రంలో స్నానానికి దిగిన ఐదుగురు యువకుల్లో ముగ్గురు యువకులు మంచాల షణ్ముఖ్ (17), మంచాల సాయి(22), సుధా అరవింద్ వీరవెంకట సాయికుమార్ (28) అలల తాకిడికి సముద్రంలోకి కొట్టుకుపోగా ఇద్దరు యువకులు క్షేమంగా ఒడ్డుకు చేరుకున్నారు. అరవింద్, షణ్ముఖ్ మృతదేహాలులభ్యం కాగా సాయి మృతదేహం కోసం గాలిస్తున్నారు. సాయి, షణ్ముఖ్‌లు అన్నదమ్ముల కుమారులు. కాగా అరవింద్ వరుసకు మేనల్లుడు.

## మహేశ్ కుమార్‌గౌడ్‌కు ఈశ్వరమ్మ యాదవ్ లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జులై19:** టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌కు యాదగిరిగుట్ట బోర్డు మెంబర్ ఈశ్వరమ్మ యాదవ్ లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. 24పేజీలతో ఈ లేఖ రాశారు. యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివ చరణ్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరారు. జక్కిడి శివ చరణ్ రెడ్డి, జక్కిడి ప్రభాకర్ రెడ్డిలపై చర్యలు తీసుకోకపోవడంతో తనపై బీసీ సంఘాల నుంచి ఒత్తిడి వస్తోందని లేఖలో పేర్కొన్నారు. జక్కిడి శివ చరణ్ రెడ్డిపై చర్యలు తీసుకోకుండా ఆయనకు గన్‌మెన్‌ను కేటాయించారని ఈశ్వరమ్మ యాదవ్ తెలిపారు. బాధితులమైన తమకు రక్షణ కల్పించాల్సింది పోయి అతనికి గన్‌మెన్‌ను కేటాయిస్తారా? అని ప్రశ్నించారు. ఈ విషయంపై బీసీసంఘాలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నాయని చెప్పుకొచ్చారు. గతంలో క్రమ శిక్షణఉల్లంఘించిన సర్వే సత్యనారాయణ, తీన్మార్ మల్లన్న, భార్గవ్ దేశ్ పాండే, యూత్ కాంగ్రెస్ లీడర్ రాఘవేంద్ర గౌడ్‌లను సస్పెండ్ చేశారని ప్రస్తావించారు. తక్షణమే జక్కిడి శివచరణ్ రెడ్డి, జక్కిడి ప్రభాకర్ రెడ్డిలపై చర్యలు తీసుకోవాలని ఈశ్వరమ్మ యాదవ్ డిమాండ్ చేశారు.

# యూరియాకు ఆంక్షల కష్టాలు




### ఎకరానికి 4 కట్టలు అవసరమైనా రెంటికే కటాఫ్
### ఐదు ఎకరాలు పైబడితే మూడు విడతల బుకింగ్
### విడత విడతకు మధ్య 20 రోజులు పెరిగిన గ్యాప్
### పాస్ బుక్ లేకుంటే నో యూరియా
### సాంకేతిక సమస్యలతో రైతుల అగచాట్లు

**హైదరాబాద్, జులై 19, ప్రభాతవార్త:** తెలంగాణలో యూరియా నిబంధనలు రోజురోజుకు క్లిష్టతరంగా మారుతున్నాయి. యూరియా బుకింగ్ నిబంధనల్లో మార్పులు రైతుల పాలిట శాపంగా పరిణమిస్తోంది. వ్యవసాయానికి అవసరమైన యూరియా సరఫరా, పంపిణీకి ప్రభుత్వం ప్రత్యేక నిబంధనలు అమలు చేస్తోంది. రైతులు బ్లాక్ మార్కెట్ ఇబ్బందులు పడకుండా, పారదర్శకంగా ఎరువులు అందేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇక యూరియా పంపిణీలో అనేక సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. తరచూ సర్వర్ డౌన్ కావడం ఒకటైతే, ఏజెన్సీ ప్రాంతాల్లో ఫోన్ నెట్‌వర్క్ సమస్య కారణంగా రైతులు సకాలంలో బుకింగ్స్ చేసుకోలేకపోతున్నారు. ప్రస్తుతం కాంప్లెక్స్ ఎరువుల ధరలు పెరిగిన నేపథ్యంలో యూరియా వైపు రైతులు మొగ్గుచూపుతున్నారు. తాజాగా డీఏపీ లభ్యత కూడా లేకపోవటంతో రైతులు యూరియాపై ఆధారపడుతున్నారు. ఎకరానికి నాలుగు కట్టల యూరియా అయితే సంపూర్ణంగా సరిపోతుంది. కానీ రెండు కట్టలు మాత్రమే ఇస్తుండటంపై రైతాంగం అసంతృప్తితో ఉంది. రబీలో ఎకరానికి మూడు కట్టల చొప్పున పంపిణీ చేయగా, ప్రస్తుత ఖరీఫ్ నాటికి దానిని రెండింటికి వ్యవసాయ శాఖ అధికారులు కుదించారు. వాస్తవానికి ఎకరానికి నాలుగు కట్టలు అవసరం అవుతుండగా, రెండింటికి తగ్గించడంతో రైతాంగం ఇబ్బంది పడుతోంది. ఇక గతంలో 15 రోజులకు ఓ విడత చొప్పున ఇచ్చిన యూరియా బస్తాలను ఇప్పుడు 20 రోజులకు పెంచడంపై రైతాంగం కష్టాలను ఎదుర్కోవాల్సిన పరిస్థితి తప్పడం లేదు. రాష్ట్ర యాప్‌లో యూరియా బుకింగ్‌కు సంబంధించి దశలవారీ అర్హత పరిమితుల్లో మార్పు చేశారు. 2 ఎకరాల వరకూ ఒకేసారి పూర్తి పరిమాణం బుక్ చేసుకోవచ్చు. గతంలో రెండు కట్టలు ఒకసారి, రెండు కట్టలు మరోసారి బుక్ చేసుకోవాల్సి ఉండేది. ఇప్పుడు ఒకే విడతలో నాలుగు కట్టలను బుక్ చేసుకోవచ్చు. 2 ఎకరాల నుంచి 5 ఎకరాల వరకు రెండవ విడతలో బుకింగ్ చేసుకోవాలి. గతంలో విడతకు విడతకు మధ్య 15 రోజుల వ్యవధి ఉండేది. కానీ ఇప్పుడు గడువును 20 రోజులకు పెంచారు. 5 ఎకరాలకు పైబడితే మూడు విడతలలో బుకింగ్ చేసుకోవచ్చు (40:30:30) నిష్పత్తిలో చేసుకోవాల్సి ఉంటుంది. గతంలో 8 ఎకరాలకు పైబడితే అత్యధికంగా నాలుగు విడతల్లో బుకింగ్ చేసు కోవాల్సి వచ్చేది. ఇప్పుడు మూడు విడతల్లో చేసుకునే వీలు కల్పించింది. మరోపక్క పాస్‌బుక్ ఉంటేనే యూరియా ఇస్తామనే కండిషన్ నేపథ్యంలో పట్టాలు లేని రైతులకు యూరియా కొనుగోలు చేసేందుకు ఇబ్బందికర పరిస్థితి ఎదుర్కోవాల్సి వస్తోంది. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంత గిరిజనేతర రైతుల పరిస్థితి వర్ణనాతీతంగా ఉంది. వీరితో పాటు హక్కు పత్రాలు లేని పోడు రైతులు, పాస్ పుస్తకాలు లేని సీలింగ్, మాన్యం, ఇతరత్ర భూములు సాగు చేసే రైతులు యూరియా బస్తాల కోసం అగచాట్లు ఎదుర్కోవాల్సి వస్తోంది.అందుకే నాన్ డిజిటల్ సిగ్నేచర్ (ఎన్డీఎస్) రైతులను గుర్తించి యూరియా బస్తాలు ఇవ్వాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. మాన్యం భూములను సాగు చేసే రైతులను కౌలుదారులుగా గుర్తించి ఇవ్వాలనే డిమాండ్లు కూడా వినిపిస్తున్నాయి. అయితే యూరియా అవసరం లేని సుబాబుల్, జామాయిల్, ఇతర పంటలు సాగుచేసిన రైతులకు మాత్రం పంపిణీ చేస్తున్నట్లువిమర్శలు చోటు చేసుకుంటున్నాయి.

# తెలంగాణలో పెరిగిన వర్షాభావ పరిస్థితి

### 30 జిల్లాలకు చేరిన లోటు
### భారీ లోటు కేటగిరిలో హనమకొండ, మల్కాజిగిరి
### 9.46 మీటర్ల మట్టానికి పడిపోయిన జలాలు

**హైదరాబాద్, జులై 19, ప్రభాతవార్త:** జూలై నెల దాదాపు సగం గడిచినా, తెలంగాణ బలహీనమైన నైరుతి రుతుపవనాలతో సతమతమవుతూనే ఉంది. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 30 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదు కాగా, మరో రెండు జిల్లాలు భారీ లోటు కేటగిరీలోకి జారిపోయాయి. తాజా వర్షపాత గణాంకాల ప్రకారం, ఈ రుతుపవన కాలంలో రాష్ట్రంలో ఇప్పటివరకు మొత్తం వర్షపాతం 35 శాతం తక్కువగా నమోదైంది. గత కొన్ని వారాలుగా మహారాష్ట్ర, కర్ణాటక వంటి పొరుగు రాష్ట్రాల్లో పదేపదే భారీ వర్షాలు కురుస్తుండగా, తెలంగాణలో మాత్రం అక్కడక్కడా చెదురుమదురు జల్లులు మినహా మిగతా రాష్ట్రాలన్నీ చాలా వరకు పొడిగానే ఉన్నాయి. అత్యంత తీవ్రంగా ప్రభావితమైన జిల్లాలలో హనుమకొండ, మేడ్చల్‌మల్కాజిగిరి ఉన్నాయి. ఇక్కడ వరుసగా 68, 60 వర్షపాత లోటు నమోదైంది. ఈ కాలంలో సాధారణంగా కురవాల్సిన సుమారు 272 మి.మీ వర్షపాతానికి బదులుగా, ఈ రెండు జిల్లాల్లో కేవలం 86 మి.మీ వర్షపాతం మాత్రమే కురిసింది. భారత వాతావరణ శాఖ (ఐఎమ్‌డి) ప్రకారం, రాష్ట్రం ప్రస్తుతం వర్షచ్ఛాయ వాతావరణంలోఉంది. ఇక్కడ రుతుపవన గాలులు వీస్తున్నప్పటికీ, విస్తృత వర్షపాతాన్ని ప్రేరేపించడానికి అవసరమైన వాతావరణ వ్యవస్థలు లేవు.నైరుతి రుతుపవనాల రాక వెంటనే వర్షాలు కురవడానికి దారితీయదని ఐఎండి హైదరాబాద్ సీనియర్ వాతావరణ శాస్త్రవేత్త జి.ఎన్. రావు శ్రీనివాస్ వివరించారు.ప్రస్తుత వాతావరణ సరళి కారణంగా తెలంగాణ వర్షచ్ఛాయా ప్రాంతంగా మారిందన్నారు. మహారాష్ట్ర, కర్ణాటక వంటి పొరుగు రాష్ట్రాల్లో ఇదే కాలంలో 60 నుంచి 80 సెం.మీ. వర్షపాతం నమోదు కాగా, తెలంగాణలో కేవలం 6 నుంచి 7 సెం.మీ. మాత్రమే నమోదైంది. వర్షాలు లేకపోవడం వల్ల రాష్ట్రవ్యాప్తంగా పగటిఉష్ణోగ్రతలు కూడా పెరిగాయి. మేఘాలు తగ్గడం వల్ల అనేక జిల్లాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు సుమారు 38 డిగ్రీల వరకు పెరిగాయి, ఇది సంవత్సరంలో ఈ సమయానికి సాధారణం కంటే దాదాపు 6 డిగ్రీలు ఎక్కువ. అధిక ఉష్ణోగ్రతలు మరియు వాతావరణంలో పెరిగిన తేమకలయిక వేడి, ఉక్కపోతతో కూడిన పరిస్థితులకు కూడా దారితీసిందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. మరోపక్క తగినంత వర్షపాతం లేకపోవడం, నీటి కొరతతో పాటు, భూగర్భ జలమట్టాలు సాధారణ స్థాయి కంటే దిగువకుపడిపోతున్నాయి. జూన్ 2026 నెలలో రాష్ట్రంలో సగటు భూగర్భ జలమట్టం భూ ఉపరితలానికి 9.46 మీటర్ల భూమి మట్టానికి దిగువన (ఎమ్ బిజిఎల్) ఉంది. ఇది ఖమ్మంలో 5.46 (ఎమ్‌బిజిఎల్ నుండి మెదక్, వికారాబాద్‌లలో 13.30 ఎమ్ బిజిఎల్ ఉంది. రాష్ట్రంలోని 33 జిల్లాలలో, 20 జిల్లాలలో సగటు భూగర్భ జలమట్టాలు 5 నుండి 10 ఎమ్ బిజిఎల్ మధ్య నమోదు కాగా, మిగిలిన 13 జిల్లాలలో 10 నుండి 15 ఎమ్ బిజిఎల్ మధ్య నమోదయ్యాయి. జూలై 14 వరకు కురిసిన వర్షపాతం ఆధారంగా మొత్తం వర్షపాతం 30 శాతం తక్కువగా ఉంటుందని భావిస్తే, రాష్ట్ర సగటు భూగర్భ జలమట్టం జూలైలో 10.35 మీటర్లకు, ఆగస్టు 2026లో మరింతగా 11.01 మీటర్లకుపడిపోతుందని అంచనా. మే 2026తో పోలిస్తే, జూలైలో సగటు భూగర్భ జలమట్టం 1.09 మీటర్లు, ఆగస్టులో 1.74 మీటర్లు తగ్గుతుందని అంచనా. వర్షపాతం తక్కువగా ఉండటం, భూగర్భ జలమట్టాలు పడిపోవడంతో, బోర్‌వెల్స్ ద్వారా పంటలు పండించాలని ఆశించే రైతులకు పెద్దగా ఉపశమనం లభించే అవకాశం లేదు.

# భద్రాద్రి అభివృద్ధికి మంత్రి పొంగులేటి డెడ్‌లైన్

### పుష్కరాలకు 15 రోజుల ముందే అన్ని పనులు పూర్తి చేయాలి



**భద్రాచలం, ప్రభాతవార్త:** గోదావరి పుష్కరాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం భద్రాద్రి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార-పౌర సంబంధాలశాఖ మంత్రి పొం గులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం భద్రాచలం, సారపాకలో నిర్వహించిన వరుస కార్యక్రమాల్లో ఆలయ పునరుద్ధరణ, పుష్కరాల ఏర్పాట్లు, భూముల రీసర్వే, అటవీ-రెవెన్యూ సమస్యలు, శ్రీనివాసగుట్ట అభివృద్ధి తదితర అంశాలపై అధికారులకు గడువులతో కూడిన స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. భద్రాచలం ఆలయ దర్శనంతో ప్రారంభమైన మంత్రి పర్యటన జిల్లా అభివృద్ధి అంశాలపై సుదీర్ఘ సమీక్షలతో ముగిసింది.మంత్రి తొలుత భద్రాచలం శ్రీ సీతా రామచంద్రస్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో కొనసాగుతున్న పునరుద్ధరణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అక్కడి నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఇంజినీరింగ్, దేవాదాయ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆ తర్వాత సారపాక ఐటీసీ గెస్ట్ హౌస్ లో జిల్లా అధికారులతో భూముల రీసర్వే, అటవీ-రెవెన్యూ సమస్యలు, పోడు భూములు, శ్రీనివాసగుట్ట అభివృద్ధిపై సమగ్ర సమీక్ష చేపట్టారు. భద్రాచలం దేవస్థానం పునరుద్ధరణ పనులు వచ్చే గోదావరి పుష్క రాలకు 15 రోజుల ముందే పూర్తికావాలని మంత్రి స్పష్టమైన గడువు విధించారు. నిర్మాణాలకు అవసరమైన ఇసుకను చట్టబద్ధంగా అందుబాటులో ఉండే ప్రాంతాల నుంచి సకాలంలో సరఫరా చేస్తామని జిల్లా కలెక్టర్ అంకిత్ హామీ ఇచ్చారు. అనంతరం సారపాకలో జరిగిన సమీక్షలో జిల్లాలో 70 గ్రామాల్లో చేపట్టిన భూముల రీసర్వే పనులపై మంత్రి ఆరా తీశారు. ప్రస్తుతం 14 గ్రామాల్లో పనులు కొనసాగుతుండగా, ఐదు గ్రామాల్లో పూర్తయ్యాయని అధికారులు వివరించారు. పాల్వంచ శ్రీనివాసగుట్టను ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని, శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తులు సులభంగా చేరుకునేలా రహదారి నిర్మాణంతో పాటు సమగ్ర అభివృద్ధి ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మంత్రి పర్యటనలో ఎమ్మెల్యేలు డాక్టర్ తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్,ఎస్పీ రోహిత్ రాజు, ఐటీడీఏ పీవో రాహుల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, దేవస్థానం ఈవో దామోదర్ రావు, అటవీ శాఖ అధికారులు, రెవెన్యూ, పోలీసు, దేవాదాయ

# నదుల అనుసంధానంపై పార్లమెంటులో ప్రస్తావిస్తాం

### టిడిపి పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణ దేవరాయలు



**విజయవాడ,జులై19, ప్రభాతవార్తప్రతినిధి:** దేశంలో నదుల అనుసంధానంపై మొదటి నుంచి సీఎం చంద్రబాబు మాట్లాడుతున్నారని తెలుగు దేశం పార్టీ లోక్‌సభా పక్షనేత లావు శ్రీకృష్ణ దేవరాయలు వ్యాఖ్యానించారు. ఆదివారం కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో పార్లమెంట్‌లో నదుల అనుసంధానంపై చర్చ జరగాలని సూచించారు. అన్ని పార్టీలు నదుల అనుసంధానంపై చర్చలో పాల్గొనాలని అన్నారు. గోదావరి, పెన్నా నదులను అనుసంధానించాలని తెలిపారు. ఆక్వా రైతుల ఫీడ్ ధరలు తగ్గించాలని చెప్పారు. పడిపోయిన పొగాకు ధరల వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పొగాకు రైతుల సమ స్యలపై పార్లమెంట్‌లో చర్చ జరగాలని తెలిపారు. హార్టికల్చర్ హబ్‌పై పార్లమెంట్‌లో చర్చించాలని చెప్పారు.వాటిపై కొత్తగా చట్టాలు తీసుకురావాలి..సోషల్ మీడియాలో వ్యక్తిగత హననంపై పార్లమెంటులో స్వల్ప కాలిక చర్చ జరగాలని లావు శ్రీకృష్ణ దేవరాయలు పేర్కొన్నారు. రాజకీయ నేతలు, సెలబ్రిటీలే కాకుండా సామాన్య ప్రజలు కూడా వ్యక్తిగత హననానికి గురవుతున్నారని చెప్పారు. ఈ విషయంపైన కొత్తగా చట్టాలు తీసుకురావాలని సూచించారు. వీటిపైన పార్లమెంట్‌లో చర్చించాలని అన్నారు. మ్యూల్ అకౌంట్స్, ఆన్‌లైన్ మోసాలు, షెల్ కంపెనీలతో ప్రజలు నష్టపోతున్నారని దీనిపై చర్చ జరగాలని చెప్పారు. పోలవ రం, అమ రావతి పనులు శరవేగంగా జరుగుతున్నాయని వెల్లడించారు. 2027 మార్చి నాటికి ఫస్ట్‌ఫేజ్ పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. దాని తర్వాత సెకండ్ ఫేస్ పూర్తి చేస్తామని తెలిపారు. ఏపీలో 36 ఇరిగేషన్ ప్రాజెక్టులను రూ.60వేల కోట్లతో గుర్తించామని చెప్పారు. తదుపరి ఎన్నికలకు వెళ్లే ముందే వీటిని పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉన్నామని పేర్కొన్నారు.



## ఇమ్రాన్ సోదరి నొరీన్ నియాజీకి పాక్ సైబర్ క్రైమ్ ఏజెన్సీ సమన్లు

**లాహోర్,జులై 19:** పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ సోదరి నొరీన్ నియాజీకి ఆ దేశ జాతీయ సైబర్ క్రైమ్ దర్యాప్తు సంస్థ సమన్లు జారీ చేసింది. ప్రభుత్వ సంస్థలను అపకీర్తిపాలు చేసేలా, తప్పుడు కథనాలను ప్రచారం చేసేలా సామాజిక మాధ్యమాల్లో అసత్య, అభ్యంతరకర, రెచ్చగొట్టే వ్యాఖ్యలను ప్రచారం చేశారనే ఆరోపణలపై ఈ చర్య తీసుకుంది. ఇటీవల నొరీన్ నియాజీ ఇచ్చిన ఓ ఇంటర్వ్యూ సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వైరల్ అయింది. ఆ ఇంటర్వ్యూలో 2025 మే నెలలో భారత్-పాకిస్థాన్ మధ్య జరిగిన సైనిక ఉద్రిక్తతను పాకిస్థాన్ సైన్యం ప్రతిష్ఠను పెంచేందుకు ఉద్దేశపూర్వకంగా సృష్టించారని ఆమె ఆరోపించారు.ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన జాతీయ సైబర్ క్రైమ్ దర్యాప్తు సంస్థ సమన్లు జారీ చేస్తూ, సోమవారం ఇస్లామాబాద్‌లోని తమ కార్యాలయానికి హాజరై వాంగ్మూలం ఇవ్వాలని ఆదేశించింది. సంస్థ జారీ చేసిన నోటీసులో, “ప్రభుత్వ సంస్థలను అపకీర్తిపాలు చేయడం, తప్పుడు ప్రచారాన్ని వ్యాప్తి చేయడం కోసం అసత్య, అభ్యంతరకర, రెచ్చగొట్టే సోషల్ మీడియా కంటెంట్‌ను మీరు ప్రచారం చేసినట్లు గుర్తించాం“ అని పేర్కొంది. విచారణకు సహకరించకుండా హాజరు కాకపోతే, మీ తరఫున చెప్పేందుకు లేదా సమర్థించుకునేందుకు ఎలాంటి వివరణ లేదని భావిస్తామని కూడా హెచ్చరించింది. తన ఇంటర్వ్యూలో నొరీన్ నియాజీ, పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం గత ఏడాది నాలుగురోజుల పాటు కొనసాగిన భారత్-పాకిస్థాన్ సైనిక ఘర్షణలో పాకిస్థాన్ సైన్యం ఇచ్చిన ప్రతిస్పందనను తక్కువ చేసి మాట్లాడారు.ఎలాంటి ఆధారాలు చూపకుండా, పాకిస్థాన్ ఇజ్రాయెల్‌ను గుర్తించే దిశగా అడుగులు వేస్తుండటంతోనే భారత్ ఘర్షణను మరింత తీవ్రతరం చేయలేదని,అలాగే పాకిస్థాన్‌ను అబ్రహాం ఒప్పందాల్లో భాగస్వామిగా చేర్చేందుకు ఈ పరిణామాలను ఉపయోగించారని ఆరోపించారు.



## ఇరాన్‌లో ముదురుతున్న అంతర్గత సంక్షోభం

### అధ్యక్షుడు, విదేశాంగమంత్రులపై పెరుగుతున్న అసమ్మతి

**టెహ్రాన్,జులై 19:** అమెరికాఇరాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ, ఇరాన్‌లో అంతర్గత రాజకీయాలు మరింత వేడెక్కుతున్నాయి. దేశంలో అంతర్గత సంక్షోభం ముదురుతోంది. దేశ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చిపై తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. అమెరికాతో చర్చలు జరిపి ఒప్పందానికి రావడం ద్వారా ఇస్లామిక్ రిపబ్లిక్ వ్యవస్థను బలహీనపర్చే సాఫ్ట్ తఖ్తాపలట్‌కు పాల్పడుతున్నారని ఇరాన్‌లోని కట్టర పంథీయ మద్దతుదారులు ఆరోపిస్తున్నారు. ఈ ఆరోపణలు మాజీ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియల సందర్భంగా మరింత బలంగా వినిపించాయి. అంత్యక్రియలలో పాల్గొన్న కట్టరపంథీయ మద్దతుదారులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ ఖమేనీ పార్థివదేహం వెంట నడుస్తున్న సమయంలో అమెరికాతో రాజీ పడినవారికి మరణమే శిక్ష అంటూ నినాదాలు చేసినట్లు నివేదికలు పేర్కొన్నాయి. అంతేకాకుండా విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చిపై కొందరు రాళ్ల విసిరి, ఆయనను దేశద్రోహి అంటూ విమర్శించినట్లు సమాచారం. మరోవైపు ఇరాన్‌కు చెందిన మతగాయకుడు మొహమ్మద్ అలీ బఖ్షీ ఓ కార్యక్రమంలో అధ్యక్షుడిని ఉద్దేశించి తీవ్ర హెచ్చరికలు చేసినట్లు వార్తలు వెలువడ్డాయి. సుప్రీంలీడర్ సూచనలు అమలు కాకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన వ్యాఖ్యానించినట్లు తెలుస్తోంది. ఖమేనీ మరణానికి ప్రతీకారం తీర్చుకోవాల్సిన ప్రభుత్వం, దానికి బదులుగా అమెరికాతో రాజీ మార్గాన్ని ఎంచుకుందని వారు ఆరోపిస్తున్నారు. ఈ నిర్ణయాలు కొత్త సుప్రీం లీడర్ అభిప్రాయానికి విరుద్ధంగా తీసుకున్నవేనని అంటున్నారు. పార్లమెంట్‌ను పక్కనపెట్టి కీలక నిర్ణయాలు తీసుకోవడం, సుప్రీం లీడర్ ఆదేశాలను పట్టించుకోకుండా అమెరికాతో చర్చలు జరపడం, మద్దతుదారుల ర్యాలీలను అడ్డుకునే ప్రయత్నం చేయడం వంటి ఆరోపణలు కూడా చేస్తున్నారు. ఇరాన్ పార్లమెంట్ సభ్యుడు మహ్మూద్ నబావియన్ కూడా సోషల్ మీడియా వేదికగా దేశంలో తిరుగుబాటు జరుగుతోందా అంటూ ప్రశ్నిస్తూ పోస్టులు చేయడం రాజకీయ చర్చకు దారితీసింది. ఖమేనీ మరణానికి ప్రతీకారం తీర్చుకునే వరకు పోరాటం కొనసాగుతుందని ఆయన ప్రకటించారు.

## హరీశ్‌రావు రోజుకు 100 అబద్ధాలు ఆడతాడు

### ప్రభుత్వ విప్ విజయ రమణారావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జులై19:** హరీష్ రావు రోజుకు 100 అబద్దాలు ఆడుతాడని, రేవంత్ రెడ్డి వల్లనే కరువు వచ్చిందని ఆయన అబద్దాలు మాట్లాడుతున్నారని ప్రభుత్వ విప్ విజయరమణా రావు మండిపడ్డారు. ఆదివారం సిఎల్పీ కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక గత మూడేళ్ల నుంచి పంటలు బాగా పంచాయని, రికార్డు స్థాయిలో పంటల దిగుబడులు వస్తున్నాయి. రైతుల్లో సీఎం రేవంత్ రెడ్డి పైన విషం నింపాలని హరీష్ రావు ప్రయత్నం చేస్తున్నాడని ధ్వజమెత్తారు. కేటీఆర్‌ను మించి పోవాలని హరీష్ రావు ఉద్దేశపూర్వకంగా రేవంత్ రెడ్డి పైన విమర్శలు చేస్తున్నాడని, కేసీఆర్ కట్టిన కాళేశ్వరం కూలేశ్వరం అయిందని. విజయరమణా రావు విమర్శించారు. నీళ్ల నిల్వ ఉంచరాదని ఎన్డీఎస్ఏ నివేదిక ఇచ్చిందని, దాన్నే తమ ప్రభుత్వం అనుసరిస్తోందన్నారు. ఎల్ నినో ప్రభావం ప్రపంచవ్యాప్తంగా ఉందని, వరకు బదులు ఆరు తడి పంటలు వేసుకోవాలని ప్రభుత్వం రైతులకు చెపుతోంది, రైతులకు నష్టం జరగొద్దని ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని విజయరమణా రావు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి పైన బురద జల్లే ప్రయత్నాలు హరీష్ రావు మానుకోవాలని ఆయన హితవు పలికారు. కేసీఆర్ హయాంలో పదేళ్ల కరువే రాలేదని పనికి పాలిన కబుర్లు చెపుతున్నాడని,బీఆర్ఎస్ హయాంలో 2014, 2015, 2019 సంవత్సరాల్లో వర్షాలు లేక వ్యవసాయం, తాగునీటి కి తీవ్ర సమస్యలు వచ్చాయని చెప్పారు. వరి వేస్తే ఉరే అన్నది. ఖమ్మంలో మిర్చి రైతులకు బేడీలు వేసింది. రైతులకు ఎరువులు. ఉచితంగా ఇస్తానని కబుర్లు చెప్పి మోసం చేసింది. రైతు బంధు ఒక్కటే ఇచ్చి అన్ని రకాల సబ్సిడీలు ఎత్తివేసింది కేసీఆర్ అని ఆయన ఆరోపించారు. చెట్లు, పుట్టలు, సినిమా థియేటర్లు, చివరకు రోడ్లకు కూడా రైతు బంధు ఇచ్చి ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసింది, రైతులను సర్వనాశనం చేసిన చరిత్ర కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.2లక్షల రుణమాఫీచేసింది కాంగ్రెస్ ప్రభుత్వం, వరి క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ఇచ్చింది,మద్దతు ధరకు మార్క్‌ఫెడ్ ద్వారా మక్కలు కొనుగోలు చేశామన్నారు.ఎల్‌నినో ప్రభావం ప్రపంచ వ్యాప్తంగా ఉంది వరికి బదులు ఆరుతడి పంటలు వేసుకోవాలని ప్రభుత్వం రైతులకు చెబుతోందన్నారు.

# అది యువతను రెచ్చగొట్టే సదస్సు: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జులై19:** బీఆర్ఎస్ నిర్వహించింది యువ సంగ్రామ సదస్సు కాదని,యువతను రెచ్చగొట్టే సదస్సు అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మండిపడ్డారు. ఆదివారం ఆయన సిఎల్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఆ సభలో రెచ్చగొట్టేలా ఉన్మాదంగా వికృత వ్యాఖ్యలు చేశారని, రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఎండ్రిన్ తాగి చావాలని, ఎమ్మెల్యేలను కొట్టిచంపాలని మాట్లాడారు. పింక్ సోషల్ మీడియా ఫెయిడ్ ఆర్టిస్టులు వికృతంగా మాట్లాడుతుంటే కేటీఆర్ వాళ్లను వారించకుండా చూస్తు కూర్చున్నాడని అది శ్రీనివాస్‌అక్షేపించారు. కేటీఆర్ మనస్తత్వం ఏమిటో దీన్ని చూసి అర్థం చేసుకోవచ్చని, మళ్లీ అధికారంలోకి రావాలన్న ఆలోచనతో విషసంస్కృతిని, విష బీజాలను నాటే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. నిరుద్యోగులను అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేస్తున్నారని, తమ ప్రభుత్వం 70వేల ఉద్యోగాలను భర్తీ చేసింది,

పేపర్ లీక్ లు లేకుండా పకడ్బందీగా పరీక్షలు నిర్వహించి నియామకపత్రాలు అందజేశామని తెలిపారు. అంగన్ వాడీ, పోలీస్ శాఖతో పాటు అనేక ఉద్యోగాల నోటిఫికేషన్లు ఇచ్చామని, భవిష్యత్తులో మరిన్ని ఇస్తామన్నారు. రాజకీయ ఉనికిని కాపాడుకోవడం కోసమే కేటీఆర్ డ్రామాలని, పేపర్లు లీక్ చేసిన చరిత్ర బీఆర్ఎస్‌ది..నిరుద్యోగ భృతి ఇస్తామని ఇవ్వకుండా మోసం చేసిన చరిత్ర కేసీఆర్‌దని ఆది శ్రీనివాస్ ఆరోపించారు. తెలంగాణ ఉద్యమంలో యువతను రెచ్చగొట్టి అనేకమంది బలిదానాలకు కారణమయ్యారని ఆరోపించారు.

యువ సంగ్రామ సదస్సులో గులాబీ ఫెయిడ్ ఆర్టిస్టులతో సభను నింపారని, సోషల్ మీడియాలో వికృత మాటలను ప్రచారం చేసుకుంటున్నారని ఆయన ఆరోపణలు గుప్పించారు.

20 -7Pg9th chel Mon_20 -7Pg9th chel Mon.qxd 20/Jul/26 1:17 AM Page 1



# కురులు వేగంగా పెరగాలా?



**పుట్టుకుచ్చులా అందంగా, పొడవుగా ఉండే కురులు.. వద్దనుకునే యువతులెవరైనా ఉంటారా.. అస్సలుండరు. అమ్మాయి ఉంటుందా? కానీ ఈ కాలుష్యానికి ఊడటమే కానీ పెరగడం ఎక్కడుంది? ఈ చిన్న చిట్కాలను పాటించండి. వేగంగా పెరుగుతాయి అంటున్నారు నిపుణులు. అవేంటో చూద్దామా?**

★ తల ఆరోగ్యంగా ఉండాలంటే తరచూ దాన్ని శుభ్రం చేయడం తప్పని సరి. కానీ ఆరబెట్టడమే పెద్ద పని. అందుకే చాలామంది డ్రైయ్యర్‌ని వాడుతుంటారు. కానీ దాని వేడి కురుల పెరుగుదలను అడ్డుకుంటుందని తెలుసా? స్టైలింగ్, స్టైలింగ్, స్ట్రెయిట్‌నింగ్ కోసం వాడేవే కాదు.. ఎండలో అతిగా తిరగడం, జడను లాగివేయడం, తువాలుతో తడిపోవాలని కొట్టడం వంటివీ చేటు చేసేవే. వీటికి దూరంగా ఉండండి.

★ కండిషనర్ వెంట్రుకలకు బాగా పడుతుంది. ఇప్పుడైతే చిక్కులు బాగా వస్తాయి. అని తడి తలమీద దువ్వెన ఉపయోగిస్తున్నారా? మేలు చేయడం మాట అటుంచితే కుదుళ్లకు హాని. ఫలితమే కురులు రాలడం. కాబట్టి, తడి వెంట్రుకలు ఆరేవరకూ ఆగండి. తరవాతే దువ్వండి.

★ ఒకప్పుడు సమస్యేదైనా నిపుణులను సంప్రదించేవారు. మరి ఇప్పుడు? అరచేతిలోనే సమాచారం. దాని సలహాతో ఇష్టారీతిన సప్లిమెంట్లను వాడేస్తున్నారు. మీదీ అదే ధోరణా? ఇవి మేలు చేయకపోగా చేటు చేస్తాయి. వాటి ప్రభావం తొలుత పడేది చర్మం, కురులపైనే! నిపుణుల సలహా లేనిదే వాడకపోవడమే మేలు. ★త్వరగా పెరగవు అని చాలామంది కురులను కత్తిరించడానికి వెనకాడతారు. కానీ రెండు నెలలకో సారైనా ట్రిమ్ చేసుకోవాలి. చిట్లడం, చివర్లు పొడిబారడం కూడా కురుల పెరుగుదలకు అవరోధంగా మారతాయి. కాబట్టి, వాటిని తొలగించడం తప్పనిసరి. ★ జిడ్డు, సమయం లేదని బద్ధకించక వారానికి రెండుసార్లు గోరువెచ్చని నూనెతో తలకు మర్దనా చేయండి. మాడుకి రక్తప్రసరణ బాగా జరుగుతుంది. అలాగే కండిషనర్ వాడకం కూడా తప్పనిసరి. ఇది వాతావరణ పరిస్థితుల నుంచి కురులకు సంరక్షిస్తుంది. ★ దిండు కూడా కేశాల పెరుగుదలపై ప్రభావం చూపుతుందని తెలుసా? సరైన గలేబులను వాడకపోతే అవి కురుల్లోనే సహజ నూనెలను పీల్చేయడమే కాదు, రాపిడికి గురిచేసి వెంట్రుకలు తెగేలానూ చేయగలవు. కాబట్టి, శాటిన్ రకాలనే ఎంచుకోండి.

చిన్నవే కదూ.. అందమైన, ఆరోగ్యకరమైన కురుల కోసం పాటించండి మరి. □

**ఈ దేశం ఎటు పోతోందో తెలుసా? మీ ఊర్లో ప్రగతి ఏ మేరకు జరుగుతోందో ఎప్పుడైనా కన్నారా? మీ పల్లెటూర్లో పంటలేవి పండుతున్నాయో తెలుసుకున్నారా? అవన్నీ తెలుసు కోవాలంటే ఒక వార్తా సమాచార పత్రిక పొద్దుటే మీ చేతిలోకొచ్చి చేరాలి.**

# పత్రిక చదువుతున్నారా.. !



పేపర్ చదవడం వల్ల ఎన్ని లాభాలున్నాయో తెలుసా? ఉదయాన్నే చల్ల గాలికి వేడివేడి టీ లేదా కాఫీ తాగుతూ కుర్చీలో కూర్చొని, పేపర్ చదువుతోంటే ఆ ఫీలింగే వేరు కదా! ఒక్కో పేజీ తెరుస్తూ ఆ బ్రాడ్‌షీట్ లే అవుట్, అందులో ఉండే ఫొటోలూ, పదాలూ, హెడ్‌లైన్లూ చూస్తూ ఉంటే ఆ అనుభూతి వేరు. తరవాతి పేజీలో ఏ ముంటుందో అనే సస్పెన్స్.. మనలో మరింత ఉత్సాహాన్ని పెంచుతుంది. ఉదయాన్నే మనం పేపర్ చదువుతున్నప్పుడు దాన్నుంచి వచ్చే చప్పుడు పక్షి రెక్కలతో చేసే శబ్దంలానూ అనిపిస్తుం టుంది. ఒక రకంగా చెప్పా లంటే ప్రశాంతంగా కూర్చుని సామచా రాన్నీ, విజ్ఞానాన్నీ తెలుసు కునే ప్రక్రియే ఈ పేపర్ రీడింగ్. ఈ భావనలన్నీ మామూలుగా మొబైల్‌లో న్యూస్‌ను స్క్రోల్ చేసుకుంటూ వెళ్తే రావు కదా! ప్రతి పేజీలో వ్యక్తుల విజయగాథలూ, స్థానికంగా జరిగే కార్యక్రమాల నుంచి జాతీయ, అంతర్జాతీయ వార్తలూ, క్రీడావిజయాలూ.. ఇలా ఎన్నో రకాల అంశాల కలబోతే పత్రిక. పైగా దీనికి నో ఛార్జింగ్.. నో బఫరింగ్.. అన్నమాట కేవలం మనం మనముందున్న సామచారాన్ని హాయిగా, అలా చదువుకుంటూ వెళ్లడమే? ఇదొక రకమైన విలాసం సరి.. ఆలోచించండి.! □

# పని చేయాలనిపించడం లేదా?



ఒక బృందం ప్రాజెక్ట్ మీద పని చేస్తోందంటే దానికి సంబంధించిన ప్రతి విషయం, ప్రతి అప్‌డేట్ ఆ గ్రూప్‌లో ఉన్న అందరికీ తెలిస్తేనే కలిసికట్టుగా ముందుకెళ్లగలం.. అనుకున్న సమయానికి చక్కటి అవుట్‌పుట్‌ని కంపెనీకి సమర్పించవచ్చు. అయితే బాగా పనిచేసే వాళ్లపై ఇతర కొలీగ్స్‌కి ఉండే అసూయ, సహోద్యోగుల మధ్య కమ్యూనికేషన్ లోపం, గ్రూపిజం.. వంటి అంశాలు పని వాతావరణాన్ని దెబ్బతీస్తుం టాయి. లాంటి చోట మీరు పని చేస్తున్నా, చక్కటి నైపుణ్యాలను ప్రదర్శిస్తున్నా మిమ్మల్ని వేరు చేసి చూడడం, పనికి సంబంధించి మీకు ఎలాంటి అప్‌డేట్ చెప్పక పోవడం..వంటి అంశాలు మీ వ్యక్తిగత పనితీరుపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. ఇది క్రమంగా మీ మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. కెరీర్ ఉన్నతికి గండి పడ్డటే! కాబట్టి ఇలాంటి వాతావరణంలో పనిచేస్తున్న ప్పుడు మీ వెనక జరిగే గ్రూపిజం, ఆఫీస్ రాజకీయాల గురించి మీ తీరు గురించి ముందుగా పై అధికారులకు తెలియప్పం. బాస్ కూడా జరుగుతున్న విషయాలను నమ్మకపోతే కంపెనీలోని వేరే విభాగానికి మారడం మంచిది. ఎంత చేసినా బూడిదలో పోసిన పన్నీరే!.. వచ్చిన ఉద్యోగం వచ్చింది. ఇక నా పనితనమేంటో చూపిస్తా.. అంటూఎంతో ఉత్సాహంగా తాము కోరుకున్న జాబ్‌లో జాయినవు తుంటారు చాలా మంది. అయితే అక్కడికెళ్లి కొన్నాళ్ల పాటు ఉద్యోగం చేస్తేగానీ తెలియదు ఆ కంపెనీ పని వాతావరణం గురించి! ఈ క్రమంలో ఎంత పని చేసినా సరైన ప్రోత్సాహకాలు లేక పోవడం, కొన్ని కంపెనీల్లోనైతే పనిచేసే వారికంటే చేయని వారికే అధిక ప్రాధాన్య మిస్తూ వారికే పై అధికారుల నుంచి ప్రోత్సాహం లభించడం.. వంటివి కూడా జరుగుతుంటాయి. అయితే ఇలాంటి వాతావరణం ప్రత్యక్షంగా మనం చేసే పనిపైన కూడా ప్రతికూల ప్రభావం చూపు తుంటుంది. నెగిటెల్ ఫిలింగ్ రాకుండా చూసుకోండి. అలాంటి చోట పని చేయలేమని అర్థం. అందుకే అక్కడే రోజులు గడిపేయడం కాకుండా సత్వరమే వేరే ఉద్యోగంలోకి మారి పోవడం మంచి నిర్ణయం ఎక్కడైనా కష్టపడడమే. చేసే ఉద్యోగమేదైనా సరే.. మనకు అప్పగించిన పనికే పరిమితం కాకుండా.. ఫలానా పనిని నేను చేయగలను అన్న ఆత్మవిశ్వాసంతో, యాక్టివ్‌గా ఆ పనిని స్వీకరించాలి. ఈ క్రమంలో మీలోని సృజనాత్మకతను చాటు కుంటే మరి మంచిది అయితే ఈ చురుకు దనం ఒక్కోసారి మన తలపై భారంగా మారే అవకాశాలూ లేకపోలేదు. ఎలాగూ ఈ అమ్మాయి యాక్టివ్‌గా పనిచేస్తుంది కదా అని కొంతమంది అధికారులు సహోద్యోగుల పనిని కూడా వారి నెత్తినేస్తుంటారు. అనవసర ఒత్తిడిని కొని తేచ్చుకోరాదు. తద్వారా మీరు చేసే పనిలో నాణ్యత లోపిస్తుంది. కొలీగ్ రానప్పుడు అత్యవసరంగా చేయాల్సిన పనో, ఏదైనా అరుదైన సందర్భాల్లో అదనపు పనిని తీసుకోవడంలో తప్పులేదు. అంతేకానీ.. అదే నిత్యకృత్యం అయితే నిర్మొహమాటంగా చేయలేని చెప్పడంలో బెరుకు చూపవద్దు. ఎంత చెప్పినా వినకుండా మీపై ఒత్తిడి తెస్తే మాత్రం ఆ ఉద్యోగానికి గుడ్‌బై చెప్పడమే మంచిదని చెబుతున్నారు నిపుణులు. సహోద్యోగులపై చేసే చెడు ప్రచారాలు, పనిచేసే చోట లైంగిక వేధింపులు సెలవు తీసుకున్నా పనిచేయాల్సి రావడం, పై అధికారుల ప్రోత్సాహం కరువవడం.. వంటివి కూడా అటు పని వాతావరణాన్ని, ఇటు ఉద్యోగుల కెరీర్ ఉన్నతిని దెబ్బతీస్తాయి. అందుకే ఇలాంటి విషపూరిత వాతావరణానికి టాటా చెప్పి.. కొంచెం లేటైనా సరే సౌకర్యవంతంగా, మనసుకు కష్టమనిపించిన చోట ప్రశాంతంగా పనిచేయడం కష్టం అందుకే గౌరవమున్నచోట మాత్రమే పనిచేయండి. □

# 'యమాదిత్యుడు'

కాశీ క్షేత్రంలో పన్నెండు మంది ఆదిత్యులు పన్నెండు పేర్లతో పిలవబడుతూ వుంటారు. ఒక్కో ఆదిత్యుడి ప్రతిష్ఠ వెనుక ఒక ఆసక్తికరమైన కథనం ఇక్కడ వినిపిస్తూ ఉంటుంది. అలా 12 మంది ఆదిత్యులలో 'యమాదిత్యుడు' ఒకరుగా కనిపిస్తాడు. ఇక్కడి సూర్య భగవానుడిని సాక్షాత్తు యమధర్మ రాజు ప్రతిష్ఠించడం వలన'యమాదిత్యుడు' అనే పేరు వచ్చిందని అంటారు. పూర్వం యమధర్మరాజు .. సూర్యభగవానుడి భక్తుల జోలికి పోవద్దని తన భటులతో చెప్పాడట. అయితే ఆ మాటలు వినిపించుకోకుండా సత్రాజిత్తు దగ్గరికి వెళ్లిన యమభటులు .. సూర్యభగవానుడి ఆగ్రహానికి గురవుతారు. దాంతో తమవారి అపరాధాన్ని మన్నించమని కోరుతూ యమధర్మరాజు కాశీ క్షేత్రంలో సూర్యభగవానుడి మూర్తిని ప్రతిష్ఠించి



సూర్యోపాసన చేశాడట. అలా ఆయన ఆ స్వామి అనుగ్రహాన్ని పొందాడని ఆధ్యాత్మిక గ్రంథాలు చెబుతున్నాయి. కాశీ క్షేత్రంలోని గంగానదిలో స్నానం చేసి .. ఇక్కడి యమాదిత్యుడి దర్శనం చేసుకున్న వారికి, యమ యాతనలు .. యమలోక బాధలు ఉండవని పురాణాలు చెబుతున్నాయి. □

# కాఫీ, టీలకూ పరిమితి ఉంది!



**కాఫీ, టీ మంచిది కాదనే మాట అనేకసార్లు వింటుంటాం కదూ! అయితే ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసిఎంఆర్) తాజాగా విడుదల చేసిన ఆరోగ్యసూత్రాలు ఇలా ఉన్నాయి.**

✦ చాయ్ కానీ కాఫీ కానీ అదే మానేయ మనడం లేదు. కాకపోతే భోజన సమయంలో మంచిది కాదు. గంట ముందు లేదా తర్వాత తాగండి. కొందరు ఆహారం తీసుకునేటప్పుడు కాఫీ, టీలు తాగితే త్వరగా అరుగుతుందని, శరీరంలో పేరుకున్ననూనెను కరిగించేస్తుందని అనుకుంటారు అన్ని నిజం కాదు.

✦ అయితే కాఫీలో ఉండే టన్నిన్స్ ఐరన్స్ గ్రహించడగంలో తోడ్పడుతుంది. కనుక ఐరన్ లోపం ఏర్పడకుండా ఉంటుంది. ఎనీమియా రాదు. అయితే కాఫీ, టీల్లో కెఫిన్ ఉంటుంది కనుకన అది మోతాదు మించిన కొద్దీ మానసిక రుగ్మతలతో సహా అనేక అనారోగ్యాలువచ్చే అవకా శం ఉంది. ✦ పరగడుపున కాఫీ తాగడం చాలామందికి అలవాటు ఇది మంచిది కాదు, ఏమైనా తిన్న తర్వాతే తాగాలి. □

# గ్లాసుల కోసం..



**వంట చేసిన పాత్రల న్నింటి నీ సింకులో వేసి,** డిష్‌వాషర్‌తో తోమి శుభ్రం చేస్తాం. గ్లాసులు, బాటిళ్ల విషయానికొస్తే వాటిని తోమాల్సిన అవసరం ఉండదు. కేవలం నీళ్లతో శుభ్రం చేస్తే చాలు. అందుకోసం ప్రత్యేకంగా తయారుచేసిన పరికరమే గ్లాస్ రిన్సర్ పరికరం. దీన్ని సింకు పక్కనే అమర్చుకోవచ్చు. గుండ్రంగా, వెడల్పుగా ఉండే ఈ పరికరంపై గ్లాసును ఉంచి ఒత్తితే చాలు. నీళ్లు వేగంగా వచ్చి గ్లాసు లోపలి భాగాల్ని శుభ్రం చేస్తాయి. ఇది కేవలం గ్లాసుల కోసమే కాదు.. బాటిళ్లు, సీసాల మూతలు శుభ్రం చేయడానికీ ఉపయోగపడుతుంది. □



# 'కామ్రేడ్ కల్యాణ్' నుంచి సాంగ్ రిలీజ్



టైటిల్ గ్లింప్స్, తొలి పాటతో ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచిన 'కామ్రేడ్ కల్యాణ్' చిత్ర బృందం ఇప్పుడు రెండో పాట 'ఇంత ఇష్టమా'ను విడుదల చేసింది. శ్రీవిష్ణు, మహిమా నంబియార్ జంటగా నటిస్తున్న ఈ పీరియడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు జనకిరామ్ మారెళ్ల దర్శకత్వం వహిస్తున్నారు. కోన వెంకట్ సమర్పణలో, వెంకట కృష్ణ కర్నాటి, సీతా కర్నాటి స్కంద వాహన మోషన్ పిక్చర్స్ ఎల్‌ఎల్‌పి బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. విజయ్ బుల్గానిన్ స్వరపరిచిన ఈ లవ్ మెలోడీ హీరో చూపించే నిస్వార్థమైన ప్రేమ, ఆప్యాయతకు హీరోయిన్ మెస్మరైజ్ అయ్యి అతనిపై ప్రేమను పెంచుకునే భావోద్వేగాలను అందంగా చూపించారు. భాస్కరభట్ల రవికుమార్ సాహిత్యం ఈ లవ్ సాంగ్ మరింత అందాన్ని తీసుకురాగా, రామ్ మిర్యాల, లిప్సిక వోకల్స్‌తో పాటకు ప్రాణం పోశారు. శ్రీవిష్ణు, మహిమా నంబియార్‌ల మధ్య కెమిస్ట్రీ, ఆకట్టుకునే విజువల్స్ ఈ పాటను మరింత ప్రత్యేకంగా నిలబెట్టాయి. 1992 నాటి ఆంధ్ర-ఒడిశా సరిహద్దు ప్రాంతం నేపథ్యంలో తెరకెక్కుతున్న 'కామ్రేడ్ కల్యాణ్' యాక్షన్, భావోద్వేగాలు, ఆకట్టుకునే ప్రేమకథ కలగలిపిన చిత్రంగా రూపొందుతోంది. ఈ రెండో పాటలో లీడ్ పెయిర్ మధ్య చిగురించే ప్రేమను, సరిహద్దులను దాటే అమాయకమైన అనుబంధాన్ని అందంగా చూపించారు. ఈ చిత్రంలో రాధిక శరత్‌కుమార్, షైన్ టామ్ చాకో, ఉపేంద్ర లిమాయే కీలక పాత్రల్లో నటిస్తున్నారు. 'కామ్రేడ్ కల్యాణ్' విడుదల తేదీని త్వరలోనే ప్రకటించనున్నారు.



# '418' జూలై 31న ప్రపంచవ్యాప్తంగా రిలీజ్

మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ప్రతిష్ఠాత్మక హారర్ థ్రిల్లర్ '418' విడుదలకు సిద్ధమైంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు తుది దశలో ఉన్న ఈ చిత్రాన్ని జూలై 31న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. బ్లాక్‌బస్టర్ దర్శకుడు ప్రశాంత్ నీల్ సమర్పిస్తున్న ఈ చిత్రానికి కీర్తన్ నడగౌడ కథ, దర్శకత్వం వహించారు. నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సూర్య రాజ్, చరణ్ లక్కరాజు, ప్రీతి పగడల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న '418', హారర్ థ్రిల్లర్ గా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఆరంభం నుంచి చివరి వరకు ప్రేక్షకులను సీట్ల అంచున కూర్చోబెట్టేలా సరికొత్త హారర్ అనుభూతిని అందించబోతోంది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతుండగా, విడుదలకు మరో రెండు వారాల సమయం ఉండడంతో త్వరలోనే ప్రచార కార్యక్రమాలను ముమ్మరం చేయబోతున్నారు. విడుదల తేదీ సమీపిస్తున్న నేపథ్యంలో, త్వరలోనే ఈ సినిమా నుంచి వరుస అప్డేట్స్‌ను విడుదల చేయనున్నట్లు మేకర్స్ తెలియజేశారు.

# 'చెన్నై లవ్ స్టోరీ' ట్రైలర్ రిలీజ్



హీరో కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరి ప్రియ జంటగా 'కలర్ ఫొటో', 'బేబి' వంటి కల్ట్ క్లాసిక్ మూవీస్ ప్రేక్షకులకు అందించిన మేకర్స్ ఎస్ కేఎన్, సాయి రాజేశ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న సినిమా "చెన్నై లవ్ స్టోరీ". ఈ చిత్రాన్ని అమృత ప్రొడక్షన్స్, మాస్ మూవీ మేకర్స్ బ్యానర్స్ పై ఎస్ కేఎన్, సాయి రాజేశ్ నిర్మిస్తున్నారు. సాయి రాజేశ్ కథను అందిస్తున్న ఈ చిత్రానికి రవి నంబూరి దర్శకత్వం వహిస్తున్నారు. మెలోడీ బ్రహ్మ మణిశర్మ 'చెన్నై లవ్ స్టోరీ' సినిమాకు బ్లాక్ బస్టర్ మ్యూజిక్ అందిస్తున్నారు. ఈ నెల 24న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు 'చెన్నై లవ్ స్టోరీ' మూవీ రెడీ అవుతోంది. ఈ రోజు ఈ సినిమా ట్రైలర్ రిలీజ్ ఈవెంట్‌ను హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్టార్ ప్రొడ్యూసర్స్ అల్లు అరవింద్, మైత్రీ మూవీ మేకర్స్ రవిశంకర్ అతిథులుగా పాల్గొన్నారు. అల్లు అరవింద్ చేతుల మీదుగా సినిమా ట్రైలర్ రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొడ్యూసర్ రవిశంకర్ బర్త్ డే కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

# ఆగస్టు 15న 'ఖడ్గం' రీ రిలీజ్



శ్రీకాంత్, రవితేజ, ప్రకాశ్ రాజ్ ముఖ్య పాత్రల్లో కృష్ణవంశీ దర్శకత్వంలో సుంకర మధుమురళి నిర్మాతగా వచ్చిన సూపర్ హిట్ సినిమా ఖడ్గం. ఖడ్గం సినిమా 2002లో విడుదలై భారీ విజయం సాధించిన సంగతి తెలిసిందే. లవ్, కామెడీ, దేశం ఎమోషన్, సినిమా ఎమోషన్.. ఇలా అన్ని రకాల ఎమోషన్స్ కలిపి మల్టీ జానర్లో ఈ సినిమాని అద్భుతంగా తెరకెక్కించారు దర్శకుడు కృష్ణవంశీ. ఇప్పటికి టీవీల్లో ఇండిపెండెన్స్ డే, రిపబ్లిక్ డేలలో ఈ సినిమాని వేస్తారు. ఇక ఈ సినిమా సాంగ్స్ కూడా ఇప్పుడు విన్నా అద్భుతంగా ఉంటాయి. దేవి శ్రీ ప్రసాద్ అద్భుతమైన సంగీతం అందించాడు, ఇలాంటి మంచి సినిమాని ఇప్పుడు రీ రిలీజ్ చేస్తున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న ఖడ్గం మరోసారి థియేటర్స్‌లో విడుదల కానుంది, పాప్ కార్న్ ప్రొడక్షన్స్‌లో దేవరపల్లి రేవంత్ సమర్పణలో విష్ణుమొలకల నక్షత్ర నిర్మాతగా కృష్ణ వడిగేపల్లి, కాకర్లమూడి రామకృష్ణ సహా నిర్మాతగా ఖడ్గం చిత్రం మరోసారి ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.

# 'హే చికీతా' ప్రి రిలీజ్ ఈవెంట్




అమరావతి మూవీ మేకర్స్, సుందరకాండ మోషన్ పిక్చర్స్ బ్యానర్ల మీద ఎన్. అశోక ఆర్‌ఎన్‌ఎస్, 'గరుడవేగ' అంజి నిర్మించిన చిత్రం 'హే చికీతా'. అభినవ్ మణికంఠ, దివిజ ప్రభాకర్, తన్మయ్ ఖుషి, దేవి ప్రసాద్, ఈటీవీ ప్రభాకర్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ మూవీని ధనరాజ్ లెక్కల తెరకెక్కించారు. ఈ సినిమాని జూలై 24న రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో ఈ మూవీ నుంచి ఇప్పటి వరకు రిలీజ్ చేసిన పోస్టర్లు, టీజర్, సాంగ్స్ ఇలా అన్నీ కూడా ప్రేక్షకుల్లో అంచనాలు పెంచేశాయి. శుక్రవారం నాడు ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ మేరకు నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి చదలవాడ శ్రీనివాసరావు, తుమ్మలపల్లి రామ సత్యనారాయణ, రామ్ లక్ష్మణ్ మాస్టర్స్, కమెడియన్ అలీ, వీఎన్ ఆదిత్య, ప్రసన్న కుమార్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో.. చదలవాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ "నేను యంగ్ ఏజ్‌లో ఉన్నప్పుడు 'లైలా' మూవీని చేశాను. ఆడియో రైట్స్‌తోనే ఎంతో లాభం వచ్చింది. 'హే చికీతా' టీంని చూస్తే నాకు పాత రోజులు గుర్తుకు వచ్చాయి. ఎన్నో జన్మల పుణ్యం చేస్తే గానీ నిర్మాతగానో, ఆర్టిస్టుగానో, టెక్నీషియన్ గానో ఇండస్ట్రీలోకి రాలేం" అన్నారు. కమెడియన్ అలీ మాట్లాడుతూ.. 'బద్రి' సినిమాలోని 'హే చికీతా' పాట ఎంత పెద్ద హిట్ అయిందో ఈ సినిమా కూడా అంతే హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను' అన్నారు. వీఎన్ ఆదిత్య మాట్లాడుతూ..'హే చికీతా' ఈవెంట్‌కి వచ్చిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. చదలవాడ శ్రీనివాసరావు నిర్ణయం వల్ల మా దర్శకుల సంఘం నుంచి సినిమాలు రాబోతోన్నాయి' అన్నారు. ప్రసన్న కుమార్ మాట్లాడుతూ.. 'చదలవాడ శ్రీనివాసరావు చేస్తున్న మంచి పనుల గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. ఆయన ఇక్కడకు వచ్చిన ఈ చిత్రయూనిట్‌ను అభినందిస్తుండటం ఆనందంగా ఉంది. 'హే చికీతా' టైటిల్ బాగుంది. థియేటర్లు నిండటం సహజం. కానీ ఈ రోజు ఇక్కడ స్టేజ్ నిండిపోయింది' అన్నారు. రామ్ లక్ష్మణ్ మాస్టర్స్ మాట్లాడుతూ "పల్లెటూరులో చాలా ప్రేమ కథలుంటాయి. 'హే చికీతా' పోస్టర్‌ని చూస్తే మా ఊర్లో ఉన్న రోజులు గుర్తుకు వచ్చాయి' అన్నారు. జి. నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. 'హే చికీతా' మూవీని ఆల్రెడీ చూశాను. ఫస్ట్ హాఫ్ అంతా నవ్వుతారు. సెకండాఫ్ అంతా ఎమోషనల్‌గా ఉంటుంది. క్లైమాక్స్ చూసి కంటతడి పెట్టుకుంటారు" అన్నారు. నిర్మాతఎన్. అశోక ఆర్‌ఎన్‌ఎస్ మాట్లాడుతూ. 'హే చికీత' కోసం వచ్చిన గెస్టులందరికీ థాంక్స్. ధన్ రాజ్ చెప్పిన కథ నాకెంతో నచ్చింది. అంజి గారితో చాలా మంచి సినిమా చేశాను" అన్నారు.

నటి తన్మయ్ ఖుషి మాట్లాడుతూ.. 'హే చికీతా'లో నేను పొట్టి అనే పాత్రను పోషించాను. బావను పిచ్చిగా ప్రేమించే ఈ పాత్రను అందరూ ప్రేమిస్తారు. నా కారెక్టర్‌తో ప్రతీ ఒక్కరూ కనెక్ట్ అవుతారు. నాకు మంచి పాత్రను ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థాంక్స్. జూలై 24న ఈ చిత్రం పెద్ద హిట్ అవుతుందని నమ్ముతున్నాను" అన్నారు.

చరణ్ అర్జున్ మాట్లాడుతూ..'హే చికీతా' సినిమాలో అద్భుతమైన సాహిత్యం అందించిన లిరిసిస్ట్స్‌కి థాంక్స్. ఈ మూవీ క్రెడిట్ అంతా దర్శకుడిదే. ధన్ రాజ్ అద్భుతమైన కథను రాసుకున్నారు" అన్నారు.

gnt 7:gnt 7.qxd 7/20/2026 1:07 AM Page 1



## తూర్పు మాధవరంలో నిరుపయోగంగా గోడౌన్

- ఎంపి ఎఫ్‌సి గోదాములు నిర్మించి రెండేళ్లయినా ప్రారంభించేది ఏనాడో.. రైతన్నల నిర్వేదం



**ఏ కొండూరు, జూలై 19, ప్రభాతవార్త**

ఎన్‌టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం ఎ కొండూరు మండలంలో తూర్పు మాధవరం కృష్ణారావుపాలెం, కోడూరు, కంభంపాడు, పోలిశెట్టిపాడు గ్రామాల్లో లక్షలాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన ఎంపిఎఫ్‌సి గోడౌన్ నిర్మాణాలు పూర్తి చేసుకుని రెండేళ్లు కావస్తున్నా నేటివరకు ఆ గోదాములు రైతులకు ఏమాత్రం ఉపయోగం లేకుండా పోవడంతో రైతులు పాలకుల తీరుపై తీవ్రంగా ఆక్షేపించారు. తూర్పు మాధవరం గ్రామంలో జవ్వాజి వెంకటేశ్వరరావు అనే రైతు లక్షల రూపాయలు ఖరీదు గల 30సెంట్ల భూమిని ఈ గోడౌన్ నిర్మాణం కొరకు దానం చేశారు. 30సెంట్ల భూమిని రైతులు ఉపయోగార్థ గోదాములు కొరకు దానం చేయగా నేటివరకు నిర్మించిన గోదాములను రైతులు పండించిన ధాన్యం ఇంకా ఇతర పంటలు గిట్టుబాటు ధర కల్పించే వరకు ఈ గోదాముల నిర్మాణం జరగ్గా నేటివరకు ఆ గోదాములను ప్రారంభించకపోవడం శోచనీయమని ప్రభుత్వానికి దానం చేసిన ఆ భూమి గోడౌన్ రైతులకు ఉపయోగపడకపోవడం పట్ల దాత జవ్వాజి వెంకటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా నిర్మాణాలు పూర్తిచేసుకుని నిరుపయోగంగా ఉన్న ఈ గోదాములను వెంటనే ప్రారంభించి ఆదుకోవాలని అలాగే స్థలదాత ఆశయాన్ని నెరవేర్చాలని మండలంలోని తూర్పు మాధవరం కృష్ణారావుపాలెం కోడూరు పోలిశెట్టిపాడు గ్రామాల ప్రజలు రైతన్నలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## నేడు తహశీల్దార్ కార్యాలయం వరకు పాదయాత్ర జయప్రదం చేయండి..

- ఏపి రైతు సంఘం ఎ కొండూరు మండల కమిటీ పిలుపు




**ఏ కొండూరు, జూలై 19, ప్రభాతవార్త**

ఎన్‌టీఆర్ జిల్లా ఎ కొండూరు మండలం రామచంద్రాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని రామచంద్రాపురం లక్ష్మీపురం కోమటికుంట గ్రామాలకు చెందిన సన్నచిన్నకారు సాగు రైతులందరికి పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఎ కొండూరు మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రామచంద్రాపురం నుండి ఎ కొండూరు తహశీల్దార్ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు ఎ కొండూరు మండల కమిటీ తెలిపింది గత ఎన్నో ఏళ్లుగా సన్నచిన్నకారు రైతులు సాగు చేసుకుని జీవనం సాగిస్తున్న ఈ భూములకు ప్రభుత్వం పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వం పట్టాలు మంజూరు చేయకుండా పరిశ్రమల పేరుతో భూములు స్వాధీనం చేసుకోవాలనే దురాలోచనలో ఉందని సన్నచిన్నకారు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెక్కాడితే గాని డొక్కాడని ఈ పేద రైతులు సాగు భూములకు వెంటనే పట్టాలు మంజూరు చేసి పీకలోతు అప్పుల పాలై ఉన్న తమకు వివిధ బ్యాంకుల్లో రుణాలు తీసుకోడానికి అవకాశం కల్పించి ఆదుకోవాలని లేని పక్షంలో ఇక తమకు ఆత్మహత్యలే శరణ్యమని రామచంద్రాపురం లక్ష్మీపురం కోమటికుంట గ్రామాలకు చెందిన సన్నచిన్నకారు రైతులు ఆందోళన చెందారు. సోమవారం జరిగే ఈ పాదయాత్రను జయప్రదం చేయాలని ఎ కొండూరు మండల కమిటీ కోరింది.

## కాపు సంఘం అధ్యక్షులు కోటేశ్వరరావుకు శ్రద్ధాంజలి

- శ్రద్ధాంజలి ఘటించిన న్యాయవాదులు పడవల ఏడుకొండలు,మల్లేశ్వరరావులు

- హాజరైన మాజీ మంత్రి కొడాలి నాని

**విజయవాడ,జూలై 19,ప్రభాతవార్త**

కాపు సంఘం గుడ్లవల్లేరు అధ్యక్షులు కూనం వెంకట కోటేశ్వరరావు పెద్ద ఖర్మ సందర్భంగా ఆదివారం పలువురు నాయకులు, న్యాయవాదులు ఆయనకు శ్రద్ధాంజలి ఘటించారు. మాజీ మంత్రి కొడాలి నాని విచ్చేసి కూనం వెంకట కోటేశ్వరరావు శ్రద్ధాంజలి కార్యక్రమంలో పాల్గొని పుష్పాంజలి ఘటించి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కోటేశ్వరరావు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.పలువురు కాపు నాయకులతో పాటు వల్లభనేని కృష్ణప్రసాద్,పోలవరపు వెంకట్రావు,మార్కెట్‌యార్డ్ చైర్మన్ పొట్లూరి రవి,టిడిపి నాయకులు వల్లభనేని సుబ్బారావు,చాపరాల సుధాకర్, సీనియర్ న్యాయవాదులు సూరాబత్తుల మల్లేశ్వరరావు,పడవల ఏడుకొండలు, తదితర న్యాయవాదులు ఆయనకు శ్రద్ధాంజలి ఘటించారు.

## షైనింగ్ స్టార్ పురష్కారానికి ఎంపికైన సెయింట్ మార్క్స్ విద్యార్థి



**పామూరు, జూలై 19, ప్రభాతవార్త**

అత్యంత ప్రతిష్ఠాత్మకమైన షైనింగ్ స్టార్ పురష్కారానికి మార్కాపురం జిల్లా పామూరు మండల కేంద్రానికి చెందిన సెయింట్ మార్క్స్ విద్యార్థి జోయ్ ప్రకాష్ ఎంపికయ్యారు. క్రమశిక్షణ విలువలు ఉన్నత విద్యా ప్రమాణాలతో విద్యాబోధన గావిస్తున్న కరస్పాండెంట్ జయ కుమార్ జయప్రకాష్‌ని ఈ సందర్భంగా అభినందించారు.

## 216వ ఆదివారం ఏకాదశ హనుమాన్ చాలీసా పారాయణం



**గుడ్లూరు, జూలై 19, ప్రభాతవార్త**

గుడ్లూరు మండలం చెమిడిదపాడు గ్రామ బస్టాండ్ వద్ద నిర్మాణంలో ఉన్న శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి వారి ఆలయం వద్ద ఆదివారం సాయంత్రం ఏకాదశ హనుమాన్ చాలీసా పారాయణం జరిగింది. ప్రతి ఆదివారం ట్రస్టు ఆధ్వర్యంలో జరిగే ఈ ఏకాదశ హనుమాన్ చాలీసా పారాయణం ఈ ఆదివారం ఆలయ నిర్మాణ ప్రాంగణంలో జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో హనుమాన్ భక్తులు పాల్గొన్నారు.

## పేకాట రాయుళ్లు అరెస్టు



**గుడ్లూరు, జూలై 19, ప్రభాతవార్త**

గుడ్లూరు మండలం అడవిరాజుపాలెం అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను గుడ్లూరు పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.5,160 నగదును, వారికి చెందిన బైకులను స్వాధీనం చేసుకున్నట్లు గుడ్లూరు ఎస్సై వెంకటరావు తెలిపారు. వారినికోర్టుకుహాజరుపరచనున్నట్లు తెలిపారు.

## మహానందిలో వాసవి క్లబ్ అంతర్ జిల్లాల ఆత్మీయ సమావేశం

- కనిగిరి ప్రతినిధుల ఘన సన్మానం



**కనిగిరి, జూలై 19, ప్రభాతవార్త**

మహానందిలో ఆదివారం నిర్వహించిన వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అంతర్ జిల్లాల ఆత్మీయ సమావేశానికి మార్కాపురం జిల్లా నుంచి గవర్నర్ సూర్య సురేంద్ర ఆధ్వర్యంలో వివిధ వాసవి క్లబ్‌ల అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులు, జిల్లా అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కనిగిరి వీకేఎస్పీ క్లబ్ అధ్యక్షుడు రాచపూడి వెంకటేశ్వర్లు, వాసవి క్లబ్ అధ్యక్షుడు చేవూరి యశ్వంత్ కుమార్, వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు సత్యవతి ఆధ్వర్యంలో మార్కాపురం జిల్లా గవర్నర్ సూర్య సురేంద్రతో పాటు వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు సిద్ధ సూర్య ప్రకాష్‌ను ఘనంగా సన్మానించారు. అంతర్ జిల్లాల స్థాయిలో నిర్వహించిన ఈ సమావేశంలో సేవా కార్యక్రమాల విస్తరణ, క్లబ్‌ల సమన్వయం, భవిష్యత్ కార్యచరణపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం జిల్లా పరిధిలోని వివిధ వాసవి క్లబ్‌ల అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. సమావేశం ఆత్మీయ వాతావరణంలో కొనసాగింది.

## పెండింగ్ ఐఆర్ పిఆర్‌సి డిఎ'పై ప్రభుత్వంతో చర్చలు వేగవంతం చేస్తాం

- కెఆర్ సూర్యనారాయణ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు




**విజయవాడ, జూలై 19, ప్రభాతవార్త**

విజయవాడలో ఆదివారం రాష్ట్రస్థాయి సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు కెఆర్‌సి నారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ 8ఏళ్ల ఆర్థిక బకాయిలు, 3 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఐఆర్ పిఆర్‌సి డిఎ'లను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్, చర్చలు వేగవంతం చేస్తాం. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో ఐక్యవేదిక జిల్లా కార్యవర్గాలు ఏర్పాటు చేయటం పట్ల ఓపిఎస్'కి 2004 సెప్టెంబర్ ముందు నియమితులైన 11 వేల మందికి ఓపిఎస్ వర్తింపజేసిన ప్రభుత్వ నిర్ణయాన్ని హర్షం వ్యక్తం చేస్తున్నామని సెప్టెంబరు 1న ఎపిసిపిఎస్ఈఎ ఆధ్వర్యంలో జరిగే "సిపిఎస్ బ్లాక్ డే ఛలో గుంటూరు"ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యలపై ప్రభుత్వ ఉన్నతాధికారులను కలిసి వినతిపత్రాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో బాజీ పఠాన్ సెక్రటరీ జనరల్, ఐక్యవేదిక ఆర్థిక కార్యదర్శి ఎం.రమేష్ కుమార్, నరసింహారావు, మాగంటి శ్రీనివాసరావు, సత్యనారాయణ, వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల రాష్ట్ర అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

# మేం చెప్పినంత ఇస్తావా? చస్తావా?..

- వడ్డీ వ్యాపారుల హెచ్చరికలు



**విజయవాడ, జూలై 19, ప్రభాతవార్త**

గతంలో ఒక ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలో సీనియర్ సేల్స్ మేనేజర్‌గా పనిచేసినపుడు వ్యాపార అవసరాలకు 2024 జూలై నుంచి 2025 సెప్టెంబర్ మధ్య కానూరుకు చెందిన సుంకర ఫాల్గుణ సాయి నరేన్ (సుంకర సాయి) వద్ద రూ.96లక్షలు తీసుకున్న అప్పు అసలు, వడ్డీ కలిపి విడతల వారీగా రూ.1.90 కోట్లు చెల్లించినా మేం చెప్పినంత ఇస్తావా? చస్తావా? అని తీవ్ర హెచ్చరికలు చేస్తున్నారని మోతె గోపరాజుఆవేదనతో ఆరోపించారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ2026 ఏప్రిల్ 11న సుంకర సాయి తన అనుచరులతో ఇంటికి వచ్చి దౌర్జన్యంగా నా భార్యకు చెందిన ఖాళీ చెక్‌బుక్‌తో పాటు నాలుగు ఖాళీ ప్రామిసరీ నోట్లపై సంతకాలు చేయించుకుని తీసుకెళుతూ నీ కుటుంబం తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని బెదిరించారన్నారు.తనపై తన కులంపై అవమానకరమైన వాట్సాప్ స్టేటస్‌లు పెడుతున్నారని, సుంకర సాయి, నిమ్మగడ్డ తిరుపతిరావు, వెల్ది వెంకట సుభాష్ గణేష్ చౌదరి తదితరుల వల్ల తనకు తన కుటుంబానికి ప్రాణహాని ఉందన్న విషయమై ముఖ్యమంత్రి కార్యాలయం, డిజిపి కార్యాలయాలకు స్పీడ్ పోస్టు ద్వారా ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.పోలీసులు నేను చెప్పేది పట్టించుకోకుండా వారికే వత్తాసు పలుకుతున్నారు.పోలీసు ఉన్నతాధికారులు స్పందించి తనపై తప్పుడు కేసులు నమోదు కాకుండా చూడడంతో పాటు తనకు తన కుటుంబానికి రక్షణ కల్పించి న్యాయం చేయాలని గోపరాజు విజ్ఞప్తి చేశారు.

## ఐడిబిఐ బ్యాంక్‌కు తొలి త్రైమాసికంలో నికర లాభం

**విజయవాడ, జూలై 19, ప్రభాతవార్త**

ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్ (ఐడిబిఐ బ్యాంక్) 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో మెరుగైన ఆర్థిక ఫలితాలను నమోదు చేసింది. బ్యాంక్ డైరెక్టర్ల బోర్డు ముంబైలో జరిగిన సమావేశంలో జూన్ 30, 2026తో ముగిసిన త్రైమాసికానికి సంబంధించిన ఆర్థిక ఫలితాలను ఆమోదించింది. ఈ త్రైమాసికంలో బ్యాంకు రూ.2,115 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంతో పోలిస్తే ఇది 9 శాతం వృద్ధిని నమోదు చేసింది.

## బిసి రిజర్వేషన్ల కోసం ఆగస్టు 5,6న ఛలో ఢిల్లీ.. ఓబీసీ సంక్షేమ సంఘం



**విజయవాడ, జూలై 19, ప్రభాతవార్త**

అఖిలభారత ఓబిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ స్థానిక సంస్థలు, అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బిసి'లకు 34 రిజర్వేషన్లు అమలు చేసేందుకు రాబోయే వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లో రాజ్యాంగ సవరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. అలాగే రాజ్యాంగ సవరణ బిల్లు ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం 34%బిసి రిజర్వేషన్లు లేదా ఎన్‌టిఆర్ ఆశయం మేరకు జనాభా దామాషా ప్రకారం 44% రిజర్వేషన్లు అమలు చేయాలి. ప్రధానిపై ఒత్తిడి కేంద్ర సంకీర్ణ ప్రభుత్వ భాగస్వామిగా సిఎం చంద్రబాబు ప్రధాని మోడీపై ఒత్తిడి తేవాలి.ఎన్నికల వాయిదా 2027 మార్చిలో కుల గణన వరకు స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో 5న పార్లమెంట్ ముట్టడి "ఛలో ఢిల్లీ"6న ఢిల్లీలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అఖిలపక్ష బిసి ప్రజాప్రతినిధులు, మేధావులు,డాక్టర్ ఈపనగండ్ల శ్రీనివాస్, రాథోడ్ సుజన్ సింగ్, దేవరకొండ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## సాయికృపా క్లీనిక్‌లో విజయవంతంగా ఉచిత వైద్య శిబిరం



**విజయవాడ, జూలై 19, ప్రభాతవార్త**

పూర్ణానందంపేట, సి.కె రెడ్డి రోడ్డులో గల సాయికృపా క్లీనిక్‌లో డాక్టర్ సిహెచ్ వెంకటేశ్వరరావు సౌజన్యంతో పల్లెం పెద్దేశ్వరరావు హార్ట్ కేర్ సెంటర్ ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ పల్లెం ఆకాష్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో డా॥ఎన్‌టిఆర్ వైద్య సేవా పథకం ద్వారా ఉచితంగా యాంజియోగ్రామ్ తదితర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ వైద్య శిబిరంలో పరిసర ప్రాంతీయులు, నగర ప్రజలు అత్యధికంగా పాల్గొని వైద్య సేవలు పొందారు. కార్యక్రమంలో డాక్టర్ సిహెచ్ వెంకటేశ్వరరావుతో పాటు డాక్టర్ పల్లెం ఆకాష్ మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## దెబ్బతిన్న పైపులైన్.. లీకవుతున్న సాగర్ నీరు



**కొనకనమిట్ల, జూలై 19, ప్రభాతవార్త**

మండల కేంద్రమైన కొనకనమిట్ల యూనియన్ బ్యాంకు దగ్గర సాగర్ నీటి మెయిన్ పైపు లైన్ పగిలి రెండు రోజుల నుంచి లీకవుతూ నీరు వృధాగా పోతుంది. ఎస్సీ కాలనీలకు నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. దీంతో తాగునీటికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. బబుల్స్ నీటిని డబ్బులు పెట్టి కొనుగోలు చేసి తాగుతున్నామని కాలనీ వాసులు వాపోతున్నారు. కాలనీకి వెళ్లే పైపులైన్ పలుచోట్ల దెబ్బతినిపోయింది. దీంతో నీటి సరఫరా అంత మాత్రమే అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి లీక్ అవుతున్న పైపులైనుకు మరమ్మత్తులు చేసి సాగర్ నీటిని యధాతథంగా సర్పంచ్ చేయాలని కోరుతున్నారు.

# చల్లంగ చూడమ్మా.. గంగమ్మ



**తాళ్లూరు, జూలై 19,ప్రభాతవార్త**

మండలం లోని తూర్పు గంగవరం పంచాయతీ పరిధిలోని సోమవరప్పాడు గ్రామంలో వెలిసిన జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పుణ్య క్షేత్రం గుంటి గంగా భవానీ అమ్మవారికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారిలు మెట్టెల బాలరాజు, పుచ్చకాయల విజయ లక్ష్మి అమ్మవారి మూల విరాట్ ను ప్రత్యేకంగా అలంకరించారు.ఆలయ అర్చకుడు ఎన్. కామేశ్వర శర్మ, అమ్మవారికి అభిషేకాలు,కుంకుమార్చన,గోత్రనామాలు పూజలు నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యాలు,పొంగళ్లు సమర్పించారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరొందిన అమ్మవారిని దర్శించుకోవడానికి జిల్లాతో పాటు పలు జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.భక్తులు పొంగళ్లు పెట్టి,జంతు బలులిచ్చి మొక్కులు చెల్లించారు.ఆలయ ప్రక్కన ఉన్న పుట్ట,నాగ శిలలకు భక్తులు పూజలు చేశారు. అమ్మవారి దర్శించుకున్న భక్తులకు ఆలయ అన్నదాన సత్రంలో అన్నదానం చేశారు.భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయచైర్మన్ సానె సురేష్,ఈవో నర్రా నారాయణరెడ్డి, ఆర్‌ఏ కాటూరి ప్రసాదు,సిబ్బంది పర్యవేక్షించారు.

# చిన్నారులకు ఎమ్మెల్యే ఆశీర్వాదం



**కందుకూరు జూలై 19, ప్రభాతవార్త**

కందుకూరు పట్టణంలోని శ్రీ సీతారామ ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆదివారం ఉలవపాడు మండలం కరేడు గ్రామానికి చెందిన పేరూరిరాము సౌభాగ్యలక్ష్మి దంపతుల కుమారుడు, కుమార్తెల నూతన వస్త్రధారణ కార్యక్రమం నిర్వహించారు.ఇందులో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై చిన్నారులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతోపాటు ఆర్యవైశ్య ప్రముఖులు గుర్రం వెంకట్రావు,కోట సురేంద్ర, గుర్రం అల్లూరయ్య,గుర్రం వెంకటేశ్వర్లు, గుర్రం వెంకటసుబ్బయ్య, కోట వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు .

## వెలిగండ్ల విద్యార్థులకు షైనింగ్ స్టార్ అవార్డులు



**వెలిగండ్ల, జూలై 19, ప్రభాతవార్త**

వెలిగండ్ల మండలంలోని వివిధ పాఠశాలల్లో చదువుకుని పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనపరిచిన ఐదుగురు విద్యార్థులు షైనింగ్ స్టార్ అవార్డులకు ఎంపికైనట్లు మండల విద్యాశాఖాధికారులు దాస్ ప్రసాద్, దేవిరెడ్డి రామిరెడ్డి తెలిపారు. ఈ నెల 20వ తేదీన జిల్లా కలెక్టర్ విజయ సునీత చేతుల మీదుగా విద్యార్థులకు అవార్డులు ప్రధానం చేయనున్నట్లు వారు వెల్లడించారు. పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించి ప్రతిభ కనపరిచిన విద్యార్థులుగా జడ్పీహెచ్‌ఎస్ వెలిగండ్ల విద్యార్థులు సీహెచ్ అమృత(585 మార్కులు), జి.రిషిత(580మార్కులు), ఎస్.సిప్రహో' (584), జడ్పీహెచ్‌ఎస్ మొగుళ్లూరు నుండి విద్యార్థి పల్నాటి శివకుమార్, జడ్పీహెచ్‌ఎస్ ఇమ్మడిచెరువు నుండి బి.రాజేశ్వరి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ విద్యార్థులు తమ విద్యాభ్యాసంలో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రులు, పాఠశాలలు, మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. వారి భవిష్యత్తు విజయవంతంగా ఉండాలని అభినందనలు

## రామాయపట్నం పోర్టును పరిశీలించిన విపక్షాల నేతలు

- పోర్టు ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలి

- ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తాం - సీపీఐ,వైసీపీ,ఆమ్ ఆద్మీ



**కందుకూరు జూలై 19, ప్రభాతవార్త**

కందుకూరు నియోజకవర్గంలోని రామాయపట్నం పోర్టును ప్రైవేటీకరణనునిలుపుదల చేయాలని విపక్షనేతలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని వైసీపీ,సీపీఐ,ఆమ్ ఆద్మీ పార్టీనేతలు బుర్రా మధుసూదన్‌యాదవ్,బి.సురేష్‌బాబు, నేతి మహేశ్వరరావులు పలు వేదికల్లో ప్రభుత్వానికి విజ్ఞప్తిచేస్తున్నారు. రామాయపట్నం పోర్టు ప్రైవీటీకరణ అంశం కందుకూరు ప్రాంతంలో చర్చనీయాంశమైంది. పీపీపీ పద్ధతిలో ప్రైవేటీకరణకు ప్రభుత్వం జీవో నం.53ను జారీచేసింది.ప్రైవేటీకరణతోనే లాభదాయకమని అధికారపక్షం,లేదని విపక్షాలు విమర్శలు ప్రతివిమర్శలు పలు సామాజిక మాధ్యమాల ద్వారా గుప్పిస్తున్నారు.ఇందులోబాగంగా ఈనెల 18న శనివారం వైసీపీనేతలు మాజీ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి,మాజీ ఎమ్మెల్యేలు బుర్రా మధుసూదన్‌యాదవ్, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తదితరులు రామాయపట్నం పోర్టు ముట్టడి కార్యక్రమం చేపట్టారు.వీరిని పోలీసులు అడ్డుకున్నారు.కేసులు బనాయించారు.అదేవిధంగా ఆదివారం సీపీఐ నేత బూసి సురేష్,ఆమ్ ఆద్మీపార్టీనేత నేతి మహేశ్వరరావులు సైతం పోర్టుప్రాంతాన్ని సందర్శించారు.స్థానికులుతో మాట్లాడారు.పోర్టుప్రైవేటీకరణను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు పలు గ్రామస్తులు వివరించారు.

### 50 ఏళ్ల పాటు కారు చౌకగా లీజుకు :



రామాయపట్నం పోర్టు పనులు గత ప్రభుత్వ హయాంలో 95శాతం పూర్తయ్యాయని వైసీపీ నేతలు బుర్రా మధుసూదన్‌యాదవ్‌తోపాటు పలువురు వివరిస్తున్నారు.అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు దురాశతో సుమారు 850ఎకరాలలో సుమారు రూ.5వేల కోట్లు విలువైన పోర్టును కేవలం రూ.1500కోట్లుకు 50ఏళ్లకు కారుచౌకగా ప్రైవేటు పరం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.అదేవిధంగా రైతుల నుంచి సేకరించిన పొలాలను ఎకరాకి ఏడాదికి ఒక రూపాయ చొప్పున లీజుకు ఇస్తున్నారని వివరిస్తున్నారు.కేవలం 5శాతం పనులు పూర్తిచేసి ప్రభుత్వమే ఈ పోర్టును నిర్వహిస్తే ఈ ప్రాంతం అభివృద్ధిచెందుతుందన్నారు. ఈ పోర్టుతోపాటు బీపీసీఎల్,ఇండో సోలార్ తదితర సంస్థల ఆధ్వర్యంలో అనేక పరిశ్రమలు ద్వారా ఈ ప్రాంత ప్రజలకు ప్రత్యక్షంగా పరోక్షంగా ఉద్యోగ ఉపాధి లభిస్తుందని,తద్వారా కందుకూరు ప్రాంతం పారిశ్రామిక హబ్‌గా మారడానికి అవకాశం ఉందని వివరిస్తున్నారు.అదే ప్రైవేటుపరం అయితే వారి స్వార్ధానికి బలైఅనేక కష్టనష్టాలకు గురవుతామని వివరించారు. అయితే ఈ విషయమై ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ పీపీపీ పద్ధతిలోనే ప్రభుత్వానికి ప్రజలకు లాభదాయకంగా ఉంటుందంటున్నారు.వైసీపీ హయాంలో కేవలం 50శాతం పనులే పూర్తిచేశారన్నారు. ఏడాదికి 1500కోట్లకి పైగా ప్రభుత్వానికి చెల్లిస్తారన్నారు.పైగా సర్వహక్కులు ప్రభుత్వానికి ఉంటాయని వివరిస్తున్నారు.

### ప్రైవేటీకరణ ఆపండి - సీపీఐ



ఈ నేపధ్యంలో ఆదివారం సీపీఐ నేత సురేష్,ఆమ్ ఆద్మీనేత నేతి మహేశ్వరరావులు పోర్టు ప్రాంతాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా ఆ ప్రాంతంలోని ప్రజలతో పలు అంశాలపై నాయకులు చర్చించారు.ఆ ప్రాంతంలోని అన్ని వర్గాల ప్రజలు రామాయపట్నం పోర్టు ప్రైవేటు అంగీకరించే ప్రసక్తి లేదని తమ అభిప్రాయాలను నాయకులు వద్ద విన్నవించారు.ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ తమ ప్రాంతం అభివృద్ధి చెందితే తమ బిడ్డల భవిష్యత్తు బాగుంటుందని రైతులు తమ భూములును ప్రభుత్వానికి ఇచ్చారన్నారు.అయితే ప్రభుత్వం రైతులకు మాయమాటలు చెప్పి భూములు తీసుకున్న తర్వాత పోర్టును ప్రైవేటీకరణ చేసి వారికి అన్యాయం చేస్తుందన్నారు.వెనకబడిన ప్రకాశం జిల్లా రామాయపట్నం పోర్టుతో ప్రజలకు, కార్మికులకు యువతకు ఉపాధి లభిస్తుందని భావిస్తున్న తరుణంలో పిడుగుపాటుగా ప్రైవేటీకరణ అంశం తెరమీదుగా తీసుకురావడం దుర్మార్గపు చర్య అన్నారు.సుమారు రూ.20వేల కోట్లతో పోర్టు సమీపంలో పరిశ్రమలు పెట్టే సంస్థలు తమ స్వార్ధం,ఆదాయం ప్రయోజనాలు చూసుకుంటాయే తప్ప,ప్రజలకు, యువతకు, కార్మికులకు ఉపాధి ఎక్కడ కల్పిస్తారని ప్రశ్నించారు.ఈ నేపధ్యంలో ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని పేర్కొన్నారు.లేని పక్షంలో సిపిఐ ప్రజా ఉద్యమం చేపడుతుందని హెచ్చరించారు.ప్రజా సంఘాల నాయకులు మహేశ్వరరావు మాట్లాడుతూ వెనుకబడిన ప్రకాశం జిల్లా అభివృద్ధికి తోడ్పాటు నిచ్చే రామాయపట్నం పోర్టును ప్రైవేటీకరణ చేస్తే జిల్లాలోని ప్రజలు సహించే ప్రసక్తే లేదని తగిన గుణపాఠం చెబుతారని అన్నారు.

20-7Pg5_20-7Pg5.qxd 19/Jul/26 10:45 PM Page 1



# జమ్ము-కాశ్మీర్‌లో వరద విలయం!

## ఎడతెగని వర్షాలతో 17 మంది మృతి, పలువురు గల్లంతు

## రజౌరి, పూంఛ్ జిల్లాల్లో పరిస్థితి మరింత తీవ్రం

## అమర్‌నాథ్, వైష్ణోదేవి యాత్రకు బ్రేక్

## ఇళ్లలో పారుతున్న వరదనీరు, కొట్టుకు పోయిన వాహనాలు





**శ్రీనగర్,జులై 19:** జమ్మూకశ్మీర్ లో భారీ వర్షాలు, వరదలుబీభత్సం సృష్టించాయి. ఎడతెగని వర్షా ల వల్ల రాజౌరీ, పూంచ్ జిల్లాల్లో మెరుపు వరదలు సంభవించాయి. రాజౌరీలో నదులు పొంగిపొర్ల డంతో పలు ప్రాంతాలను వరద ముంచెత్తింది. కొత్త బస్టాండ్ పూర్తిగా నీట మునిగింది. ఈ వరదలవల్ల 17 మంది మృతిచెందారు. పలువురు గల్లంతయ్యారు. మరికొందరు తీవ్రంగా గాయ పడ్డారు. శనివారం సాయంత్రం నుంచి కురిసిన భారీ వర్షాలకు ఆదివారం వరదలు పోటెత్తాయి. ఈ ఘటనలో నలుగురు మృతిచెందగా మరో ఐదుగురు గల్లంతయ్యారు. మృతుల్లో భారీ వర్షాల కారణంగా పూంచ్ జిల్లాలో ఇల్లు కూలి ముగ్గురు మరణించగా రాజౌరిలో కొండచరియలు విరిగి పడటం, ఆకస్మిక వరదలు, భారీ వర్షాలతో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు గల్లంతైన ఐదుగురి కోసం సహాయక బృందాలు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. వందలాది మందిని అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. రాజౌరి జిల్లాలోని దర్హాలి, ఖండ్లీ, సుక్తోహ్, జమోలా నదులతో సహా అన్ని ప్రధాన నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. వాటిలో చాలా వరకు ప్రమాదకర స్థాయికి చేరి అనేక లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. ముఖ్యంగా రాజౌరి పట్టణాన్ని వరదనీరు ముం చెత్తింది. దర్హాలి నదికి వరద పోటెత్తగా బేలా కాలనీ సమీపంలోని రక్షణ గోడ కూలిపోయింది. దాంతో కొత్త బస్టాండ్ ఆవరణలోకి వరద నీరు దూసుకొచ్చి డజన్ల కొద్దీ వాహనాలు కొట్టుకుపో యాయి. అబ్దుల్లా వంతెన సమీపంలోని మురికి వాడ కూడా తీవ్రంగా దెబ్బతింది. ఆ ప్రాంతంలోకి వరదనీరు ప్రవేశించడంతో 50 కిపైగా కుటుం బాలను అధికారులు ఖాళీ చేయించారు. తారిఖ్ వంతెన సమీప ప్రాంతాన్నీ వరద నీరు ముం చెత్తింది. దాంతో పోలీసులు, అత్యవసర సిబ్బంది స్థానికులను నదీ తీర ప్రాంతానికి దూరంగా తర లించారు. అలాగే నదీ తీరం, లోతట్టు ప్రాంతాల ప్రజలు వెంటనే ఇళ్లను ఖాళీ చేయాలని అధి కారులు సూచించారు. జమ్మూకశ్మీర్ వ్యాప్తంగా జూలై 23 వరకు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిశాయి. గత 24 గంటల్లో రియాసిలో అత్యధికంగా 106 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. రాజౌరిలో 103 మిల్లీమీటర్లు, ఉధంపూర్‌లో 101.6 మిల్లీ మీటర్లు,కత్రాలో 85 మిల్లీమీటర్లు, పూంచ్‌లో 77 మిల్లీమీటర్లు, బటోటేలో 57.5 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. దీంతో అమర్‌నాథ్ యాత్రకు బ్రేక్ పడింది. ఆదివారం నుంచి అధికారులు ఈ యాత్రను నిలిపివేశారు. బేస్ క్యాంపుల నుంచి భక్తులు ఎవరినీ కూడా యాత్రకు అనుమతి ఇవ్వట్లేదు. బేస్ క్యాంపుల్లో తమకు కేటాయించిన చోటే ఉండిపోవాలంటూ ఆదేశాలు ఇచ్చారు. అమర్‌నాథ్‌తో పాటు ప్రఖ్యాత వైష్ణోదేవి అమ్మవారి యాత్ర కూడా స్తంభించిపోయింది. తదుపరి ఆదేశాలు వెలువడేంత వరకూ ఈ రెండింటినీ పునరుద్ధరించబోమని తెలిపారు. ఈ వాతావరణ మార్పుల నేపథ్యంలో జమ్మూ డివి జనల్ కమిషనర్ రమేష్ కుమార్ మార్గదర్శకాలు విడుదల చేశారు. జమ్మూ నుంచి కాశ్మీర్ వైపునకు యాత్రీకులను రానివ్వట్లేదు. ఇతర ప్రాంతాల వైపు నుంచి వచ్చే భక్తులు ప్రస్తుతానికి జమ్మూ, ఉధం పూర్, రామ్ బన్‌లలో ఏర్పాటు చేసిన వసతి కేంద్రాల వద్దే తలదాచుకోవాలి. తదుపరి ఆదేశాలు వెలువడిన తర్వాతే వైష్ణోదేవి యాత్రకు అనుమతి లభిస్తుందని ఈ మార్గదర్శకాల్లో పొందుపరిచారు. బాల్తల్ బేస్ క్యాంప్‌లోనే అమర్ నాథ్ యాత్రీకు లను నిలిపివేశారు. బంగాళాఖాతం, అరేబియా సముద్రాల నుంచి వస్తున్న తీవ్ర తేమ గాలుల ప్రభావంతో జమ్మూ కాశ్మీర్‌లో నేటి నుంచి 23 వరకు కుండపోత వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం ప్రకటించింది. ప్రత్యేకించి 21 నుంచి 23 మధ్య కాశ్మీర్‌లో అతి భారీ వర్షాలు పడొచ్చని, 20నుంచి 23 మధ్య జమ్మూ రీజియన్ లోని రియాసీ, ఉధంపూర్ జిల్లాల్లో రికార్డు స్థాయి వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని స్పష్టం చేసింది.



# సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ ఇరాన్‌లో లేరు?

## అధికార పోరుతో ఉద్రిక్త పరిస్థితులు

**దుబాయి,జులై 19:** ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖామెనీ ప్రస్తుతం ఇరాన్‌లో లేరని సౌదీ అరేబి యాకు చెందిన వార్తా సంస్థ అల్‌హదాత్ ఇజ్రా యెల్ భద్రతా వర్గాల సమాచారంతో సంచలన కథనం ప్రచురించింది. ఫిబ్రవరి 28న అమెరికా ఇజ్రాయెల్ సంయుక్త దాడిలో మాజీ సుప్రీం లీడర్ అయతొల్లా అలీఖామెనీ మరణించగా, అదే దాడిలో మొజ్తబా ఖామెనీ తీవ్రంగా గాయపడి నట్లు సమాచారం. అనంతరం ఆయన ఇరాన్ కొత్త సుప్రీం లీడర్‌గా బాధ్యతలు స్వీకరించినప్పటికీ, యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు బహిరంగంగా ఎక్కడా కనిపించలేదు. ప్రపంచం తో ఆయన రాతపూర్వక ప్రకటనల ద్వారానే సంభాషిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే, మొజ్తబా ఖామెనీ గాయాల నుంచి కోలుకుంటున్నారని, అమెరికాతో జరుగుతున్న చర్చలకు కూడా ఆయనే మార్గనిర్దేశం చేస్తున్నారని ఇరాన్ అధికారులు చెబుతున్నారు. కానీ అల్‌హదాత్ కథనం ప్రకా రం, ఖమేనీ పేరుతో వెలువడుతున్న అధికారిక ప్రకటనలను కొత్తగా నియమితులైన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ చీఫ్ అహ్మద్ వహీదితో పాటు ఆ సంస్థకు చెందిన ఇతర ఉన్నతాధికారులే రూపొందిస్తున్నారని ఇజ్రాయెల్ భద్రతా వర్గాలు ఆరోపించాయి. ఇజ్రాయెల్ భద్రతా వర్గాల ప్రకా రం, ఇరాన్‌లో అంతర్గత విభేదాలు తీవ్రస్థాయికి చేరుకున్నాయని, అవి ఐఆర్‌జీసీ ఉనికికే ముప్పు గామారుతున్నాయని పేర్కొన్నారు. ఇరాన్‌పై మరోసారి దాడులు జరిగితే అందులో ఇజ్రాయెల్ పాల్గొనాలని అమెరికా కోరుకోవడం లేదని కూడా ఆవర్గాలు తెలిపాయి.

మొజ్తబా ఖామెనీ ప్రజలకు కనిపించకుండా ఉండటంతో ఇరాన్ రాజకీయాల్లో అధికార పోరు ముదురుతున్నట్లు అంతర్జాతీయ మీడియా సంస్థ నివేదించింది.

## ట్రంప్ సంతకానికే విలువలేదు: మొజ్తబా ఖమేనీ

**టెహ్రాన్,జులై 19:** అమెరికాఅధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకానికి ఎలాంటి విలువ లేదని ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ విమర్శించారు. ఇటీవల ఇరాన్‌అమెరికా మధ్య కుదిరిన శాంతి అవగాహన ఒప్పందం (ఎంఓయూ)ను అమెరికానే ఉల్లంఘించిందని ఆరోపించారు. దీంతో ట్రంప్ సంతకం విలువలేనిదనే విషయం మరోసారి రుజువైందన్నారు. ఇరాన్‌ప్రజలకు విడుదల చేసిన సందేశంలో ఖమేనీ ఈవ్యాఖ్యలు చేశారు. జూన్ 18న ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మధ్య కుదిరిన ఎం ఓయూను ఉల్లంఘిస్తోందని విమర్శించారు.



# అమెరికాను కమ్మిన కెనడా కార్చిచ్చు పొగ

## ఆ దేశంపై అదనపు సుంకాలు విధిస్తాం: ట్రంప్

**న్యూయార్క్, జులై 19:** వాతావరణ మార్పుల వల్ల అమెరికా, కెనడాల్లో కార్చిచ్చులు రేగుతూనే ఉన్నాయి. అదుపులోని అడవి మంటల వల్ల అమెరికాలో మిన్నెసోటా, ఇల్లినోయీ, మిషిగాన్, డెట్రాయిట్‌తోపాటు పలు ప్రాంతాల్లో గాలి నాణ్యత క్షీణించింది. అమెరికా రాజధాని నగరం వాషింగ్టన్‌ను కూడా దట్టమైన పొగ కమ్మేసింది. ప్రజలు, ముఖ్యంగా గుండె లేదా ఊపిరితిత్తుల వ్యాధులు ఉన్నవారు, వృద్ధులు, పిల్లలు గాలి నాణ్యత మెరుగుపడే వరకు బయటకు వెళ్లరాదని అధికారులు సూచించారు. చాలా రాష్ట్రాల్లో శని వారం వరకు ప్రమాదకర పరిస్థితులు కొనసాగు తాయన్నారు. కార్చిచ్చుల ద్వారా వ్యాపిస్తున్న పొగ, మంటలకు కెనడా అటవీ నిర్వహణ లోపాలే కారణమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విమర్శించారు. కెనడాపై అదనపు సుంకాలను విధిస్తామని హెచ్చరించారు. ట్రంప్ వ్యాఖ్యలపై కెనడా ప్రభుత్వం మొదట్లో స్పం దించలేదు. గతంలో కార్చిచ్చులను ఎదుర్కో వడంలో అమెరికాకు కెనడా సహాయం చేసిందని అంటారియో రాష్ట్ర నేత డగ్‌ఫోర్డ్ గుర్తు చేశారు. 'రాజకీయ నాయకులు ఫిర్యాదులు చేయడం మాని పోరుగువారికి సహాయం చేయడం మం చిది. మనం మన అమెరికన్ స్నేహితుల కోసం గతంలో కచ్చితంగా అదే పని చేశాం' అని ఫోర్డ్ చెప్పారు. కెనడాలోని ఉత్తర అంటారియోలో సు మారు 190 చోట్ల కార్చిచ్చులు, మంటలు వ్యా పించాయి. మంటలు రేగుతున్న ప్రాంతాల నుంచి ప్రజలను ఖాళీ చేయించారు. మరికొన్ని ప్రాంతాల వారిని ఖాళీ చేసే అవకాశం ఉంది.

# వర్షాలకోసం గాడిదలకు గులాబ్‌జామూన్

## మధ్యప్రదేశ్‌లో వింత సాంప్రదాయం



**భోపాల్,జులై 19:** మధ్యప్రదేశ్ రాజధాని భోపా ల్‌లో రుతుపవనాల రాక ఆలస్యం కావడంతో స్థానికులు వర్షాల కోసం ఒక వింత ఆచారాన్ని ఆశ్రయించారు. నగరంలో తీవ్రమైన ఉక్కపోత, పొడివాతావరణం నెలకొనడంతో వానలు పడా లని కోరుకుంటూ గాడిదలకు గులాబ్ జా మూన్లు తినిపించే వినూత్న కార్యక్రమాన్ని చేప ట్టారు. స్థానికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి గాడిదలకు ఎంతో ఇష్టంగా ఈ భారతీయ సం ప్రదాయ స్వీటును తినిపించారు. దీనికి సంబం ధించిన వీడియోలు, ఫోటోలు సోషల్ మీడి యాలో విపరీతంగా వైరల్ కావడంతో దేశవ్యా ప్తంగా నెటిజన్లు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు సమయానికి పడకపోయినా, రుతు పవనాలు బలహీనపడినా ఈ వింత ఆచారాన్ని పాటించడం ఇక్కడ ఎప్పటి నుంచో వస్తున్న ఒక సంప్రదాయం. ఇలా జంతువులకు తియ్య టి పదార్థాలు తినిపించడం వల్ల వాన దేవుడైన ఇంద్రుడు ప్రసన్నమై, సకాలంలో వర్షాలు కురుస్తాయని ప్రజల గట్టి నమ్మకం. వర్షాలు ఆలస్యమైనప్పుడు మా పెద్దలు ఈ సంప్రదాయాన్ని పాటించడం మేము చిన్నప్పటి నుండి చూస్తున్నాం. అందుకే గాడిదలకు స్వీట్లు తినిపించి మంచి వర్షాలు పడాలని ప్రార్థిం చామని ఈ వేడుకలో పాల్గొన్న ఒకరు తెలి పారు. రుతుపవనాల గమనానికి వాతావరణ మార్పులే కారణమని శాస్త్రవేత్తలు చెబుతున్నప్ప టికీ ఇలాంటి సంప్రదాయాలు భారతదేశంలోని అనేక ప్రాంతాల్లో ప్రజల జీవన విధానంలో అంతర్భాగంగా మారిపోయాయి. ఈవింత పూజ తో వానదేవుడు కరుణిస్తాడో లేదో చూడాలి కానీ, ప్రస్తుతానికి మాత్రం భోపాల్‌లోని గాడ దిలు గులాబ్ జామూన్ల విందును ఆరగిస్తూ హుషారుతో గంతులేస్తున్నాయి.

# రామమందిర విరాళాల చోరీపై సమగ్ర విచారణ జరపాలి

## శ్రీరామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ వ్యవహారాలపైనా దర్యాప్తు చేయించాలి

## ప్రధాని మోడీకి రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే సంయుక్త లేఖ



**న్యూఢిల్లీ, జులై 19:** శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ యొక్క 'ఆర్థిక వ్యవహారాలపై స్వతంత్ర, సమగ్ర విచారణ' జరపాలని కోరుతూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి సంయుక్త లేఖ రాశారు. పార్ల మెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభం కావ డానికి ఒక్క రోజు ముందు ఆదివారం ఈ లేఖ విడుదల చేశారు. దీంతో పార్లమెంటులో వాడివేడి చర్చలకు వేదిక కానున్నట్లు కనిపిస్తోంది. 'శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్రట్రస్ట్‌లో వేల కోట్ల రూపా యల చోరీ జరగడం మీకు తెలిసిన విషయమే. తమ కష్టార్జితాన్ని విశ్వాసం, భక్తి, నమ్మకంతో విరాళంగా ఇచ్చిన లక్షలాది మంది భక్తులు ఈ చోరీతో మోసపోయామని భావిస్తున్నారు' అని ఆ లేఖలో ప్రతిపక్ష నాయకులు పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రధాన మంత్రి ఈ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసినప్పటికీ, దాని సభ్యులను పూర్తిగా ప్రభుత్వమే ఎంపిక చేసిందని కాంగ్రెస్ నేతలు తెలిపారు. "ట్రస్ట్ సభ్యులు రాష్ట్రీయ స్వ యంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్), విశ్వ హిందూ పరిషత్ (విహెచ్‌పి), వాటి అనుబంధ సంస్థలతో సంబంధం కలిగి ఉన్నారన్న విషయం బహిరంగ రహస్యం. అప్రతిష్టపాలైన దాని మాజీ ప్రధాన కార్యదర్శి కూడా మీకు సన్నిహితుడే. ఇంతటి నేరం జరిగినప్పుడు మీరు మౌనంగా ఉండటం ఆమోదయోగ్యం కాదు. జవాబుదారీతనాన్ని, నష్టపరిహారాన్ని (లేదా నిధుల పునరుద్ధరణను) నిర్ధారించడం మీ బాధ్యత' అని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. నగదు, బంగారం, వెండితో సహా అన్ని కానుకల నిర్వహణతో సహా ట్రస్ట్ ఆర్థిక వ్యవహారాలపై 'స్వతంత్ర, సమగ్ర విచారణకు ఆదేశించాలని' మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ ప్రధాన మంత్రిని కోరారు. 'తమ కానుకలు ఎలా వినియోగించబడ్డాయో ప్రతి భక్తుడికి తెలిసేలా' విచారణ ఫలితాలు, ట్రస్ట్ ఖాతాలను బహిర్గతం చేయాలని కూడా వారు డిమాండ్ చేశారు.



# నాలుగుదేశాల ఎంబసీల్లో కాన్సులర్ సేవలు నిలిపివేత

**న్యూఢిల్లీ, జూలై 19:** అబుదాబి, కువైట్, సింగ పూర్, కాన్‌బెర్రాలోని భారత రాయబార కార్యా లయాల్లో పాస్‌పోర్ట్, వీసా, కాన్సులర్ సేవలు యథావిధిగా కొనసాగాలా లేదా అన్న అంశంపై సుప్రీంకోర్టు సోమవారం కీలక నిర్ణయం ప్రకటిం చనున్నది. ఈ సేవలు నిర్వహిస్తున్న కాంట్రా క్టును ఢిల్లీ హైకోర్టు రద్దుచేయడంతో ఆయా దేశాల్లో సేవలు దాదాపు స్తంభించిన పరిస్థితి నెలకొన్నట్లు కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు కేం ద్రంతరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహ తా వాదనలు వినిపించారు. హైకోర్టు తీర్పు కార ణంగా విదేశాల్లోని భారతీయులకు పాస్‌పోర్ట్, వీసా సేవలు అందించడం తీవ్రంగా దెబ్బతిన్న దని, కొత్త సేవల సంస్థను ఒక్కరోజులో నియ మించడం సాధ్యం కాదని కోర్టుకు వివరించారు. ఈ నేపథ్యంలో కేంద్రం దాఖలు చేసిన అప్పీ ల్‌పై విచారణను జులై 20కు సుప్రీంకోర్టు నిర్ణ యించింది. జులై 15న ఢిల్లీ హైకోర్టు కేరళకు చెందిన అల్వింద్ టూర్స్ అండ్ ట్రావెల్స్ సం స్థకు అప్పగించిన సిపివి సేవల కాంట్రాక్టును రద్దు చేసింది.

# న్యూయార్కు వస్తే నెతన్యాహును అరెస్టుచేస్తాం: మేయర్ మమ్దానీ

**న్యూయార్కు,జులై 19:** ఐక్యరాజ్యసమితి సదస్సు కోసం న్యూయార్క్ రానున్న ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహును అరెస్ట్ చేసే అంశంపై న్యూయార్క్ నగర మేయర్ జోహ్రాన్ మామ్దానీ చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయంగా తీవ్ర దుమారంరేపుతున్నాయి. శనివారం దిన్యూ యార్క్ టైమ్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మేయర్ మాట్లాడుతూ నెత న్యాహును ఒక యుద్ధ నేర స్థుడిగా అభివర్ణించారు. అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ఐసీసీ) ఆయనపై మోపిన ఆరోపణల నేప



థ్యంలో, ఆయన ది హేగ్‌లోని జైలుకు వెళ్లాల్సిన వ్యక్తి అని స్పష్టం చేశారు. అయితే, ఒక విదేశీ దేశాధినేతను అరెస్ట్ చేసే అధికారం నగర మేయ ర్‌కు ఉందా లేదా అనే అంశంపై తాము ప్రస్తుతం నగర న్యాయ సలహాదారులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు ఆయన వెల్లడించారు. ఐరాసలో ఇజ్రాయెల్ రాయబారి డానీ డానన్ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా కౌంటర్ ఇస్తూ ఈ కేసు లో ఎవరినైనా అరెస్ట్ చేయాల్సివస్తే, మొదట మేయర్ జోహ్రాన్ మామ్దానీనే అని మండిపడ్డారు. కాగా, ఒక రేడియో షోలో నెతన్యాహు మాట్లాడు తూ మేయర్ మామ్దానీ హమాస్ ఉగ్రవా దులకు మద్దతుఇస్తున్నారని, ఆయన మనసులో అమెరి కాపై తీవ్ర ద్వేషం దాగి ఉందని ఆరోపించారు.




# 'మేడ్ ఇన్ ఇండియా' సి-295 ఆత్మనిర్భర్ భారత్‌కు ఊతం

## కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

**న్యూఢిల్లీ, జులై 19:** దేశీయ రక్షణ, విమాన తయారీ రంగాల్లో భారత్ మరో కీలక మైలురాయిని చేరుకుంది. తొలి స్వదేశీ ఎయిర్‌బస్ సి-295 వ్యూహాత్మక సైనిక రవాణా విమానాన్ని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు పరిచయం చేశారు. గుజరాత్ రాష్ట్రం వడోదరలోని టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ (టిఎఎస్‌ఎల్) తయారీ కేంద్రాన్ని సందర్శించిన ఆయన ఓ విడియోను సోషల్ మీడియా 'ఎక్స్'లో పంచుకున్నారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ 'ప్రధాని మోడీ కలలు గన్న 'ఆత్మనిర్భర్ భారత్', 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమాలకు ఈ ప్రాజెక్టు ప్రతీకగా నిలుస్తుంది. దేశంలో విమాన తయారీ సామర్థ్యం వేగంగా పెరుగుతోంది. త్వరలో భారతీ యులు పూర్తిగా స్వదేశీ విమానాల్లోనే ప్రయా ణిస్తారు. ఆరోజు కూడా ఎంతో దూరంలో లేదు' అని అన్నారు. కాగా ఎయిర్‌బస్-టాటా అడ్వా న్స్‌డ్ సిస్టమ్స్ ఉమ్మడి భాగస్వామ్యంతో అమల వుతున్న సి-295 ప్రాజెక్టు కింద తొలిసారిగా ప్రైవేట్ రంగంలో ఓ క్లిష్టమైన సైనిక విమానం భారత్‌తో తయారవుతోంది. దీనికి 2021లో 2.6 బిలియన్ డాలర్లతో ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం భారత్‌కు మొత్తం 56 సి-295 విమానాలు అందించాలి. వీటిలో 16 విమానాలు స్పెయిన్‌లో మాన్యుఫాక్చర్ కానుం డగా, మరో 40 విమానాలు వడోదరలో తయారు చేస్తు న్నారు. అందులో భాగంగా తొలి సి-295 విమా నాన్ని జూన్ 10న విజయవంతంగా పరీ క్షిం చారు. ఇటీవల 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కూడా ఈ ప్రాజె క్టును గురించి ప్రస్తావించారు. సి-295 తయారీ వల్ల సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్ర మలకు (ఎంఎస్ఎంఇలు) కొత్త అవకాశాలు లభిస్తాయని, సాంకేతిక పరిజ్ఞానం బదలీ, నైపుణ్యాభివృద్ధి, దేశీయ ఏరోస్పేస్ పరిశ్రమ విస్తరణకు ఇది కీల కంగా మారుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

# పార్లమెంటు ర్యాలీని విజయవంతం చేయండి

## సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ పిలుపు




**న్యూఢిల్లీ, జులై 19:** జంతర్‌మంతర్ నుంచి పార్ల మెంట్ వరకూ రేపు తలపెట్టిన ర్యాలీని విజ యవంతం చేయాలని సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ ఒక సందేశాన్ని విడుదల చేశారు. ఆమరణ దీక్ష చేస్తున్న ఆయనను శనివారం ఆస్పత్రికి తరలించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆసుపత్రి నుంచి ఆయన తన స్వదస్తూరితో రాసిన చీటీని రిలీజ్ చేశారు. నీట్ పేపర్ లీక్ ఉదంతాలకు వ్యతిరేకంగా వాంగ్‌చుక్ ఉద్యమిస్తున్న విషయం తెలిసిందే. తన నిరసన కార్యక్రమాన్ని ఆయన రెండో స్వాతంత్ర్య పోరాటంగా అభివర్ణించారు. పేపర్ లీక్ వంటి అన్యాయాల నుంచి విముక్తి కావాలని తన సం దేశంలో రాశారు. తన భార్య గీతాంజలి ద్వారా ఈ సందేశాన్ని పంపించినట్లు కూడా ఆయన పేర్కొన్నారు. పేపర్ లీక్ ఉదంతంపై గత నెల 28న కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన నిరసనలో కూడా వాంగ్‌చుక్ పాల్గొన్నారు. తర్వాత, ఆమరణ దీక్ష ప్రారంభించారు. ఆయన దీక్ష ప్రారంభించి ఇప్పటికే 21 రోజులు పూర్తయింది. ఈ క్రమంలో వాంగ్‌చుక్ ఆరోగ్యం దృష్ట్యా పోలీసులు ఆయనను సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తరలించారు. ఇదిలా ఉంటే, తన భర్త వాంగ్‌చుక్‌ను ప్రైవేట్ ఆసుపత్రికి తరలించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ గీతాంజలి తాజాగా ఢిల్లీ హైకోర్టును ఆశ్రయిం చారు. తన భర్తకు అందిస్తున్న చికిత్సలో పారద ర్శకత లేదని ఆరోపించారు. తన పిటిషన్‌పై తక్షణ విచారణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

**వాంగ్‌చుక్ ఆరోగ్య స్థితిపై హెల్త్ బులెటిన్ విడుదల**

కాగా, పర్యావరణ ఉద్యమకారుడు సోమన్ వాంగ్ చుక్ ఆరోగ్యం నిలకడగా ఉందని న్యూఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ ఆసుపత్రి వైద్యులు వెల్లడించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై హెల్త్ బులెటిన్‌ను ఆదివారం వైద్యులు విడుదల చేశారు. గత 20 రోజులుగా ఆయన ఎలాంటి ఆహారం తీసుకోలేదని వారు తెలిపారు.

సుదీర్ఘ ఉపవాసం కారణంగా ఆయన తీవ్ర నీరసంతో ఉన్నారని, ఆసుపత్రిలో చేర్చే సమయంలో ఆయన పూర్తి స్పృహలోనే ఉన్నారని వివరించారు. అలాగే ఆయన శరీరంలోని ఆక్సిజన్ స్థాయిలు బాగానే ఉన్నాయని పేర్కొన్నారు. సోనమ్ వాంగ్‌చుక్‌కు ఐవీ ఫ్లూయిడ్స్ ఇవ్వాల్సి ఉందని వైద్యులు స్పష్టం చేశారు. వాటిని తీసుకునేందుకు ఆయన నిరాకరి స్తున్నారని అన్నారు. కాగా తన భర్తను ప్రైవేట్ ఆసుపత్రికి తరలించేందుకు అనుమతి ఇవ్వాలని వాంగ్‌చుక్ భార్య గీతాంజలి ఆంగ్మో ఢిల్లీ హైకో ర్టులో దాఖలు చేసిన పిటిషన్ సోమవారం విచా రణకు వచ్చే అవకాశం ఉంది.

# సంక్షిప్త వార్తలు

## హంగేరీ అధ్యక్షుడి పదవీకాలం ముగింపు



**బుడాపెస్ట్,జులై 19:** హంగేరీ అధ్యక్షుడు టామాస్ సుల్యోక్ తన పదవీకా లాన్ని తక్షణమే ముగించే రాజ్యాంగ సవరణపై సంతకం చేశారు. దీంతో కొత్త ప్రధాని పీటర్ మగ్యార్ ప్రభుత్వం, మాజీ ప్రధాని విక్టర్ ఒర్బాన్ నియమించిన కీలక అధి.కారులను తొలగించే చర్యల్లో మరో కీలక ఘట్టం పూర్తిచేసుకున్నట్లయింది. ఏప్రిల్‌లో జరిగిన ఎన్నికల్లో ఓర్బాన్ ప్రభుత్వాన్ని ఘోరపరాజయం పాలుచేసిన పీటర్ మగ్యార్, అధ్యక్షుడు సుల్యోక్ రాజీనామా చేయాలని పలు మార్లు డిమాండ్ చేశారు. ఓర్బాన్ ప్రభుత్వ హయాంలో ప్రజాస్వామ్యవ్యతిరేక చర్యలను అడ్డుకోవ డంలో అధ్యక్షుడిగా తన రాజ్యాంగ బాధ్యతలను సుల్యోక్ నిర్వర్తించలేదని ఆయన ఆరోపించారు.

## ఇరాన్, అమెరికా దాడులు ఉధృతం



**టెహ్రాన్,జులై 19:** గల్ఫ్‌ప్రాంతంలో అమెరికా, ఇరాన్ మధ్య ఘర్షణలు తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. ఇరాన్‌ను లక్ష్యంగా చేసుకుని అమెరికా దళాలు జరుపుతున్న వరుసదాడుల్లో ఇప్పటివరకు కనీసం 50మంది మరణిం చగా, 500 మందికి పైగా గాయపడ్డారు. ఈ విషయాన్ని ఇరాన్ ఆరోగ్య మంత్రిత్వశాఖ ప్రతినిధి హుస్సేన్ కెర్మాన్‌పూర్ అధికారికంగా వెల్లడిం చారు. గత 24 గంటల్లోనే 12మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారని, గాయపడిన వారిలో 37 మందిపరిస్థితి ఆందోళ నకరంగా ఉండటంతో ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నారని ఆయన తెలిపారు.

## అమెరికా పౌరులకు అంతర్జాతీయ హెచ్చరికలు జారీ




**వాషింగ్టన్,జులై 19:** అమెరికా-ఇరాన్ మధ్యకొనసాగుతున్న యుద్ధం మరిం త తీవ్రరూపం దాల్చుతున్న నేపథ్యంలో, ప్రపంచవ్యాప్తంగా ప్రయాణి స్తున్న లేదావిదేశాల్లో నివసిస్తున్న అమెరికా పౌరులకు అమెరికా విదేశాంగ శాఖ గ్లోబల్ ట్రావెల్ అడ్వైజరీ జారీ చేసింది. భద్రతా పరిస్థితులు వేగంగా మారుతున్నాయని, ముఖ్యంగా మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశం ఉందని హెచ్చరించింది.

## మధ్యప్రదేశ్‌లో యూనిఫామ్ సివిల్ కోడ్‌కు రాష్ట్ర కేబినెట్ ఆమోదం



**భోపాల్,జులై 19:** మధ్యప్రదేశ్‌లో ఉమ్మడిపౌరశిక్షాస్మృతి (యుసిసి) అమలుకు కీలక ముందడుగు పడింది. రాష్ట్ర కేబినెట్ ఆదివారం యూసీసీ ముసాయిదా బిల్లుకు ఆమోదం తెలిపినట్లు ముఖ్య మంత్రి మోహన్ యాదవ్ వెల్లడించారు. ఈ బిల్లును సోమవారం ప్రారంభమయ్యే ఐదు రోజుల రాష్ట్ర శాసనసభ వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. సమాజంలోని అన్ని వర్గాల నుంచి అభిప్రాయాలు, సూచనలు స్వీకరించిన అనంతరం యూసీసీ ముసాయిదాను రూపొం దించామని, దీనికి మెజారిటీ ప్రజల మద్దతు లభించిందని ముఖ్యమంత్రి చెప్పారు.

## మేకెధాతుపై పార్లమెంటులో చర్చించాలి: డిఎంకె



**న్యూఢిల్లీ,జులై 19:** కర్ణాటక ప్రభుత్వం ప్రతిపాదించిన మేకెధాతు ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ద్రవిడ మున్నేట్ర కజగం తన పోరాటాన్ని తీవ్రతరం చేసింది. ఈ అంశంపై పార్లమెంటులో తక్షణమే చర్చ చేపట్టాలని డిమాండ్ చేస్తూ లోక్‌సభ, రాజ్యసభల్లో వాయిదా తీర్మాన నోటీసులు అందజేసింది. సోమవారం నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ఈ అంశాన్ని చర్చకు చేపట్టాలని కోరింది. డీఎంకే పార్లమెంటరీపార్టీ నేత టీ.ఆర్. బాలు లోక్ సభలో, పార్టీ ఫ్లోర్ లీడర్ తిరుచ్చి శివ రాజ్యసభలో ఈ నోటీసులను సమర్పించారు.

## మీరట్‌లో ప్రియుడి ఘాతుకం: సెలైన్‌లో విషం ఎక్కించి నర్సు హత్య



**మీరట్,జులై 19:** ఉత్తర్ ప్రదేశ్ మీరట్‌లోని లోహియా నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక ప్రైవేట్ ఆస్పత్రి నర్సు అనుమానాస్పదంగా మరణించింది. పోలీసులు లోతుగా దర్యాప్తు చేయగా ఇది హత్య అని తేలింది. ప్రియుడే హత్య చేసినట్లు వెల్లడైంది. తనను పెళ్లి చేసుకోవాలని ప్రియురాలు ఒత్తిడి తెస్తుండటంతో పథకం ప్రకారం ప్రియుడు హత్యకు పాల్పడినట్లు తేలింది. ఆస్పత్రి ఉదోగితో కలిసి ఆపరేషన్ థియేటర్‌లో విషాన్ని ఇంజెక్ట్ చేయడం ద్వారా హత్యకు పాల్పడినట్లు తెలిసింది. ఈ హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ఒక నకిలీ సూసైడ్ నోట్ రాసి మృ తదేహం వద్ద ఉంచారు. ఈ కేసులో ప్రియుడితో పాటు మరో వ్యక్తిని అరెస్ట్ చేశారు.

20-7Pg6exHMNWJQE_20-7Pg6exHMNWJQE.qxd 19/Jul/26 10:46 PM Page 1



## ఏనుగుల స్వైరవిహారం.. రైతులకు రూ.లక్షల్లో పంట నష్టం



**పీలేరు / కె.వి.పల్లి, జులై 19 ప్రభాతవార్త:** కేవీ పల్లె మండలం జిల్లేళ్లమంద సమీప అటవీ ప్రాంతంలో ఏనుగుల గుంపు సంచారం రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. నాలుగైదు రోజులుగా సంచరిస్తున్న గజరాజులు శేషాచలం సమీపంలోని మామిడి, కొబ్బరి, అరటి తోటలపై దాడి చేసి భారీ నష్టం కలిగించాయి. మామిడి, కొబ్బరి చెట్లను నేలమట్టం చేయడంతో పాటు సాగునీటి పైపులు, కంచెలు, రాతి కూసాలను ధ్వంసం చేశాయి. జిల్లేళ్లమంద గ్రామానికి చెందిన సుమారు 20 మంది రైతులు రూ.లక్షల్లో నష్టపోయినట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళ పొలాల వద్దకు వెళ్లేందుకు కూడా భయపడుతున్నామని రైతులు చెబుతున్నారు. ఏనుగుల బెడదను అరికట్టేందుకు అటవీ అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని, నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందించాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# ఎఇఇ పోస్టుల దరఖాస్తులకు నేడే గడువు

**• ఆగస్టు 22 నుండి 29వరకు రాతపరీక్షలు • ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్**

**తిరుపతి, జులై 19 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ఎపిట్రాన్స్‌కో, ఎపిజెన్‌కో, ఎపిఎస్‌పిడిసిఎల్, ఇపిడిసిఎల్, సిపిడిసిఎల్ సంస్థల్లో ఎఇఇ పోస్టుల నియామకాలకై అభ్యర్థులు నేటి లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి ఆదివారం తెలిపారు. ట్రాన్స్‌కోలో ఎలక్ట్రికల్ ఇంజనీర్లు 16, టెలికామ్ 10, సివిల్ ఇంజనీర్లు 23 మొత్తం కలిపి 200, జెన్‌కోలో ఎలక్ట్రికల్ ఇంజనీర్లు 52, మెకానికల్ 21, ఎలక్ట్రానిక్స్ 7, సివిల్ ఇంజనీర్లు 20 మొత్తం కలిపి 100, ఎస్పిడిసిఎల్‌లో ఎలక్ట్రికల్ ఇంజనీర్లు 125, టెలికామ్ 4, సివిల్ ఇంజనీర్లు 6 మొత్తం కలిపి 135, ఇపిడిసిఎల్‌లో ఎలక్ట్రికల్ ఇంజనీర్లు 128, టెలికామ్ 3, సివిల్ ఇంజనీర్లు 4 మొత్తం కలిపి 135, ° సిపిడిసిఎల్‌లో ఎలక్ట్రికల్ ఇంజనీర్లు 56, టెలికామ్ 1, సివిల్ ఇంజనీర్లు 3 మొత్తం కలిపి 60 పోస్టుల నియామకానికి ఆయా సంస్థలు ప్రకటనను జారీ చేయడం జరిగిందన్నారు. నియామక ప్రకటనలో పేర్కొన్న షెడ్యూల్ మేరకే ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతోందని, (నేడు)20వ తేదీ సాయంత్రంలోగా అభ్యర్థులు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. షెడ్యూల్ పేర్కొన్న విధంగానే ఈ ఏడాది ఆగస్టు 22వ తేదీ నుండి 29వ తేదీ వరకు కంప్యూటర్ ఆధారిత పరీక్షలను నిర్వహించడం జరుగుతుందని, ఈ షెడ్యూల్‌లో ఎటువంటి మార్పు ఉండబోదని స్పష్టం చేశారు. ఎఇఇ పోస్టుల నియామక ప్రక్రియ మొత్తాన్ని పారదర్శకంగా నిర్వహించడం జరుగుతుందని వివరించారు. ఈ ప్రక్రియకు సంబంధించిన అధికారిక సమాచారాన్ని వెబ్ సైట్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. ఎఇఇ పోస్టుల నియామక అంశంలో అభ్యర్థులు దళారుల మాటలు, ఇతర అనధికారిక సామాజిక మాధ్యమాల ద్వారా వెలువడే సమాచారాన్ని నమ్మి మోసపోవద్దని సూచించారు.

**నేడు డయల్ యువర్ ఎస్‌పిడిసిఎల్ సిఎండి**

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం సోమవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు డయల్ యువర్ సిఎండి కార్యక్రమాన్ని ఎస్‌పిడిసిఎల్ నిర్వహించనుంది. ప్రతి సోమవారం నిర్వహించే డయల్ యువర్ సిఎండి కార్యక్రమం ద్వారా వినియోగదారులు 89777 16661 నంబర్‌కు కాల్ చేసి తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురావచ్చు.

**సర్కిల్ స్థాయిలో కూడా...**

డయల్ యువర్ ఎస్‌పిడిసిఎల్ సిఎండి కార్యక్రమంతో పాటు సర్కిల్ స్థాయిలో కూడా ప్రతి సోమవారం 'డయల్ యువర్ ఎస్ఇ' కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. జిల్లా స్థాయిలో తమ విద్యుత్ సమస్యలను సూపరింటెండింగ్ ఇంజనీర్ దృష్టికి తీసుకువచ్చేందుకు వీలుగా వినియోగదారులు తిరుపతి: 87126 52679, చిత్తూరు: 79931 47979, నెల్లూరు: 08612 320427, అన్నమయ్య: 94408 17449, కడప: 08562 242457, కర్నూలు: 73826 14308, నంద్యాల: 73826 18976, అనంతపురం: 91547 90350, శ్రీసత్యసాయి: 94906 15721 నంబర్లకు ఫోన్‌చేసి తెలపాలి.

## కృష్ణలంక పిఎస్‌లో లాకప్ డెత్ అయిన గాదె సాయికృష్ణకు కర్మకాండలు నిర్వహణ



**విజయవాడ, జులై 19 ప్రభాతవార్త ప్రతినిధి:** కృష్ణలంక పీఎస్‌లో లాకప్ డెత్ అయిన గాదె సాయికృష్ణకు మరణానంతర కర్మకాండలను అతని కుటుంబ సభ్యులు నిర్వహించినట్లు సమాచారం. ఈ స్మృత్యార్థం కుటుంబ సభ్యులు హిందు సంప్రదాయక విధానంలో క్రతువులు నిర్వహించి అన్నదానం చేసారని సమాచారం. సాయికృష్ణ లాకప్‌డెత్ జరిగిన ఈ కేసు విచారిస్తున్న సిట్ అభిప్రాయపడింది. కీలక నిందితుడు సస్పెండయిన సీఐ నాగరాజు రిమాండ్ రిపోర్టులో ఈ విషయాన్ని స్పష్టం చేసింది. బూడిద, మరణించిన తేదీ చెపితే కర్మకాండలు చేసుకుంటామని అనేకమార్లు చెప్పిన కుటుంబ సభ్యులు పోలీసులను అభ్యర్థించారు. ఈ క్రమంలో పండితుల సూచనల మేరకు మరణించిన తారీఖు, చితాభస్మం లేకుండా శార్ధ క్రతువులు చేసారంటున్నారు. సాయికృష్ణ ఫోటో వద్ద పూలువేసి కుటుంబ సభ్యులు నివాళులు అర్పించారు. అయితే ఈ కార్యక్రమాలకు సాయికృష్ణ పిన్ని అడ్వకేట్ కనకదుర్గ హాజరు కాలేదు. సాయికృష్ణ లాకప్‌డెత్ అంశంపై ఆమె న్యాయం పోరాటం చేస్తున్నారు. కేసును వెలుగులోకి తీసుకుని రావడంలో ముఖ్యపాత్ర వహించారు.

# కమ్యూనిస్టులు మరింత బలపడాలి

**• స్థానిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధపడాలి • సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య**

**తిరుపతి, జులై 19 ప్రభాతవార్త ప్రతినిధి:** 'దేశంలో నేటి పరిస్థితుల దృష్ట్యా కమ్యూనిస్టులు మరింత బలపడాల్సిన సమయం ఆసన్నమైందని, చట్టసభల్లో ప్రజల గొంతుక వినిపించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య పేర్కొన్నారు. కమ్యూనిస్టులు కేవలం పోరాటాలు, ఆందోళనలకే పరిమితం కాకూడదన్నారు. ప్రధాన రాజకీయ పార్టీల్లాగే ప్రజల్లో బలపడాలని, రానున్న స్థానిక ఎన్నికల్లో పోటీ చేయడానికి కార్యకర్తలు సిద్ధపడాలని అన్నారు. కమ్యూనిస్టు సిద్ధాంతం పట్ల నిబద్ధతతో ముందు కెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. నిరంతరం ప్రజలతో మమేకమై, సామాజిక మాధ్యమంలో జరుగుతున్న తప్పుడు ప్రచారాలను శాస్త్రీయంగా వాస్తవాలను చెప్పి తిప్పి కొట్టాలని ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. తిరుపతి నగరం బైరాగపట్టెడలోని గంధమనేని శివయ్య కృష్ణారెడ్డి భవన్‌లో మూడు రోజుల పాటు జరిగిన సైద్ధాంతిక శిక్షణ తరగతులు ఆదివారం ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సమాజంలో అనాగరిక వ్యవస్థను రూపుమాపి, సామాజిక మార్పు కోసం కమ్యూనిస్టు పార్టీ అనేక చారిత్రక పోరాటాలు సాగించిందన్నారు. నాటి సామాజిక రుగ్మతలను, ముఖ్యంగా సతీసహగమనం వంటి దురాచారాలను రూపుమాపడంలో కమ్యూనిస్టులు కీలక





పాత్ర పోషించారని గుర్తుచేశారు. దోపిడీ వర్గాల నుండి పేద, బడుగు, బలహీన వర్గాల హక్కులను కాపాడి రక్షణగా నిలిచామన్నారు. సమాజంలో చైతన్యం తీసుకురావడానికి ఎంతో మంది అభ్యుదయ రచయితలను, కళాకారులను కమ్యూనిస్టు పార్టీ తయారు చేసిందని కొనియాడారు. దేశంలో సహజ సంపదను పాలకులే కొల్లగొడుతున్నారని ఈశ్వరయ్య తీవ్రంగా ధ్వజమెత్తారు. అటవీ భూములను గుంజుకునేందుకు గిరిజనులను భయభ్రాంతు లకు గురిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో విద్యాపరమైన సమస్యల వల్ల సుమారు 70వేల మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతుంటే ఇటు చంద్రబాబు, పవన్ కల్యాణ్ గానీ, అటు జగన్ గానీ ఎవరూ పట్టించుకోలేదని విమర్శించారు. కేంద్రం నుండి రాష్ట్రానికి రావాల్సిన నిధులు, హక్కులను తీసుకురావడంలో చంద్రబాబు, జగన్ ఇద్దరూ పూర్తిగా విఫలమయ్యారని దుయ్యబట్టారు.

**ఆగస్టు 6 నుండి రాష్ట్రవ్యాప్త ప్రచార ఉద్యమం:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు సిపిఐ శ్రేణులు సిద్ధం కావాల న్నారు. ఆగస్టు 6 నుండి 17 వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రచార ఉద్యమం చేపట్టనున్నట్లు ఈశ్వరయ్య వెల్లడించారు. ఈ ముగింపు కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, నగర కార్యదర్శి విశ్వనాథ్, జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్ని రాజు, డాక్టర్ కె. రాజశేఖర్ తదితర పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రధాని మోడీ రాజీనామా చేయాలి

**• ధర్మేంద్ర ప్రధాన్‌ను బర్తరఫ్ చేయాలి • సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య**

**తిరుపతి, జులై 19 ప్రభాతవార్త ప్రతినిధి:** 'నీట్ పరీక్ష ప్రశ్నాపత్రం లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను పదవి నుంచి బర్తరఫ్ చేయాలి' అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఆదివారం తిరుపతి నగరంలోని బైరాగిపట్టెడ సిపిఐ కార్యాలయం నుండి పద్మావతి పార్క్ కూడలి వరకు సిపిఐ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించి, అనంతరం కూడలి వద్ద రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ దేశంలో విద్యారంగాన్ని ప్రక్షాళన చేయాలని, నీట్ పరీక్ష అక్రమాలను వెలికితీయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ప్రముఖ పర్యావరణ వేత్త, సైంటిస్ట్ సోనమ్ వాంగ్‌చుక్ 19 రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దుర్మార్గమన్నారు. దేశవ్యాప్తంగా విద్యార్థులు, మేధావులు, వివిధ రంగాల ప్రముఖులు ఇంత పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తున్నప్పటికీ ప్రధాని మోడీ కనీసం ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం దేశ ప్రజల దౌర్భాగ్యమని మండిపడ్డారు.

బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత టెట్, సిబిఎస్ఇ, యుపిపిఎస్‌సి, నీట్ వంటి దేశవ్యాప్తంగా దాదాపు 89 రకాల పరీక్షల ప్రశ్నపత్రాలు లీక్ అయ్యాయని ఈశ్వరయ్య ఆరోపించారు. పరీక్షల లీకేజీల వల్ల మానసిక వేదనకు గురై 20మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారని, 23 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను కార్పొరేట్ మాఫియా చేతుల్లో పెడుతోందని ఆరోపించారు. సోనమ్ వాంగ్‌చుక్ అక్రమ అరెస్టును తాము తీవ్రంగా ఖండిస్తున్నామని, సోమవారం జరగబోయే చలో పార్లమెంట్ కార్యక్రమానికి విద్యార్థి, యువజన, మహిళా సంఘాలు, కమ్యూనిస్ట్ పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి సంఘీభావం ప్రకటించాలని పిలుపునిచ్చారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఐ తిరుపతి జిల్లా కార్యదర్శి పి. మురళి, నాయకులు విశ్వనాథ్, చిన్ని రాజు, గురవయ్య, సుధాకర్ రెడ్డి, రాధాకృష్ణ, నదియా, కత్తి రవి, చంద్రశేఖర్ రెడ్డి, ఎన్.డి. రవి, పద్మనాభ రెడ్డి, రాజా, నాగరాజు, మహేంద్ర, శివ, మంజుల, రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.



## తిరుమల సమాచారం



### శ్రీవారి సేవలో వరాహమహాదేశికన్

**తిరుమల, జులై 19 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆషాడమాసంలో ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనానికి విచ్చేసిన శ్రీరంగం శ్రీమధన ఆండవన్ ఆశ్రమం పీఠాధిపతి వరాహమహాదేశికన్‌కు టిటిడి పెద్ద మర్యాదతో స్వాగతం పలికింది. ఆదివారం శిష్యులతో కలసి తిరుమలకు చేరుకున్న వరాహమహాదేశికన్ స్వామికి టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, పేష్కార్ రామకృష్ణ అర్చకులు ఆలయ సాంప్రదాయంతో స్వాగతం పలికారు. మంగళవాయిద్యాల నడుమ ఆలయంలోనికి చేరుకున్నారు. ధ్వజస్తంభానికి నమస్కరించారు. ఆనందనిలయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వేదాశీర్వచనం, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

### 22న తిరుమలలో పల్లవోత్సవం

**తిరుమల, జులై 19 ప్రభాతవార్త ప్రతినిధి:** మైసూరు మహారాజు జన్మించిన ఉత్తరాభాద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని టిటిడి 22వతేదీ బుధవారం పల్లవోత్సవం నిర్వహించనుంది. ఇందులో భాగంగా ఆరోజు సాయంత్రం సహస్రదీపాలంకారసేవ అనంతరం





శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి ఊరేగింపుగా కర్ణాటక సత్రానికి వేంచేపు చేస్తారు.. కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు, మైసూరు సంస్థానం ప్రతినిధులు స్వామి, అమ్మవార్లకు ఆహ్వానం పలికి ప్రత్యేక హారతి సమర్పిస్తారు. మైసూరు మహారాజు జ్ఞాపకార్థం దాదాపు 300 సంవత్సరాల నుండి తిరుమలలో పల్లవోత్సవం జరుగుతోంది.

**తిరుమలకు వస్తే ప్రదర్శన బోర్డులు, ఎస్ఎంఎస్ ద్వారా**

# గదుల కేటాయింపు

**ఉప విచారణ కార్యాలయాల్లో సులభంగా వసతి గదులు**







**తిరుమల, జులై 19 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశం నలుమూలల నుండి శ్రీవారి దర్శనానికి తిరుమలకు వస్తున్న భక్తులకు మరింత సులభంగా వసతి గదులు కేటాయించేలా టిటిడి వసతి కల్పన విభాగం చర్యలు చేపట్టింది. సామాన్య భక్తులు గదుల కోసం ఇబ్బంది పడకుండా టిటిడి విస్తృత ఏర్పాట్లు చేసింది. గతంలో సిఆర్ఒ వద్ద గదుల కోసం భక్తులు గంటల సమయం వేచి ఉండే విధానాన్ని మార్పు చేస్తూ భక్తుల అవస్థలు, సమయాన్ని దృష్టిలో ఉంచుకుని ఉప విచారణ కార్యాలయాల ద్వారా గదులు కేటాయించే విధానాన్ని అమలు చేస్తోంది. భక్తులు ముందుగా తిరుమలలోని కేంద్రీయ విచారణ కార్యాలయం (సిఆర్ఒ) వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఉదయం 5 గంటల నుండి సిఆర్ఒ కార్యాలయం తెరుచుకుంటుంది. గదులు అందుబాటులో ఉన్నంత వరకు సులభంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.

భక్తులు క్యూలైన్‌లో నిలబడి తమ వంతు వచ్చిన తర్వాత రిజిస్ట్రేషన్ కౌంటర్ వద్ద తమ ఒరిజినల్ ఆధార్ కార్డు గానీ జిరాక్స్ కాపీని తీసుకెళ్లి ఫోన్ నెంబర్ వివరాలు తెలియజేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ముఖ గుర్తింపు విధానం ద్వారా రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుంది. కౌంటర్ వద్ద రెండు కేటగిరీలకు సంబంధించిన గదుల్లో తమకు నచ్చిన కేటగిరీని ఎంచుకోవచ్చు.

ఎ కేటగిరీలో 50 రూపాయలు గదులు, 100 రూపాయలు గదులు, బి కేటగిరీలో వెయ్యి రూపాయలు అద్దె గదులు ఉంటాయి. ఈ ప్రక్రియ పూర్తి కాగానే భక్తులకు ఒక అక్నాలెడ్జ్మెంట్ స్లిప్ కేటాయించబడుతుంది. క్యూలైన్ల వద్ద భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, అన్న ప్రసాదం, మరుగుదొడ్లు వంటి సదుపాయాలు అందుబాటులో ఉంటాయి.

**గదుల కోసం మార్గదర్శకాలు:** తిరుమలలో గదులు పొందడానికి 21 సంవత్సరాల వయస్సు నిండి ఉండాలి. ఒకసారి గదిని పొందిన వ్యక్తి 30 రోజుల వరకు తిరిగి గదిని పొందలేరు. ఒక కుటుంబం నుండి ఒక వ్యక్తి మాత్రమే క్యూ లైన్‌లోకి రావాలి.

ఒంటరి వ్యక్తికి, అవివాహితులకు గదులు కేటాయించ బడవు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత సిఆర్ఒ వద్ద ఉన్న ప్రదర్శన బోర్డులలో వరుస క్రమంలో రిజిస్ట్రేషన్ సంఖ్య కనిపిస్తుంది. వారి క్రమ సంఖ్య కనిపించిన 15 నిమిషాలలోపు వారి సెల్‌ఫోన్‌కు కేటాయించిన గదికి సంబంధించిన సమాచారం మెసేజ్ రూపంలో అందుతుంది. ఒకవేళ ప్రదర్శన బోర్డుల్లో భక్తుల రిజిస్ట్రేషన్ క్రమ సంఖ్య వచ్చినప్పటికీ మెసేజ్ రాకపోతే సిఆర్ఒ వద్ద ఏర్పాటు చేసి కీయోస్క్ మిషన్లలో తమ స్లిప్ స్కాన్ చేస్తే తమకు కేటాయించిన గది వివరాలు చూపిస్తుంది. అనంతరం భక్తులు వారికి గది కేటా యించిన ప్రాంతంలోని ఉప విచారణ కార్యాల యాలకు చేరుకుని గదికి సంబంధించిన రుసుమును ఆన్ లైన్ (ఫోన్ పే/ గూగుల్ పే/ యూపీఐ/ క్రెడిట్ కార్డు/ డెబిట్ కార్డు ద్వారా మాత్రమే చెల్లించి తాళాలు తీసుకోవాల్సి ఉంటుంది.

**తిరుమలలో ఉప విచారణ కార్యాలయాలు:** భక్తుల కోసం సులభంగా ఉపవిచారణ కార్యాలయాలను ఆధునీకరించారు. అంజనాద్రి నగర్ కాటేజస్, శ్రేషాద్రి నగర్ కాటేజస్, శంఖుమిట్ట కాటేజస్, గరుడాద్రి నగర్ కాటేజస్, హిల్ వ్యూ కాటేజస్., సుదర్శన సత్రం, గోవర్ధన్ సత్రం, కళ్యాణి సత్రం, సప్తగిరి విశ్రాంతి గృహంతో బాటు రామ్ భగిచా విశ్రాంతి గృహం2, వరాహ స్వామి విశ్రాంతి గృహం 1,2, అష్ట వినాయక విశ్రాంతి గృహం,కౌస్తుభం విశ్రాంతి గృహం, పాంచజన్యం విశ్రాంతి గృహం, మాతృశ్రీ వకుళామాత విశ్రాంతి గృహం, నందకం విశ్రాంతి గృహం, సూరాపురం తోట ఉన్నాయి.

**గదులు పొందిన భక్తులకు నిబంధనలు:** గదులు 24 గంటలకు మాత్రమే కేటాయించబడతాయి. ఒకవేళ 24 గంటలు దాటితే టారీఫ్ 200 శాతం, 48 గంటలు దాటితే 400 శాతం పెరుగుతుంది.

నీరు విద్యుత్‌ను వృథా చేయరాదు. తిరుమలలో ప్లాస్టిక్ నీళ్ల బాటిళ్లను ఉపయోగించరాదు. జగ్గులు నీటి గ్లాసులను ఉపయోగించాలి.. వాటిని శుభ్రంగా ఉంచాలి. తడి పొడి చెత్తను వాటికి వేర్వేరుగా కేటాయించిన చెత్త బుట్టలలో వేయాలి. భక్తులు వారి వస్తువులను వారే బాధ్యత వహించాలి. గదులు పొందిన భక్తుడు/ భక్తురాలు మాత్రమే గది ఖాళీ చేయాల్సి ఉంటుంది. లేకుంటే కాషన్ డిపాజిట్ తిరిగి ఇవ్వబడదు.


## కళాకారుల కుటుంబాలకు టిటిడి ఉదారత

**• మృతుల అంత్యక్రియలకు రూ.25 వేల తక్షణ సాయం**



**తిరుమల, జులై 19 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన హెచ్‌డిపిపి కళాకారులకు టిటిడి ఉదారత చాటుకుంది. హిందూ ధర్మ ప్రచార పరిషత్ (హెచ్‌డిపిపి) టిటిడి ఆధ్వర్యంలో చిత్తూరు జిల్లా నగరి సమీపంలోని సత్రవాడలో టిటిడి ఆలయంలో ఆదివారం ఉదయం నిర్వహించాల్సిన హరికథ కార్యక్రమంలో భక్తి సేవలు అందించేందుకు తిరుపతి నుండి సత్రవాడకు వెళ్తున్న ప్రైవేట్ కళాకారులు కె.చక్రవర్తి (వయోలిన్), కె.నాగరాజుచెట్టి (తబలా) తిరుపతికి సమీపంలోని వడమాలపేట- పూడి క్రాస్ సమీపంలో రోడ్డుప్రమాదానికి గురయ్యారు. ఈ విషాదకర ప్రమాదంలో దురదృష్టవశాత్తు అక్కడికక్కడే మృతి చెందారు. విధుల్లో భాగంగా ఈ విషాదం చోటుచేసుకోవడంతో టిటిడి ధర్మకర్తల మండలి చైర్మన్ బి.ఆర్.నాయుడు, టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, జెఇఒ డాక్టర్ ఎ.శరత్ మానవతా దృక్పథంతో మృతుల కుటుంబాలకు తక్షణ సహాయం అందించాలని ప్రత్యేక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ మేరకు మరణించిన ప్రతి కళాకారుడి కుటుంబానికి అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం హెచ్‌డిపిపి నిధి నుండి 25 వేల రూపాయలు చొప్పున తక్షణ ఆర్థిక సహాయాన్ని మృతుల కుటుంబ సభ్యులకు హెచ్‌డిపిపి కార్యదర్శి డాక్టర్ మేడసాని మోహన్ అందజేశారు.


## తిరుమల రెండోఘాట్‌లో కారు బోల్తా



**తిరుమల, జులై 19 ప్రభాతవార్త ప్రతినిధి:** శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వస్తున్న తెలంగాణ హైదరాబాద్ వాసుల కారు రెండోఘాట్‌లో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో భక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. హైదరాబాద్‌కు చెందిన శ్రీధర్ కుటుంబంతో కలసి ఆదివారం మధ్యాహ్నం తిరుమలకు ట్యాక్సీ కారులో వస్తుండగా రెండో ఘాట్‌లో లింకురోడ్డు దాటిన తరువాత రక్షణగోడను ఢీకొంది. కారు బోల్తాపడటంతో భక్తులు గాయపడ్డారు. ఈ సంఘటనతో ఘాట్‌లో వాహనాలు ఆగిపోయాయి. ట్రాఫిక్ స్తంభించింది. సమాచారం అందుకున్న విజిలెన్స్, పోలీసులు కారును పక్కకు తప్పించి వాహనాలను క్రమబద్ధీకరించారు. గాయపడిన వారిని అశ్వినికి తరలించారు.

## అలిపిరిలో బస్సు తప్పితే భక్తులకు ప్రత్యామ్నాయం

**తిరుమల, జులై 19 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశం నలుమూలల నుండి రైళ్ళలో, ఆర్టీసి బస్సులద్వారా ఇతరత్రా ప్రయాణ సౌకర్యాలతో తిరుపతికి చేరుకుని తిరుమలకు ఆర్టీసి బస్సుల్లో ప్రయాణించే భక్తులకు కష్టాలు తప్పాయి. ఇప్పటివరకు అలిపిరి సప్తగిరి తనిఖీ కేంద్రంలో లగేజీ తనిఖీతోబాటు భక్తుల తనిఖీకి క్రిందకు దిగాలి. ఇక్కడ దిగిన తరువాత ఆర్టీసి బస్సులు తనిఖీ చేసుకుని ముందుకు కదులుతాయి. ఆ సమయంలో భక్తులు కూడా తమ లగేజీలను తనిఖీ అయిన తరూవాత అదే బస్సులను ఎక్కి తిరుమలకు రావాల్సి ఉంది. అయితే కొన్ని సందర్భాల్లో చాలామంది భక్తులు బస్సులు తప్పిపోవడం, వచ్చిన బస్సుల టిక్కెట్ చేతిలో ఉన్నా మరోబస్సులో ప్రయాణించే వీలులేకపోతోంది. దీంతో సుదూర ప్రాంతాల నుండి వస్తున్న గ్రామీణ ప్రాంత భక్తులు సామాన్యభక్తులు కొండకు చేరుకునేందుకు కష్టాలు పడుతున్నారు. భక్తులకు అలిపిరిలో ఎదురవుతున్న ఆర్టీసి కష్టాలపై 'వార్త' దినపత్రిక ప్రత్యేక కథనం ప్రచురించింది. అలిపిరిలో దిగితే బస్సు తప్పితే కన్నీళ్ళే శీర్షికతో ఆర్టీసి అధికారులు స్పందించారు. టిటిడి అధికారుల ఆదేశాలతో ఆర్టీసి అధికారులు ప్రత్యాయ్నాయ చర్యలు చేపట్టారు. ఎవరైనా భక్తులు ఆర్టీసి బస్టాండ్‌లలో గానీ, రైల్వేస్టేషన్ వద్ద నుండి గానీ ఆర్టీసి బస్సుల్లో ప్రయాణించి అలిపిరి వద్ద తప్పిపోతే వారిని తిరిగి సురక్షితంగా మరో బస్సు ఎక్కించి తిరుమలకు పంపేలా చర్యలు తీసుకున్నారు. ఇందుకు అలిపిరి వద్ద సిబ్బందిని నియమించారు. అదేగాక భక్తులు తమ కష్టాలను అలిపిరి డిఎం, తిరుపతి డిఎం, తిరుమల డిపో డిఎంలకు ఫోన్‌చేసినా వారికి సాయం అందిస్తారు. ఈ ప్రకటనతో ఉన్న గోడపత్రికలను అలపిరి తనిఖీ కేంద్రంలో బస్సుల మార్గాల్లో అంటించారు. దీనివల్ల భక్తులకు బస్సు తప్పిపోతే తిరుమలకు చేరుకోవడం సులభమైంది. భక్తులు దీన్ని గమనించి తమ ప్రయాణీన్ని సులభం చేసుకోవాలని ఆర్టీసి కోరింది.





## శ్రీకాళహస్తీశ్వరాలయంలో భీముని బిక్షాటన: భక్తుల సంబరం

**శ్రీకాళహస్తి, జులై 19 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయం వద్ద భారతం పఠనం జరుగుతుంది. ఈ సందర్భంగా భారతంలోని సన్నివేశాలను తిరుపతి, శ్రీకాళహస్తి, చౌడేపల్లి రంగస్థల కళాకారులచే ప్రదర్శిస్తున్నారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టుసాయిప్రసాద్, ఇఒ బికె వెంకటేశులు పర్యవేక్షించారు. ఉత్సవాలకు హాజరౌతున్న భక్తుల సౌకర్యాలను పరిశీలించారు. అంతేకాక ప్రధాన ఉత్సవాల ఏర్పాట్లును పరిగణలోకి తీసుకొని ఇంజనీరింగ్ అధికారులతో చర్చించారు. ఆదివారం ఉదయం శ్రీకృష్ణుడు, అర్జునుడు, ద్రౌపదీ దేవి విగ్రహాలను ఊరేగించారు. ఊరేగింపు సుమారు 5కిలో మీట్లు పట్టణంలో సాగింది. ఉత్సవంతో పాటు ఇన్‌చార్జి ఆర్ సుబ్రమణ్యం, దుర్గా ప్రసాద్ పర్యవవేక్షించారు. పూజారి పురుషోత్తం వెంటరాగా ఉత్సవం కన్నుల పండువగా సాగింది. భారతంలోని అంశాల్లో భీముని బిక్షాటన కార్యక్రమాలను అత్యంత ఆకర్షిణీయంగా నిర్వహించారు.



శ్రీకాళహస్తిలో శ్రీకృష్ణుడు, అర్జునుడు, ద్రౌపదీ దేవి ఊరేగింపు

పాలక మండలి సభ్యుడు వాకచర్ల గుర్రప్పశెట్టి తదితరులు పాల్గొన్నారు.



## సైకిళ్ళ పంపిణీ తాత్కాలికంగా వాయిదా

● మంత్రి పొంగూరు నారాయణ వెల్లడి

**నెల్లూరు(వైద్యం), జులై 19 ప్రభాతవార్త:** నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ స్కూల్స్‌లో చదువుతున్న 10 వేల మంది పేద విద్యార్థుల కోసం 6 కోట్ల రూపాయల సొంత నిధులతో రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తలపెట్టిన సైకిళ్ల పంపిణీ కార్యక్రమం వర్షాల కారణంగా తాత్కాలికంగా వాయిదా పడింది. పురపాలక శాఖ మంత్రి నారాయణ మాట్లాడుతూ వర్షాల కారణంగా సైకిళ్ళ పంపిణీ కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేశామని తెలిపారు. వాతావరణం అనుకూలిస్తే శుక్ర, శనివారాల్లో పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం వర్షపు నీరు చేరిన వీఆర్సీ గ్రౌండ్స్‌ను మంత్రి నారాయణ పరిశీలించారు. సైకిళ్ల పంపిణీ ఏర్పాట్లకు వర్షం ఆటంకం కలిగించటంతో వీఆర్సీ మైదానాన్ని మంత్రి నారాయణ ఆదివారం స్వయంగా పరిశీలించారు. మంత్రి వెంట డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, బిజెపి నేత కర్నాటి ఆంజనేయ రెడ్డి, కమిషనర్ నందన్, డికాఓ బాలాజీరావు, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ తాళ్లపాక అనురాధ, మాజీ జెడ్పిటిసి విజేత రెడ్డి, నగర పార్టీ అధ్యక్షులు మామిడాల మధు, కార్పొరేటర్లు కర్తం ప్రతాప్ రెడ్డి, రామకృష్ణ, కిన్నెర ప్రేమ్ కుమార్, టీడీపీ నేతలు డాక్టర్ పోకల రవి, కిన్నెర ప్రసాద్, బాలాజీ, తిరుమల నాయుడు, దర్శి హరికృష్ణ, జహీర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# టిడిపి పెద్దల జేబులు నింపేలా రామాయపట్నం పోర్టు స్కామ్

● మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆరోపణలు

**విజయవాడ, జులై 19 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర భవిష్యత్తుకు అత్యంత కీలకమైన రామాయపట్నం పోర్టును టిడిపి పెద్దల జేబులు నింపేందుకు ఒక భారీ స్కామ్‌గా మార్చారని వైసీపీ అధినేత జగన్ ఆరోపించారు. రామాయపట్నం పోర్టు విషయంలో ప్రస్తుత టిడిపి కూటమి ప్రభుత్వం జగన్ పలు అభియోగాలు చేసారు. రాష్ట్ర ఖజానాకు వేల కోట్ల రూపాయల నష్టం కలిగించేందుకు సిద్ధమయ్యారని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా ఒక పోస్ట్ చేస్తూ ప్రభుత్వంపై ఘాటు విమర్శలు గుప్పించారు. మా హయాంలో పురోగతి. ఇప్పుడు ప్రైవేటుపరం అవుతుందని నవ్యాంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధికి పోర్టులే కీలకమని భావించిన తమ ప్రభుత్వం, రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట పోర్టుల నిర్మాణంలో గణనీయమైన పురోగతి సాధించిందని జగన్ గుర్తుచేశారు. ఈ మూడు పోర్టులకు సంబంధించి భూసేకరణ, అన్ని రకాల చట్టబద్ధమైన అనుమతులు, ఆర్థిక వనరుల సమీకరణ వంటి అత్యంత క్లిష్టమైన పనులన్నీ తమ హయాంలోనే పూర్తయ్యాయని ఆయన వివరించారు. ప్రాజెక్టు పూర్తి కోసం ఈపీసీ కాంట్రాక్టర్లను కూడా ఖరారు చేసి, 2024 జూన్ నాటికి నిర్మాణ పనుల్లో చెప్పుకోదగ్గ పురోగతిని సాధించామని తెలిపారు.



ఇంత కష్టపడి ఒక రూపు తీసుకొచ్చిన పోర్టును ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం అప్పనంగా ప్రైవేటుపరం చేసేందుకు కుట్ర పన్నుతోందని ఆయన ఆరోపించారు. రామాయపట్నం పోర్టు వల్ల రాష్ట్రానికి అపారమైన ఆర్థిక ప్రయోజనాలు చేకూరనున్నాయని జగన్ తన పోస్టులో పేర్కొన్నారు. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) సుమారు రూ.1 లక్ష కోట్లకు పైగా పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ, పెట్రోకెమికల్ కాంప్లెక్స్ పూర్తిగా రామాయపట్నం పోర్టుపైనే ఆధారపడి ఉందని తెలిపారు. ముడి చమురు దిగుమతికి ఈ పోర్టు కీలకం కానుందన్నారు. అలాగే, ఇండోసోల్ సోలార్ సంస్థ ఏర్పాటు చేయనున్న గిగా స్కేల్ తయారీ ప్లాంటుకు కూడా ఈ పోర్టే ఆధారం అని తెలిపారు. ముడిసరుకుల దిగుమతికి, తయారైన సోలార్ మాడ్యూళ్ల ఎగుమతికి ఈ డీప్ వాటర్ పోర్టు అత్యంత అవసరమని పేర్కొన్నారు. వీటితో పాటు, వైఎస్సార్ కడప జిల్లాలో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ నిర్మిస్తున్న ఉక్కు కర్మాగారానికి అవసరమైన ముడి ఇనుము, కోకింగ్ కోల్ వంటివి దిగుమతి చేసుకోవడానికి రామాయపట్నం పోర్టులో ఆ సంస్థ రెండు బెర్తులను అభివృద్ధి చేస్తోందని గుర్తుచేశారు. ఈ ప్రాజెక్టులన్నీ వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పించడమే కాకుండా, రాష్ట్రానికి పన్నుల రూపంలో భారీ ఆదాయాన్ని సమకూరుస్తాయని జగన్ వివరించారు. రామాయపట్నం పోర్టును టీడీపీ ప్రభుత్వం ఓ భారీ స్కామ్‌గా మార్చేందుకు ప్రయత్నిస్తోందని జగన్ తీవ్రంగా ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.4,929 కోట్లు ఖర్చు చేసి నిర్మిస్తున్న ఈ పోర్టును, కేవలం రూ.1,500 కోట్ల ముందస్తు చెల్లింపులకే ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టాలని చూస్తోందని ఆయన విమర్శించారు. దీనివల్ల రాష్ట్ర ఖజానాకు తీరని నష్టం వాటిల్లుతుందని, మిగిలిన రూ.3,500 కోట్లకు పైగా అప్పుల భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే మోయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. టీడీపీ పెద్దలకు నగదు ప్రవాహాలు సృష్టించడమే ఈ కుట్ర వెనుక ఉన్న అసలు లక్ష్యమని జగన్ ధ్వజమెత్తారు.

## జాతీయ చలనచిత్ర పురస్కారాల విజేతలకు సిఎం చంద్రబాబు అభినందనలు

**విజయవాడ, జులై 19 ప్రభాతవార్త ప్రతినిధి:** జాతీయ చలనచిత్ర పురస్కారాల విజేతలకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం సోషల్ మీడియా వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు. విజేతలందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ, తెలుగు చిత్ర పరిశ్రమ సాధించిన విజయాలపై ప్రత్యేకంగా ప్రశంసలు కురిపించారు. తెలుగు సినీ పరిశ్రమకు చెందిన నటీనటులు, దర్శకులు, నిర్మాతలు, సాంకేతిక నిపుణుల అసాధారణ ప్రతిభ మన సినిమాకు గొప్ప గర్వకారణంగా నిలిచిందని చంద్రబాబు కొనియాడారు. “కళ, సంస్కృతి, సినిమా మన అస్తిత్వానికి, వారసత్వానికి బలమైన మూలస్తంభాలు. తెలుగు సినిమా భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి, తరతరాలకు స్ఫూర్తినివ్వాలి” అని ఆయన తన పోస్టులో ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అవార్డులు గెలుచుకున్న వారందరూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. తన పోస్టులో ప్రముఖ నటులు మమ్ముట్టి, యామీ గౌతమ్, కార్తీక్ ఆర్యన్, నిహారిక కొణిదెల, దర్శకుడు సుకుమార్‌లను ట్యాగ్ చేయడం విశేషం. దీంతో పాటు ‘పుష్ప 2’, ‘కల్కి 2898 ఏడీ’, ‘లక్కీ భాస్కర్’ వంటి ప్రతిష్ఠాత్మక చిత్రాల హ్యాష్‌ట్యాగ్‌లను కూడా జతచేశారు.

### సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అభినందనలు

72వ జాతీయ చలనచిత్ర పురస్కారాలలో టాలీవుడ్ ఏకంగా 9 జాతీయ అవార్డులను కైవసం చేసుకుని దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించడంపై రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేస్తూ విజేతలకు తన హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. “భారతీయ చలనచిత్ర రంగంలో తెలుగు సినిమా మరోసారి తన జైత్రయాత్రను చాటిచెప్పడం ఆనందంగా ఉంది. నేషనల్ ఫిల్మ్ అవార్డ్స్ వేదికపై 9 పురస్కారాలతో టాలీవుడ్ తన విశ్వరూపాన్ని ప్రదర్శించడం ప్రతి ఒక్క తెలుగువారికీ గర్వకారణం. ముఖ్యంగా నిహారిక కొణిదెల సమర్పణలో, పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ మరియు శ్రీ రాధా దామోదర్ స్టూడియోస్ బ్యానర్లపై యువ ప్రతిభతో తెరకెక్కిన ఖకమిటీ కుర్రోళ్లుఖ చిత్రం జాతీయ స్థాయిలో ఉత్తమ చిత్రంగా ఎంపిక కావడం అభినందనీయం. పల్లెటూరి నేపథ్యంలో స్నేహం, కుటుంబ బంధాలు, సామాజిక విలువలు, భావోద్వేగాలను వెండితెరపై ఆవిష్కరించి జాతీయ అవార్డును అందుకోవడం ఈ చిత్ర బృందం సాధించిన ఘన విజయం“ అని కొనియాడారు. తెలుగు సినిమా కేవలం కమర్షియల్ హంగులకే పరిమితం కాకుండా కథ, కథనం, నటన, సాంకేతిక నైపుణ్యం, కాస్ట్యూమ్ డిజైనింగ్, మేకప్ మరియు అద్భుతమైన నిర్మాణ విలువలు.. ఇలా 24 క్రాఫ్టుల్లోనూ తన తిరుగులేని ప్రతిభను చాటుకుందని మంత్రి దుర్గేష్ ప్రశంసించారు. వెండితెరపై తెలుగు వారి సృజనాత్మకతకు, కష్టానికి దక్కిన గౌరవం ఈ జాతీయ పురస్కారాలని ఆయన పేర్కొన్నారు.

# హంద్రీనీవా కాలువ సామర్థ్యం 11,500క్యూసెక్కులకు పెంచాలి

● లైనింగ్ పనుల్లో భారీ ఎత్తున అవినీతి ● వైసిపి నేతలు ఆరోపణ ● త్వరలో ఉద్యమిస్తామని వెల్లడి



**అనంతపురం, జులై 19 ప్రభాతవార్త బ్యూరో:** రాయలసీమ జిల్లాల్లో సాగునీరు, తాగునీరు అందించే లక్ష్యంతో చేపట్టిన హంద్రీ నీవా ప్రాజెక్టు లైనింగ్ పనులను అనంతపురం జిల్లా కూడేరు మండలం చోళ సముద్రం వద్ద వైసిపి రాయలసీమ జిల్లాల నేతలు ఆదివారం పరిశీలించారు. గ్రేటర్ రాయలసీమ సాగునీటి హక్కుల కోసం ఇరిగేషన్ ప్రాజెక్టులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్న పార్టీ నిర్ణయం మేరకు హంద్రీనీవా కాలువను వైసిపి నేతలు పరిశీలించారు. రెండు కిలోమీటర్ల మేర రైతులు, పార్టీ శ్రేణులతో కలిసి వైసిపి అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఎస్వీ మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి శైలజానాథ్, మాజీ ఎమ్మెల్యేలు వై.విశ్వేశ్వరరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, మాజీ ఎంపీ రంగయ్య, జిల్లా పరిషత్ చైర్మన్ బోయ గిరిజమ్మ, వైసిపి జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డి, మంగమ్మ, గ్రేటర్ రాయలసీమ రాయలసీమ ప్రాజెక్టుల టాస్క్‌ఫోర్స్ కమిటీ అనంతపురం జిల్లా కోఆర్డినేటర్ నార్పల సత్యనారాయణ రెడ్డి, వైసిపి జిల్లా నేతలు మహాలక్ష్మి శ్రీనివాస్, రమేష్ గౌడ్, సోమశేఖర్ రెడ్డి, నదీమ్, వెన్నపూస రవీంద్రారెడ్డి, కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి, శ్రీదేవి తదితర నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వైసిపి నేతలు పాదయాత్రగా వెళ్లి కాలువ లైనింగ్ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా వైసిపి నేతలు మీడియాతో మాట్లాడారు. వైయస్ జగన్ సీఎం ఉన్నప్పుడు కూడా హంద్రీ నీవా ప్రధాన కాలువను 6500 క్యూసెక్కుల సామర్థ్యంతో వెడల్పు చేయాలని టెండర్లు కూడా ఇచ్చారన్నారు. రెండేళ్లలో మూడు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశామని సిఎం చంద్రబాబు చెబుతున్నారు. నిజంగా పనులు సక్రమంగా జరిగుంటే అనంతపురం జిల్లాకు 80 టీఎంసీల నీరు వచ్చేది. ఆ మేరకు నీళ్లు ఎందుకు రాలేదో సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక హంద్రీనీవాను 11500 క్యూసెక్కుల సామర్థంతో విస్తరిస్తాం అని చెప్పారు.

రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను వైఎస్ జగన్ 80శాతం పూర్తి చేశారు అని, రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను ఎన్జీటీకి వెళ్లి అడ్డుపడిన నాయకుడు చంద్రబాబు అని విమర్శించారు. తెలంగాణ అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి చెప్పిన మాటలను ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటిదాకా ఎందుకు ఖండించలేదు? ప్రశ్నించారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కోసం పోరాటం ఉధృతం చేస్తాం అని ఆయన చెప్పారు. చంద్రబాబు రాయలసీమకు తీవ్ర అన్యాయం చేశారు అని, తెలంగాణ అక్రమ ప్రాజెక్టులపై చంద్రబాబు నోరు మెదపడం లేదు అని విమర్శించారు. హంద్రీనీవా ప్రాజెక్టు పనులను నాసిరకం చేసి వందల కోట్ల అవినీతికి పాల్పడ్డారు అని, దోచుకోవడం.. దాచుకోవడమే చంద్రబాబు సిద్ధాంతమా? అని ఆయన ప్రశ్నించారు. హంద్రీనీవా ప్రాజెక్టు లైనింగ్ పనుల్లో వందల కోట్ల రూపాయల దోపిడీ జరిగింది అని, ఈ అవినీతి పై సమగ్ర విచారణ జరపాలి అని డిమాండ్ చేశారు. హంద్రీనీవా నిర్వీర్యం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తోంది అని ఘాటుగా విమర్శించారు. హంద్రీనీవా అడ్డుపెట్టుకుని టిడిపి కూటమి నేతలు భారీ దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. రానున్న రోజుల్లో రాయలసీమ వ్యాప్తంగా సాగునీటి ప్రాజెక్టుల కోసం ఉద్యమిస్తామన్నారు.



# హంద్రీ నీవా కాలవ పరిశీలన పేరుతో వైసిపి నేతల రాజకీయ డ్రామా

● జగన్ హయాంలో హంద్రీ నీవాకు చేసింది ఏమీ లేదు

● మంత్రి పయ్యావుల కేశవ్, కాలవ శ్రీనివాసులు ధ్వజం

**అనంతపురం, జులై 19 ప్రభాతవార్త బ్యూరో:** ప్రజాభిమానం కోల్పోయిన వైసిపి నాయకులు రాజకీయ ఉనికి కోసం తాపత్రయ పడుతున్నారని మంత్రి పయ్యావుల కేశవ్, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు విమర్శించారు. ఐదేళ్లపాటు హంద్రీనీవా ప్రాజెక్టును పూర్తిగా నిర్లక్ష్యం చేసిన వైసిపి వారు ఇప్పుడు హంద్రీనీవా కాలువ పరిశీలన పేరుతో రాజకీయ డ్రామాలకు తెరలేపడం ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నమేనని ఆరోపించారు. ఉరవకొండ సమీపంలో ఇటీవల విస్తరించిన హంద్రీనీవా కాలువ పనులను ఆదివారం పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ, 2014–19 మధ్య ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక చొరవతో హంద్రీనీవా కాలువ విస్తరణ పనులు వేగంగా సాగాయన్నారు. 2019 నాటికే దాదాపు 35 శాతం పనులు పూర్తయ్యాయని గుర్తు చేశారు. అయితే అనంతరం జగన్ రెడ్డి ప్రభుత్వం వాటిని అర్ధాంతరంగా నిలిపివేసి, ప్రాజెక్టు పురోగతిని పూర్తిగా దెబ్బతీసిందని ఆరోపించారు. జగన్మోహన్ రెడ్డి తన పాలనలో హంద్రీనీవాకు రూ.500 కోట్లు కూడా ఖర్చు చేయలేదని వారు విమర్శించారు. కాలువను 6,000 క్యూసెక్కులకు విస్తరిస్తామని, సమాంతరంగా మరో కాలువ నిర్మిస్తామని నమ్మబలికి, అధికారంలో ఉన్నన్ని రోజులు విస్తరణ ఊసేత్తకుండా జిల్లా ప్రజానీకాన్ని నిలువునా మోసగించిన జగన్ రెడ్డిని వైసిపి ప్రజాప్రతినిధులు ఎందుకు ప్రశ్నించలేదని నిలదీశారు. విస్తరణ పనులను నిలిపివేసి తట్టెడు మట్టి కూడా ఎత్తని వైసిపి నాయకులకు హంద్రీనీవా గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని వ్యాఖ్యానించారు. చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండేళ్లలోనే హంద్రీనీవా కాలువ విస్తరణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయగలిగామని తెలిపారు. అనంతపురం జిల్లా రైతులు, ప్రజల పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబుకి ఉన్న చిత్తశుద్ధికి హంద్రీనీవా పనులే నిదర్శనమని పేర్కొన్నారు. భవిష్యత్తులో వైసిపి అధికారంలోకి వచ్చే పరిస్థితే లేదన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి పాల్గొన్నారు.

## హస్తకళా మహోత్సవానికి విశేష ఆదరణ

● లేపాక్షి విసి, ఎండి విశ్వ మనోహర్ వెల్లడి

**విజయవాడ, జులై 19 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడలోని పటమట సెంటర్ సమీపంలోని మేరీస్ ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ హస్తకళా మహోత్సవం- 2026 కు నగర ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని లేపాక్షి వీసీ, ఎండీ విశ్వ మనోహర్ తెలిపారు. లేపాక్షి, వీసీ, ఎండీ విశ్వ మనోహర్ ఆదివారం మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఎన్నో రకాల, విభిన్న సంప్రదాయ కళాఖండాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయని చెప్పారు. ప్రజలు ఆసక్తిగా స్టాళ్లను సందర్శించి చేనేత చీరలు, హస్తకళా ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా కళాకారులకు ఆర్థికంగా ప్రోత్సాహం లభిస్తోందని పేర్కొన్నారు. ప్రదర్శన ప్రారంభమైనప్పటి నుంచి విక్రయాలు ఆశాజనకంగా పెరిగాయని తెలిపారు. ఒక్కో చేనేత వస్త్రం వెనుక ఉన్న కళాకారుల శ్రమ, నైపుణ్యాన్ని సందర్శకులు గుర్తించి ఆదరించడం సంతోషకరమన్నారు. ఈ ఆదరణ భారతీయ చేనేత, హస్తకళల పరిరక్షణకు మరింత బలాన్నిస్తుందని అన్నారు.

## ఆగస్టు 12న జాతీయ రిమోట్ సెన్సింగ్ దినోత్సవం

**విజయవాడ, జులై 19 ప్రభాతవార్త ప్రతినిధి:** భారత అంతరిక్ష పరిశోధన పితామహుడు డాక్టర్ విక్రమ్ సారాభాయ్ జయంతిని పురస్కరించుకుని ఇండియా స్పేస్ ల్యాబ్ ప్రతి సంవత్సరం ఆగస్టు 12న జాతీయ రిమోట్ సెన్సింగ్ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. దేశ అభివృద్ధి, సహజ వనరుల నిర్వహణ, పర్యావరణ పర్యవేక్షణ, విపత్తు నివారణ వంటి రంగాల్లో అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసి సమర్థవంతంగా వినియోగించడంలో డాక్టర్ విక్రమ్ సారాభాయ్ చేసిన దూరదృష్టితో కూడిన విశిష్ట సేవలను స్మరించుకుంటూ ఆయన జన్మదినాన ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విపత్తు సంసిద్ధత, పర్యవేక్షణ, అంచనా, ప్రతిస్పందన. సుస్థిర అభివృద్ధిలో భౌగోళిక సాంకేతికతల పాత్రపై అవగాహన పెంపొందించడంతో పాటు జ్ఞానాన్ని విస్తరించే లక్ష్యంతో “విపత్తు నిర్వహణ కోసం రిమోట్ సెన్సింగ్ ,జీఐఎస్‌అంశంపై ఆన్‌లైన్ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, పరిశోధకులు, ప్రభుత్వ అధికారులు, విపత్తు నిర్వహణ నిపుణులు మరియు ఇతర ఆసక్తి గల భాగస్వాములను దృష్టిలో ఉంచుకుని ఈ వర్క్‌షాప్‌ను ప్రత్యేకంగా రూపొందించినట్లు తెలిపారు. ఇందులో రిమోట్ సెన్సింగ్, జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ పర్యావరణ పరిశీలన సాంకేతికతలు, జియో ఏఐ, డ్రోన్ మ్యాపింగ్, మెషిన్ లెర్నింగ్ అనువర్తనాలు, అలాగే వాస్తవ ప్రపంచ విపత్తు నిర్వహణకు సంబంధించిన కేస్ స్టడీస్ వంటి పలు కీలక అంశాలపై నిపుణులు అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. ఈ ఆన్‌లైన్ వర్క్‌షాప్‌ను 2026 ఆగస్టు 12న నిర్వహించనున్నట్లు తెలిపారు. పాల్గొనదలచిన వారు రూ. 270 నమోదు రుసుము చెల్లించి తమ పేరును నమోదు చేసుకోవాలని సూచించారు. నమోదు ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. జూలై 30 వరకు కొనసాగుతుందని, ఆసక్తి గల వారు సంబంధిత వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. వర్క్‌షాప్‌లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ఇసర్టిఫికేట్ అందజేయనున్నట్లు ఇండియా స్పేస్ ల్యాబ్ డైరెక్టర్ వెల్లడించారు.

## పైప్‌లైన్‌లో చిక్కుకుని చిన్నారి మృతి



**డెహ్రాడూన్, జులై 19:** ఉత్తరాఖండ్‌లో కురుస్తున్న ఎడతెరిపి లేని భారీ వర్షాలు మరో విషాదానికి కారణమయ్యాయి. వికాస్‌నగర్‌లో జరిగిన ఘటన ప్రతి ఒక్కరినీ కలిచివేసింది. ఆడుకుంటూ ఉన్న ఆరేళ్ల చిన్నారి క్షణాల్లోనే వరద ప్రవాహంలో కొట్టుకుపోయి ప్రాణాలు కోల్పోవడం స్థానికులను తీవ్ర విషాదంలో ముంచెత్తింది. వికాస్ నగర్‌లో భారీ వర్షం కురుస్తున్న సమయంలో ఆరేళ్ల అర్మాన్ రోడ్డు పక్కన ఇతర పిల్లలతో కలిసి ఆడుకుంటున్నాడు. అదే సమయంలో ఒక్క సారిగా ఉధృతంగా ప్రవహించిన వర్షపు నీరు అతడిని సమీపంలోని మురుగు కాలువ వైపు లాక్కెళ్లింది. బలమైన ప్రవాహాన్ని తట్టుకోలేక బాలుడు నేరుగా సుమారు 10 అంగుళాల వెడల్పు ఉన్న డ్రైనేజీ పైపులోకి కొట్టుకుపోయాడు. క్షణాల్లో జరిగిన ఈ ఘటనను చూసిన స్థానికులు వెంటనే సహాయక చర్యలు ప్రారంభించారు. బాలుడు పైపులో చిక్కుకున్నాడని గుర్తించిన గ్రామస్తులు వెంటనే జేసీబీ యంత్రాన్ని తీసుకొచ్చి పైపును పగలగొట్టే ప్రయత్నం చేశారు. సమయం గడుస్తున్న కొద్దీ ఆందోళన మరింత పెరిగింది. అందరూ ప్రాణాలతో బయటపడతాడని ఆశించినప్పటికీ, పైపును తొలగించి బాలుడిని బయటకు తీసే సమయానికి అతడు అప్పటికే స్పృహ కోల్పోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతడిని సమీప ఉపజిల్లా ఆసుపత్రికి తరలించినా, పరీక్షించిన వైద్యులు అప్పటికే అతడు మరణించినట్లు ప్రకటించారు. ఈ దృశ్యం అక్కడున్న వారందరినీ కన్నీటిపర్యంతం చేసింది.

# వికె ఆదినారాయణ రెడ్డి స్ఫూర్తితో పనిచేద్దాం

## కమ్యూనిస్టు యోధుడు వికె వర్ధంతి సభలో ఎఐఎస్‌ఎఫ్ నేతల నిర్ణయం

**అనంతపురం, జులై 19 ప్రభాతవార్త బ్యూరో:** ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు, మాజీ ఎమ్మెల్యే, కమ్యూనిస్టు పార్టీ రూపకర్తల్లో ఒకరైన వికె ఆదినారాయణ రెడ్డి స్ఫూర్తితో, ఆయన ఆశయాల సాధన కోసం కృషి చేయాలని ఎఐఎస్‌ఎఫ్ మాజీ నాయకులు నిర్ణయం తీసుకున్నారు. అనంతపురంలో వికె ఆదినారాయణరెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం పెద్ద ఎత్తున నిర్వహించారు. వికె భవన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న మాజీ ఏఐఎస్‌ఎఫ్ నాయకులు హాజరయ్యారు. వికె రంగారెడ్డి, తిరుపతయ్య ఇతర నాయకుల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ మాజీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వీకే ఆదినారాయణ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వీకేతో వారికున్న సాన్నిహిత్యాన్ని, పార్టీ కోసం, ప్రజల కోసం నీతి నిజాయితీతో చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎఐఎస్‌ఎఫ్ మాజీ నాయకులు వికె రంగారెడ్డి, వై.మధుసూదనరెడ్డి, తిరుపతయ్య, మల్లికార్జున మాట్లాడుతూ నీతి, నిజాయితీ, నిబద్ధత, విలువలు అన్న పదాలు వికె ఆది



మాట్లాడుతున్న వికె రంగారెడ్డి

నారాయణ రెడ్డి నుంచి వచ్చాయా అన్న విధంగా ఆయన ఉండేవారన్నారు. కమ్యూనిస్టు పార్టీ రూపకర్తల్లో ఒకరిగా ఉంటూ జీవితం మొత్తం అదే సిద్ధాంతాలతో ఆయన జీవించారన్నారు. స్వాతంత్ర సంగ్రామంలో కూడా తన వంతు పాత్ర పోషించారన్నారు. శాసనసభ్యునిగా కూడా పనిచేసి ప్రజలకు సేవలు అందించారని గుర్తు చేసుకున్నారు. ఫ్యాక్షనిజానికి వ్యతిరేకంగా ఆయన చేసిన పోరాటాలు ఎప్పటికీ నిలిచే ఉంటాయన్నారు. కొన్ని సందర్భాల్లో ముఠాకక్ష నేతల వ్యవహార శైలి వల్ల భయానక వాతావరణం ఏర్పడినప్పుడు వికె గట్టిగా స్పందించిన తీరు ఎప్పుడూ గుర్తు ఉంటుందన్నారు. కరవు నివారణ కోసం రైతుల పక్షాన ఆయన నిలబడిన తీరు మరే నాయకుడికి సాటి రావన్నారు. ఎఐఎస్‌ఎఫ్ మాజీ నాయకులంతా వికె ఆదినారాయణ రెడ్డి స్ఫూర్తితో ఒక్కటవ్వాలని నిర్ణయించుకున్నారు. ఇప్పటికే వివిధ రంగాల్లో వివిధ పార్టీల్లో స్థిరపడిన వారంతా రాజకీయాల కతీతంగా ఒక్కటై ముందుకు నడవాలని నిర్ణయించుకున్నారు. వికె ఆదినారాయణ రెడ్డి జిల్లాకు చేసిన సేవలకు గుర్తింపుగా అనంతపురంలో వికె విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, ఇందుకు అవసరమైన సన్నాహాలు చేయాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దస్తగిరి, లీలాధర్, రామచంద్రారెడ్డి, రాయదుర్గం రామాంజనేయులు, సూర్యనారాయణ, శంకర్ రెడ్డి, నిర్మల, వికె రాధా, శంకర్ రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, శేషాద్రి, గోవిందరెడ్డి, విశ్వనాథరెడ్డి, రాము, తదితర నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యత

- సోషల్ మీడియాకు విద్యార్థులు దూరంగా ఉండాలి



**కోవూరు (నెల్లూరు), జులై 19 ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా చొరవ తీసుకుని వసతి గృహంలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన వస్తువులను పంపిణీ చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. కోవూరులోని బాలికల వసతి గృహ సముదాయంలో ఆదివారం విద్యార్థినులకు ప్రభుత్వం ద్వారా వచ్చిన వివిధ రకాల మెటీరియల్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసమే ప్రభుత్వం ఇటువంటి కార్యక్రమాలను చేపడుతుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రతి విద్యార్థి సమాజంలో ఉన్నత స్థాయికి వెళ్లాలనే ఆకాంక్షతో కష్టపడి చదువుకోవాలని సూచించారు. యువత భవిష్యత్తును పాడు చేస్తున్న సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని సూచించారు. జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారిణి శోభారాణి, ఏఎస్‌డబ్ల్యూ తిరుపతయ్య, ఎంపీపీ పార్వతి, పెన్నా డెల్టా ఆయకట్టు చైర్మన్ జెట్టి రాజగోపాల్‌రెడ్డి, జొన్నవాడ దేవస్థాన చైర్మన్ అశోక్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ శ్యామ్‌సుందర్‌రెడ్డి, ఎంఈవో-2 వై. చెంచలక్ష్మమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు మల్లారెడ్డి, మల్లికార్జునరెడ్డి బాల రవి, వెంకట్, శ్రీనివాసులురెడ్డి, వెంకటేశ్వర్లు, జహంగీర్, సాధిక్, మురళి, సంక్షేమాధికారులు పద్మ, సుప్రజ, శోభారాణి, సుమలత, సునీత, దయాకర్, కూటమి నేతలు ఉన్నారు.

# నరసాపురంలో రూ.58 లక్షలతో అభివృద్ధి: ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి

**ఇందుకూరుపేట (నెల్లూరు), జులై 19 ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఇస్తోందని కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నరసాపురం పంచాయతీలో రూ.58 లక్షల విలువైన పలు అభివృద్ధి పనులకు ఆమె ప్రారంభోత్సవం చేశారు. అనంతరం గ్రామ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడమే తన లక్ష్యమని, కనీసం 50 శాతం హామీలు నెరవేర్చిన తర్వాతే ఆయా గ్రామాల్లో పర్యటిస్తానని ముందుగానే స్థానిక నాయకులకు చెప్పినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే అనేక ప్రాంతాల్లో ఆ లక్ష్యాన్ని చేరుకున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మైపాడు కాలువ, మైపాడు బ్రాంచి కాలువపై రూ.14.50 లక్షలతో నరసాపురం గ్రామ సమీపంలో నిర్మించిన రెండు కల్వర్టులను ప్రారంభించారు. రాబోయే రోజుల్లో గ్రామ ప్రజలు కోరిన సీసీ రోడ్లు, డ్రెయిన్లు, గృహాలు తదితర పనులను కూడా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాలకు తల్లికి వందనం పథకాన్ని వర్తింపజేసినందుకు ఆనందం వ్యక్తం చేస్తూ అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు నిర్వహించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కళ్యాణ్ రెడ్డి, తెదేపా మండల అధ్యక్షులు పవన్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ఎన్‌ఎంఈ డైరెక్టర్ వీరేంద్ర నాయుడు, మండల బిజెపి అధ్యక్షులు కైలాసం శ్రీనివాసులు రెడ్డి సురేష్ నాయుడు, దాసరి విజయ్, దేవస్థాన చైర్మన్ గుండాల కృష్ణారెడ్డి, అవ్వారు ఏడుకొండలు, బిసి సెల్ అధ్యక్షుడు మారుబోయిన జనార్దన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




# జపాన్‌లో మెరిసిన మన బంగారం

ఒలింపిక్స్ డబుల్ మెడలిస్ట్ పీవీ సింధు ఖాతాలో ఈ రెండేళ్లలో ఒక్క టైటిల్ లేదు. ఆ మాటకొస్తే 2019 వరల్డ్ ఛాంపియన్‌షిప్ గోల్డ్, 2020 టోక్యో ఒలింపిక్స్ బ్రాంజ్‌మెడల్ తప్పిస్తే ఆ తర్వాత పెద్ద విజయాలు లేవు. 2024లో సొంతగడ్డపై సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ టైటిలే చివరిది. దీంతో సింధు ఖేల్ ఖతమ్, ఇక రిటైర్మెంట్ చెప్పడమే ఆలస్యం అన్న సన్నాయి నొక్కులు బలంగానే వినబడ్డాయి. పదే పదే గాయాలు, ఆధునిక ఆటలో వస్తున్న కఠినమైన మార్పులు, అనామక ప్లేయర్ల చేతుల్లోనూ ఓటములు, రెండేళ్లుగా కొనసాగుతున్న టైటిల్ కరువు వంటి కారణాల వల్ల తన అత్యుత్తమ ఫామ్ తిరిగి పొందుతుందా? టైటిళ్లను గెలుచుకునే సత్తా ఆమెకు ఉందా? అన్న సందేహాలకు ఒక్క జపాన్ ఓపెన్ టైటిల్‌తో సింధు చెక్ పెట్టింది.

* ఫైనల్లో యమగుచిపై విజయం
* తొలి భారత్ షట్లర్‌గా రికార్డు
* ఆనమ్మకమే గెలిపించింది-సింధు

**టోక్యో, జులై 19:** భారత స్టార్ షట్లర్ పీవీ సింధు ఆట తిరిగి గాడిలో పడింది. రెండేళ్లుగా టైటిల్‌కు ముఖం వాచిన సింధూ ఎట్టకేలకు ఆ కొరతను తీర్చుకుంది. జపాన్ ఓపెన్ ఫైనల్లోకి ప్రవేశించిన తొలి సారే టైటిల్ అందుకుని అరుదైన రికార్డు అందుకుంది. మహిళల సింగిల్స్ ఫైనల్లో జపాన్‌కు చెందిన ప్రపంచ నంబర్-3 అకానె యమగుచిపై 21-17, 21-17 తేడాతో వరుస సెట్లలో ఓడించింది. జపాన్ ఓపెన్ సూపర్ 750 టోర్నీ నెగ్గిన తొలి భారత షట్లర్‌గా నిలిచింది. 2019 ప్రపంచ ఛాంపియన్ షిప్ తర్వాత సింధుకు ఇదే అతిపెద్ద టైటిల్.

**కచ్చితమైన స్మాష్‌లతో...**

ఆదివారం టోక్యో మెట్రోపాలిటన్ జిమ్నాసియంలో జరిగిన ఫైనల్లో 31 ఏళ్ల పీవీ సింధు అద్భుత ప్రదర్శన కొనసాగించింది. సొంత మైదానం, సొంత అభిమానుల మధ్య ఆడుతున్న యమగుచిపై ఆరంభం నుంచే సింధూ ఆధిక్యం ప్రదర్శించింది. వేగవంతమైన క్రాస్‌కోర్ట్ డ్రాప్‌లు, కచ్చితమైన స్మాష్‌లతో విరుచుకుపడింది. యమగుచి లయను నిరంతరం దెబ్బతీసింది. కీలకసమయంలో ఒత్తిడిని జయిస్తూ సింధు మొదటి గేమ్‌ను 21-17 తేడాతో కైవసం చేసుకుంది. తొలి గేమ్ నెగ్గిన ఊపులో రెండవ గేమ్‌లో సింధు తన దూకుడును మరింత పెంచింది. దీంతో ఒత్తిడికి లోనైన యమగుచి అనవసర తప్పిదాలు చేసింది. టోక్యో ప్రేక్షకుల మద్దతుతో యమగుచి గేమ్ చివరిలో ఉత్సాహంగా పుంజుకున్నప్పటికీ, సింధు చలించకుండా నిలిచింది. తన ఐకానిక్ 2019 ప్రపంచ ఛాంపియన్‌షిప్ ప్రదర్శనను ప్రతిబింబించే వ్యూహాత్మక క్రమశిక్షణతో సింధు రెండో గేమ్‌ను 21-17 తేడాతో ముగించి చారిత్రాత్మక విజయాన్ని సొంతం చేసుకుంది. క్వార్టర్ ఫైనల్లో ఒకుహార వాకోవర్ ఇవ్వడం, సెమీస్‌లో యుఫీయ్ మధ్యలోనే నిష్క్రమించడంతో తాను ఫైనల్‌కు తేలికగా రాలేదని ఈ తుదిపోరుతో నిరూపించింది. సింధు తన చివరి టైటిల్‌ను 2024లో సయ్యద్ మోడీ ఇంటర్నేషనల్‌లో గెలుచుకుంది. రెండేళ్ల టైటిల్ విరామానికి జపాన్ టోర్నీతో ఫుల్‌స్టాప్ పెట్టింది. వచ్చే నెలలో జరిగే ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో సత్తా చాటడంపై దృష్టి సారించింది.

**కష్టకాలంలోనూ నమ్మకం కోల్పోలేదు-సింధు**

టైటిల్ అందుకున్న పీవీ సింధు భావోద్వేగానికి గురైంది. కష్టకాలంలో కూడా తనపై నమ్మకం కోల్పోలేదని.. తాను టైటిల్ సాధించగలన్న ఎపుడూ విశ్వసించానని, ఆ నమ్మకమే తన విజయానికి కారణమైందని వెల్లడించింది. అటాకింగ్ గేమ్ నా బలం. ఇప్పుడు కోర్టులో స్వేచ్ఛగా కదులుతూ దూకుడుగా ఆడగలుగుతున్నాను. అనవసర తప్పిదాలను తగ్గించగలిగితే మ్యాచ్‌పై పూర్తి నియంత్రణ సాధించవచ్చు. అదే ఈ టోర్నీలో నాకు కలిసొచ్చింది అని సింధు వివరించింది.

వచ్చే నెలలో జరగనున్న ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో ఇదే జోరును కొనసాగించి రికార్డు స్థాయిలో ఆరో పతకాన్ని సాధించడమే తన లక్ష్యమని సింధు స్పష్టం చేసింది. జపాన్ ఓపెన్ గెలుపు ఎంతో ప్రత్యేక మైందని, చాలా కాలంగా దీని కోసమే కష్టపడుతున్నానని, గెలిచిన వెంటనే తన కళ్లలో ఆనందభాష్పాలు వచ్చాయని వెల్లడించింది. ఈ ప్రయాణంలో తనకు తోడున్న కోచ్‌లకు, వెన్నంటే ఉన్న తల్లిదండ్రులు, భర్త, అత్తమామలకు సింధు కృతజ్ఞతలు తెలిపింది.

## ఫ్రాన్స్ చిత్తు: మూడో స్థానంలో ఇంగ్లాండ్

**న్యూయార్క్, జులై 19:** ఫిఫా ప్రపంచకప్ ఫైనల్ చేరడంలో విఫలమైన ఇంగ్లాండ్ మూడోస్థానం పోరులో అదరగొట్టింది. గోల్స్ వర్షం కురిసిన మ్యాచ్‌లో ఫ్రాన్స్‌ను 6-4 తేడాతో ఓడించి మూడో స్థానం పొందింది. ఈ మ్యాచ్‌లో మొత్తం10గోల్స్ నమోదయ్యాయి. ప్రపంచ కప్ నాకౌట్ మ్యాచ్‌లో ఇన్ని గోల్స్ నమోదుకావడం కూడా ఇదే మొదటిసారి. 1966లో విజేతగా నిలిచిన ఇంగ్లాండ్‌కు... ఈసారి బ్రాంజ్ మెడల్ దక్కింది.




ఫుట్‌బాల్ దిగ్గజాలు ఫ్రాన్స్, ఇంగ్లాండ్ మ్యాచ్ ఉత్కంఠ రేపుతోందని ఆశించినా చివరకు ఏకపక్షంగా ముగిసింది. మ్యాచ్ ఆరంభం నుంచే ఇంగ్లాండ్ ఆధిక్యం ప్రదర్శించింది. తొలి అర్ధభాగంలోనే ఏకంగా నాలుగు గోల్స్ నమోదుచేసింది. మూడో నిమిషంలోనే డెక్లాన్ రైస్ గోల్ కొట్టి ఇంగ్లాండ్ గోల్స్ బోణీ చేశాడు. ఆ తర్వాత 18వ నిమిషంలో ఎజ్రి కొన్సా గోల్ చేసి 2-0 ఆధిక్యం అందించాడు. ఇక 37వ నిమిషంలో, ఇంజ్యూరీ టైమ్ 45+1 నిమిషంలో బుకాయో సకా డబుల్ ధమాకా చేశాడు. దీంతో తొలి అర్ధభాగం ముగిసే సరికి ఇంగ్లాండ్ 4-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.

రెండో అర్ధభాగంలో ఫ్రాన్స్ పుంజుకుంది. స్టార్ ఆటగాడు క్లియాన్ ఎంబాపె 48వ నిమిషం, 66వ నిమిషాల్లో గోల్స్ కొట్టి ఫ్రాన్స్‌ను రేసులోకి తెచ్చాడు. బ్రాడ్లే బార్కోలా 54వ నిమిషంలో చేసిన గోల్‌తో ఇంగ్లాండ్ ఆధిక్యాన్ని 3-4కు ఫ్రాన్స్ తగ్గించింది. కానీ, 87వ నిమిషంలో లభించిన పెనాల్టీకిక్‌ను గోల్‌గా మలిచిన బుకాయో హ్యాట్రిక్‌తో ఇంగ్లాండ్‌కు 5-3 ఆధిక్యం ఇచ్చాడు. ఆట అదనపు సమయంలో ఫ్రాన్స్ ఆటగాడు ఔస్మానె డెంబెలె (90+6వ నిమిషం) గోల్ కొట్టాడు. మరికాసేపటికే జుడె బెల్లింగ్‌హామ్ (90+8వ నిమిషం) గోల్‌తో ఇంగ్లాండ్ 6-4తో విజయాన్ని అందుకుంది.

**గోల్డెన్ బూట్ రేసులో ఎంబాపె**

ఫ్రాన్స్ స్టార్ ఆటగాడు ఎంబాపె మాత్రం రికార్డులు సృష్టించాడు. వరల్డ్ కప్‌లో అత్యధిక గోల్స్ చేసిన ప్లేయర్‌గా ఘనత సాధించాడు. అతడి ఖాతాలో ప్రస్తుతం 22 గోల్స్ ఉన్నాయి. ఎంబాపె తర్వాత మెస్సీ (21) ఉన్నాడు. ఫైనల్‌లో మెస్సీ రెండు గోల్స్ చేస్తే మళ్లీ ఈ రికార్డు సొంతమవుతుంది. ఈ ప్రపంచ కప్‌లో గోల్డెన్ బూట్ రేసులోనూ ఎంబాపె ముందున్నాడు. ఎంబాపె 10 గోల్స్ చేయడంతోపాటు 4 అసిస్ట్స్ ఇచ్చాడు. మరోవైపు మెస్సీ 8 గోల్స్ చేసి 4 అసిస్ట్స్ ఇచ్చాడు.

## లార్డ్స్‌లో హిట్‌మ్యాన్



## పరుగుల వేటలో భారత్ బోల్తా

### వన్డే సిరీస్ ఇంగ్లాండ్ కైవసం

**లార్డ్స్, జులై 19:** లార్డ్స్‌లో జరిగిన మూడో వన్డేలో టీమిండియా లక్ష్య చేధనలో బోల్తా పడింది. 388 పరుగుల భారీ లక్ష్య చేధనలో విఫలమైన టీమిండియా.. 50 ఓవర్లలో 7 వికెట్లకు 360రన్స్‌కే పరిమితమైంది. దీంతో ఇంగ్లాండ్ 27 పరుగుల తేడాతో గెలుపొంది మూడు వన్డేల సిరీస్‌ను 2-1తో చేజిక్కించుకుంది.

భారీ లక్ష్య చేధనలో ఓపెనర్లు రోహిత్ శర్మ (110 బంతుల్లో 138; 17 ఫోర్లు, 5 ఫోర్లు), శుభ్‌మన్ గిల్(84 బంతుల్లో 77; 10 ఫోర్లు, 1 సిక్స్) ఫ్లయింగ్ స్టార్ట్ ఇచ్చారు. ఇద్దరూ దంచి కొడుతూ తొలి వికెట్‌కు 25 ఓవర్లలో 147 రన్స్ అందించారు. 84 బంతుల్లో సెంచరీ చేశాడు. లార్డ్స్‌లో వన్డేల్లో సెంచరీ చేసిన తొలి భారత బ్యాటర్‌గా రోహిత్ రికార్డు సృష్టించాడు. వన్డే చరిత్రలోనే ఎక్కువ వయసులో (39 యేళ్ల 80 రోజులు) సెంచరీ సాధించిన భారత ఆటగాడిగానూ రోహిత్ నిలిచాడు. ఇంగ్లాండ్ గడ్డపై వన్డేల్లో అత్యధిక సెంచరీలు (8) చేసిన పర్యాటక ప్లేయర్‌గానూ హిట్‌మ్యాన్ రికార్డు నెలకొల్పాడు. ఇక కోహ్లీతో కలిసి రెండో వికెట్‌కు 113 పరుగులు జోడించాడు. రోహిత్ అవుటైనా కోహ్లీ(60 బంతుల్లో 74; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. చివర్లో భారత్ వేగంగా వికెట్లు కోల్పోయి పరాజయం పొందింది.

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 387 పరుగులు చేసింది. వన్డేల్లో భారత్‌పై ఇంగ్లాండ్‌కు ఇదే అత్యధిక స్కోరు. లార్డ్స్ మైదానంలోనూ వన్డేల్లో ఇది అత్యధిక స్కోరు. ఓపెనర్ బెన్ డకెట్ (135 బంతుల్లో 141; 18 ఫోర్లు, 1 సిక్స్) శతకంతో విరుచుకుపడగా.. మరో ఓపెనర్ జాకబ్ బెతెల్ (93 బంతుల్లో 91;11 ఫోర్లు, 2 సిక్స్‌లు) కొద్దిలో సెంచరీ మిస్ చేసుకున్నాడు. తొలి వికెట్‌కు 192రన్స్ జోడించారు. సెంచరీ చేసేలా కనిపించిన బెతెల్‌ను ప్రసిద్ధ్ కృష్ణ అవుట్ చేశాడు. వన్డేల్లో ఇంగ్లాండ్‌కు ఏ వికెట్‌కైనా ఇదే అత్యధిక భాగస్వామ్యం. ఫస్ట్ డౌన్‌లో వచ్చిన జో రూట్ (48 బంతుల్లో 74నాటౌట్; 9 ఫోర్లు) మరోసారి రాణించాడు. డకెట్, రూట్ 80 బంతుల్లో 101 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. డకెట్‌ను రిటర్న్ క్యాచ్‌తో ప్రిన్స్ యాదవ్ పెవిలియన్ చేరాడు. చివర్లో జోస్ బట్లర్ (13 బంతుల్లో 41నాటౌట్; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపులు మెరిపించాడు. ఇంగ్లాండ్ చివరి 3 ఓవర్లలో ఏకంగా 62 పరుగులు చేసింది.

## ఈవారం మార్కెట్లకు ఐదు కొత్త ఫండ్స్



**ముంబయి, జులై 19:** మ్యూచువల్ ఫండ్ లలో పెట్టుబడులకు ఈ వారం 5 కొత్త పథకాలు మార్కెట్‌లోకి వస్తున్నాయి. సాధారణంగా న్యూఫండ్ ఆఫర్‌వేళ ప్రతి యూనిట్ ధర రూ.10గా ఉంటుంది. కొత్తగా ఇన్వెస్ట్ చేయాలనుకునేవారు లేదా తమ పోర్ట్ ఫోలియోను డైవర్సిఫై చేయాలనుకునే వారికి ఇది మంచి అవకాశంగా చెప్పవచ్చు. లాంచ్ అవుతున్న మొత్తం 5 కొత్త ఫండ్లలో రెండు ఈక్విటీ ట్రేడెడ్ ఫండ్స్ ఉండగా రెండు ఫండ్ ఆఫ్ ఫండ్స్ ఉన్నాయి. ఒకటి ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ కేటగిరీలో వస్తోంది. హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ, ఎస్‌బీఐ వంటి ప్రముఖ అసెట్ మేనేజ్మెంట్ కంపెనీలు ఈ జాబితాలో ఉన్నాయి. హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్ నుంచి రెండు కొత్త స్కీమ్స్ వస్తున్నాయి. హెచ్‌డీఎఫ్‌సీ నిఫ్టీ మెటల్ ఈటీఎఫ్, హెచ్‌డీఎఫ్‌సీ నిఫ్టీ మెటల్ ఈటీఎఫ్ ఫండ్ ఆఫ్ ఫండ్ సోమవారం మొదలవుతోంది. ఈటీఎఫ్ చందా ఆఫర్ ఈనెల 24వ తేదీన ముగియనుండగా ఫండ్ ఆఫ్ ఫండ్ స్కీమ్ సబ్‌స్క్రిప్షన్ ఆగస్టు 3వ తేదీ వరకు కొనసాగనుంది.

ఐసీఐసీఐ ప్రూడెన్షియల్ బీఎస్‌ఈ ఇన్సూరెన్స్ ఈటీఎఫ్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ 20నుంచి 28వరకూ కొనసాగుతుంది. ఇందులో కనీస పెట్టుబడి రూ.1000గా ఉంది. ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ నుంచి ఒక ఫండ్ ఆఫ్ ఫండ్ లాంచ్ అయింది. ఎస్‌బీఐ నిఫ్టీ మిడ్ క్యాప్ 150 మూమెంటమ్ 50 ఈటీఎఫ్ ఫండ్ ఆఫ్ ఫండ్ 22వ తేదీన ప్రారంభమయి ఆగస్టు 4వ తేదీ వరకు అందుబాటులో ఉంటుంది. ఇందులో కనీస పెట్టుబడి రూ.5000గా నిర్ణయించారు. యాక్సిస్ మ్యూచువల్ ఫండ్ నుంచి ఆల్ఫాగ్రెప్ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ 22వ తేదీ మొదలై ఆగస్టు 4వ తేదీ వరకు కొనసాగనుంది. ఇందులో కనీస పెట్టుబడి రూ.500గా నిర్ణయించారు.



## ఇరాన్ వార్, కార్పొరేట్ ఫలితాలపైనే..
## ఈవారం ఇన్వెస్టర్ల ఫోకస్

**ముంబయి, జులై 19:** అమెరికా-ఇరాన్ మధ్య కొనసాగుతున్న యుద్ధ ఉద్రిక్తతలు20 నుంచి కొనసాగే వారంలో ప్రపంచ మార్కెట్లను ఒడిదుడుకులకు దారితీసే అవకాశం ఉండగా, మరోవైపు తొలి త్రైమాసికం ఫలితాలపైనా ఇన్వెస్టర్ల ఫోకస్ పెరుగుతుంది. ఈ వారంలో భారత ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్, అల్ట్రాటెక్ సిమెంట్, బజాజ్ ఆటో, అదానీ పవర్, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్, బీపీసీఎల్, నెస్లే ఇండియా, సిప్లా, ఎన్‌టీపీసీ, బ్యాంక్ ఆఫ్ బరోడా వంటి ప్రముఖ కంపెనీలు ఆర్థిక ఫలితాలను ప్రకటించనున్నాయి. డిమాండ్ పరిస్థితులు, లాభదాయకత (మార్జిన్లు), మూలధన వ్యయం, బ్యాంకుల ఆస్తుల నాణ్యత, రుణాల వృద్ధి, ముడిసరుకు వ్యయాలు, కొత్త ఆర్థిక సంవత్సరంలో వ్యాపార అంచనాలపై కంపెనీల యాజమాన్యాల వ్యాఖ్యలను పెట్టుబడిదారులు నిశితంగా పరిశీలించనున్నారు. గల్ఫ్‌వార్ యుద్ధ పరిణామాలు అంతర్జాతీయ చమురు ధరలు, ఈక్విటీ మార్కెట్లపై ప్రభావం చూపే అవకాశముందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. ఈ వారంలో భారత్‌తో పాటు అమెరికా, యూరోపియన్ యూనియన్‌కు సంబంధించిన పలు కీలక ఆర్థిక గణాంకాలు విడుదల కానున్నాయి. జూలై నెల తయారీ, సేవల కొనుగోలు నిర్వాహకుల సూచీ గణాంకాలు శుక్రవారం విడుదల కానున్నాయి.

దేశ విదేశీ మారక నిల్వల తాజా వివరాలు కూడా వెలువడనున్నాయి. యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ వడ్డీ రేట్లపై నిర్ణయాన్ని ప్రకటించనుంది. గురువారం ప్రారంభ నిరుద్యోగ భృతి దరఖాస్తుల గణాంకాలు, శుక్రవారం తయారీ మరియు సేవల పిఎంఐ గణాంకాలు విడుదల కానున్నాయి. పెట్టుబడిదారుల దృష్టికంపెనీల త్రైమాసిక ఫలితాలు, అమెరికా-ఇరాన్ యుద్ధ పరిణామాలు, భారత్, అమెరికా, యూరప్ నుంచి వచ్చే కీలక ఆర్థిక గణాంకాల నేపథ్యంలో ఈ వారం స్టాక్ మార్కెట్లలో అధిక హెచ్చుతగ్గులు కనిపించే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా.



## తుదిదశలో హెచ్‌డిఎఫ్‌సి ఎండి సిఇఒ నియామకం

**ముంబయి, జులై 19:** దేశంలో అతిపెద్ద ప్రైవేట్ రంగ బ్యాంక్ అయిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఎండిసిఇఒ నియామక ప్రక్రియ తుది దశకు చేరుకున్నట్లు డిప్యూటీ ఎండీ కైజాద్ భరుచా వెల్లడించారు. ఈ అంశాన్ని బ్యాంకు గవర్నెన్స్, నామినేషన్ అండ్ రెమ్యునరేషన్ కమిటీతో పాటు డైరెక్టర్ల బోర్డు పరిశీలిస్తోందని, త్వరలోనే ప్రక్రియ పూర్తవుతుందని చెప్పారు. ప్రస్తుతంబ్యాంక్ ఎండీ, సీఈఓగా ఉన్న శశిధర్ జగదీశన్ పదవీకాలం ఈ ఏడాది అక్టోబర్‌లో ముగియనుంది. ఆయన 2020లో మూడేళ్ల కాలానికి నియమితులై, 2023లో మరో మూడేళ్ల పొడిగింపు పొందారు. తాజా పదవీకాలం అక్టోబర్‌లో ముగియనున్న నేపథ్యంలో, పునర్నియామక ప్రక్రియపై ఆర్బీఐకి ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తున్నామని, నియంత్రణ పరమైన ఎలాంటిఇబ్బందులు ఉండబోవని అన్నారు. ప్రస్తుతం 3 సభ్యులతో కూడిన జీఎన్‌ఆర్‌సీకి నాబార్డ్ మాజీచైర్మన్ హర్ష్ కుమార్ భన్వాలా అధ్యక్షత వహిస్తున్నారు. కమిటీలో సందీప్ పరేఖ్, రంగనాథ్ సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ అభ్యర్థి లేదా అభ్యర్థుల పేర్లను సిఫారసు చేసిన అనంతరం, కొత్త పార్ట్‌టైమ్ చైర్మన్ రాజీవ్ కుమార్ అధ్యక్షతన ఉన్న డైరెక్టర్ల బోర్డు వాటిని పరిశీలించి ఆమోదిస్తుంది.

## టాప్ ఐదు కంపెనీల్లో 1.54 లక్షల కోట్ల పెరుగుదల

**ముంబయి, జులై 19:** దేశీయ ఈక్విటీ మార్కెట్లలో సానుకూల ధోరణి కొనసాగడంతో గత వారం దేశంలోని అత్యంత విలువైన టాప్10 కంపెనీల్లో ఐదు సంస్థల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ. 1.54 లక్షల కోట్లు పెరిగింది. ఈ వృద్ధిలో ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ అగ్రస్థానంలో నిలిచింది. లాభపడిన సంస్థలు గత వారం రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసీఐసీఐ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టీసీఎస్, బజాజ్ ఫైనాన్స్ మార్కెట్‌విలువలో గణనీయమైన పెరుగుదలను నమోదు చేశాయి. టీసీఎస్ మార్కెట్ విలువ 72,072.30కోట్లు పెరిగి 8లక్షల 20 వేల 672.70 కోట్లకు చేరింది. కంపెనీ జూన్ త్రైమాసికంలో నికర లాభం 4.61 శాతం పెరిగి రూ.13,349 కోట్లకు చేరింది.

పశ్చిమాసియా సంక్షోభం ప్రభావం తగ్గడంతో ప్రస్తుత త్రైమాసికంలో డిమాండ్ మెరుగుపడు



తుందని కంపెనీ తెలిపింది. ఐసీఐసీఐ బ్యాంక్ మార్కెట్ విలువ రూ.29,062.06 కోట్లు పెరిగి రూ.10,34,441.77 కోట్లకు చేరగా రిలయన్స్ ఇండస్ట్రీస్ విలువ రూ.23,884.93కోట్లు పెరిగి రూ.17,95,091.26కోట్లకు చేరుకుంది. బజాజ్ ఫైనాన్స్ మార్కెట్ క్యాప్ రూ.21,946.50కోట్లు పెరిగి రూ.6,57,274.28 కోట్లకు చేరితే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) విలువ 7వేల 338.34 కోట్లు పెరిగి రూ.9,63,768.78 కోట్లకు చేరింది. నష్టపోయిన సంస్థల్లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతి ఎయిర్‌టెల్, ఎల్ఐసీ, లార్సెన్ అండ్ టుబ్రో, హిందుస్థాన్ యూనిలీవర్ లున్నాయి. ఎల్‌అండ్‌టీ మార్కెట్ విలువ రూ. 18,097.72 కోట్లు తగ్గి రూ.5,24,840.68 కోట్లకు పడిపోయింది.

ఎల్ఐసీ విలువ రూ.12080.75 కోట్లు తగ్గి రూ.5,48,124.30కోట్లకు చేరింది. భారతిఎయిర్‌టెల్ మార్కెట్ క్యాప్ రూ.7,706.45 కోట్లు క్షీణించి 11,91,067.77కోట్లకు పరిమితమైంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ విలువ రూ.7,084.61 కోట్లు తగ్గి రూ.12,62,369.81కోట్లకు చేరింది. హిందుస్థాన్ యూనిలీవర్ మార్కెట్ విలువ రూ.1,221.79 కోట్లు తగ్గి రూ.5,03,775.86 కోట్లకు నిలిచింది. మార్కెట్ విలువల్లో టాప్10 కంపెనీలుమార్కెట్ క్యాపిటలైజేషన్ పరంగా రిలయన్స్ ఇండస్ట్రీస్ అగ్రస్థానాన్ని కొనసాగించింది. ఆ తరువాత వరుసగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతి ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ఇండియా, టీసీఎస్, బజాజ్ ఫైనాన్స్, ఎల్ఐసీ, లార్సెన్ అండ్ టుబ్రో, హిందుస్థాన్ యూనిలీవర్ స్థానాలు దక్కించుకున్నాయి.


## ధరల పెరుగుదలతో తగ్గిన స్మార్ట్ టివి సేల్స్

**బెంగళూరు, జులై 19:** దేశీయ స్మార్ట్ టీవీ మార్కెట్ వరుసగా రెండో త్రైమాసికంలోనూ మందగమనాన్ని నమోదు చేసింది. తొలి త్రైమాసికంలో స్మార్ట్ టీవీల అమ్మకాల పరిమాణం గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 5.7 శాతం తగ్గినట్లు పరిశ్రమ అంచనావేస్తోంది. అంతకుముందు జనవరిమార్చి త్రైమాసికంలో కూడా అమ్మకాలు 3 శాతం తగ్గాయి. ఈ వివరాలను కౌంటర్ పాయింట్ రీసెర్చ్ సంస్థలు, మార్కెట్ ఛానల్ విశ్లేషణలు వెల్లడించాయి. ధరలు గణనీయంగా పెరగడంతో ముఖ్యంగా ఎంట్రీలెవల్ స్మార్ట్ టీవీల కొనుగోళ్లను వినియోగదారులు వాయిదా వేయడం వల్ల ఈ విభాగంలో అమ్మకాలు మరింతగా పడిపోయాయి. ఐడిసి గణాంకాల ప్రకారం, 43 అంగుళాలు లేదా అంతకంటే చిన్న స్మార్ట్ టీవీల అమ్మకాలు 6.8 శాతం తగ్గాయి. మరోవైపు, 43 అంగుళాలకు పైబడిన టీవీల అమ్మకాలు 3.5 శాతం మాత్రమే తగ్గాయి. దీంతో ప్రీమియం టీవీల విభాగం తక్కువ ప్రభావాన్ని ఎదుర్కొన్నట్లు తెలుస్తోంది. ఐడిసి రీసెర్చ్ అనలిస్ట్ దేవాశిష్ జనా మాట్లాడుతూ, పెరిగిన ధరలు వినియోగదారుల కొనుగోలు సామర్థ్యంపై ప్రభావం చూపుతున్నాయని, ముఖ్యంగా సామాన్య వినియోగదారుల కోసం ఉద్దేశించిన మాస్‌మార్కెట్ విభాగంలో డిమాండ్ బలహీనంగా కొనసాగుతోందని తెలిపారు. పరిశ్రమ అంచనాల ప్రకారం, రెండోత్రైమాసికంలో 32అంగుళాల నుంచి 43అంగుళాల వరకు ఉన్న స్మార్ట్ టీవీల ధరలు దాదాపు 17 శాతం పెరిగాయి. అదే సమయంలో 43 అంగుళాలకు పైబడిన టీవీల ధరలు కేవలం 67 శాతం మాత్రమే పెరిగాయి.

తయారీ వ్యయాలు, ఎలక్ట్రానిక్ భాగాల ధరల పెరుగుదల, రూపాయి బలహీనత వంటి కారణాలతో మూడోత్రైమాసింలో మరో 10 శాతం వరకు ధరలు పెరిగే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ ప్రిన్సిపల్ అనలిస్ట్



అన్షికా జైన్ మాట్లాడుతూ, చిన్న సైజు టీవీల అమ్మకాలలో ఎక్కువ తగ్గుదల కనిపించడం వెనుక ప్రధాన కారణం ఎంట్రీలెవల్ వినియోగదారులపై ధరల భారం పెరగడమేనని చెప్పారు. ముఖ్యంగా మెమరీ చిప్‌ల ధరలు భారీగా పెరగడంతో తక్కువ ధర టీవీల తయారీ ఖర్చు గణనీయంగా పెరిగిందని, అదే సమయంలో ద్రవ్యోల్బణం కూడా సామాన్య వినియోగదారుల కొనుగోలు సామర్థ్యాన్ని దెబ్బతీసిందని వివరించారు.




## ఫోరెన్సిక్ ఆడిట్లకు మరో18 సంస్థల ఎంపిక

**ముంబయి, జులై 19:** మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ లిస్టెడ్ కంపెనీల ఆర్థిక నివేదికలపై ఫోరెన్సిక్ ఆడిట్లు నిర్వహించేందుకు మరో 18 ఆడిట్, కన్సల్టింగ్ సంస్థలను తన అధికారిక ప్యానెల్‌లో చేర్చింది. వీటిలో ప్రముఖ అంతర్జాతీయ సంస్థలు ఎర్నెస్ట్ యంగ్‌ఎల్‌ఎల్‌పి, కేపీఎంజీ అష్యూరెన్స్ అండ్ కన్సల్టింగ్ సర్వీసెస్, జెడ్‌ఎక్స్ గ్రాంట్ థార్న్‌న్ భారత్, నాంగియా అండ్ కో ఎల్‌ఎల్‌పిలున్నాయి. ఈ ఎంపిక ప్రక్రియను సెబీ 2025 నవంబర్‌లో విడుదల చేసిన పబ్లిక్ ప్రొక్యూర్‌మెంట్ నోటీసు ఆధారంగా నిర్వహించింది. తాజాగా ఎంపికైన సంస్థలను 2025 ఏప్రిల్‌లో ప్రకటించిన ఫోరెన్సిక్ ఆడిటర్ల జాబితాకు అదనంగా చేర్చినట్లు సెబీ నోటిఫికేషన్‌లో వెల్లడించింది. సెబీ తాజా జాబితాలో చోటు దక్కిన సంస్థలకు మూడు సంవత్సరాల పాటు ఈ ఎంపానెల్‌మెంట్ చెల్లుబాటు అవుతుంది. నాంగియా కో ఎల్‌ఎల్‌పి ఫోరెన్సిక్ అడ్వైజరీ సీనియర్ పార్ట్‌నర్ శ్రీనివాస రావు మాట్లాడుతూ, సెబీ ఎంపానెల్‌లో చోటు దక్కడం తమ ఫోరెన్సిక్ సేవల నైపుణ్యానికి నిదర్శనమన్నారు.

ఫోరెన్సిక్ ఆడిట్ ప్యానెల్ ఉద్దేశం లిస్టెడ్ కంపెనీ లలో ఆర్థిక అక్రమాలు లేదా లెక్కల అవకతవకలు ఉన్నాయనే అనుమానాలు తలెత్తినప్పుడు, వాటిపై లోతైన విచారణ నిర్వహించేందుకు సెబీ ఈ ఫోరెన్సిక్ ఆడిటర్ల ప్యానెల్‌ను ఉపయోగిస్తుంది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14